


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

హరీశ్ ఆదేశాల మేరకే నడుచుకున్నాం

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ప్రత్యేక యాప్

చరిత్ర తెలియని అజ్ఞానం – హిందుత్వ అహంకారం

లోపలి పేజీల్లో

సంపుటి 07, సంచిక: 326 | ఆదివారం | 27-10-2024 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## స్కిల్ వర్సిటీకి ఎంఇఐఎల్ రూ.200 కోట్ల విరాళం

ప్రజాపక్షం / హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించేందుకు ముందుకొచ్చిన ఎంఇఐఎల్ ఫౌండేషన్ రూ. 200 కోట్ల భూరి విరాళాన్ని ప్రకటించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమక్షంలో ప్రభుత్వం తరపున స్కిల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వివిఎల్ వివిఎస్. సుబ్బారావు, ఎంఇఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్ పివి.కృష్ణారెడ్డి శనివారం అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపి అనీల్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, తరువాయి 2లో

### దీపావళి కానుకగా
## ఉద్యోగులకు ఒక డిఎ

4 గంటలు సాగిన కేబినెట్ భేటీ

ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డిఎను ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. సమ్మక్క సారలమ్మ గిరిజన వర్సిటీకి 211 ఎకరాలు కేటాయిస్తూ మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన శనివారం సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సుమారు నాలుగు గంటల పాటు సమావేశం జరిగింది. హైదరాబాద్ మెట్రో రైల్ మార్గాలను నాగోల్ నుంచి ఎల్.బినగర్ వరకు, ఎల్.బి.నగర్ నుంచి హయత్‌నగర్ వరకు, ఎల్.బినగర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు మెట్రో విస్తరణకు కరూడా మంత్రివర్గం తరువాయి 2లో

### హైదరాబాద్ అభివృద్ధిపై
## విష ప్రచారం

భూ రిజిస్ట్రేషన్లు ఊపందుకున్నాయ్ హైటెక్స్‌లో నిర్వహించిన 'ప్రాపర్టీ షో'లో డిప్యూటీ సిఎం భట్టి



ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో జరుగుతున్న అభివృద్ధిపై కొందరు విష ప్రచారం చేస్తున్నారని బిఆర్‌ఎస్‌పై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విమర్శలు చేశారు. అసెంబ్లీ, పార్లమెంటు తరువాయి 12లో



### మత రాజకీయాల ప్రభావంతో
## అసలు సమస్యలు పక్కదారి

వామపక్షాలతోనే మతసామరస్యం, హైదరాబాద్ ప్రతిష్ట నిలబడటం సాధ్యం

సిపిఐ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాపక్షం / హైదరాబాద్ / ఖైరతాబాద్

ప్రపంచవ్యాప్తంగా స్ఫూర్తి పొందిన తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర ద్వారా ప్రజలను చైతన్యవంతం చేసిన సిపిఐ, వామపక్షాలతోనే మతసామరస్యం పరిరక్షణ, హైదరాబాద్ ప్రతిష్ట నిలబడడం సాధ్యమవుతుందని పలువురు లౌకిక, ప్రజాతంత్రవాదులు, విద్యావేత్తలు అన్నారు. ఇందుకు అన్ని వామపక్ష పార్టీలు ఐక్య కార్యాచరణతో ప్రజాఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. 'హైదరాబాద్ ప్రతిష్టను దెబ్బతీసే మతోన్మాద రాజకీయ కుట్రలపై ప్రజలను చైతన్య పరుచుదాం' అనే అంశంపై రౌండ్ టేండ్ సమావేశం సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి తరువాయి 2లో



### ఐఎఎస్ అమోయ్‌కుమార్ చుట్టూ
## బిగుస్తున్న ఉచ్చు

భూదాన్ భూముల కుంభకోణంపై ఇడి విచారణ

దర్యాప్తు సంస్థ కార్యాలయానికి ఫిర్యాదుల వెల్లువ

రూ.వేల కోట్ల కుంభకోణం : వేల సంఖ్యలో బాధితులు

ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో రంగారెడ్డి, మేడ్చల్ –మల్కాజ్‌గిరి జిల్లాలకు కలెక్టర్‌గా పనిచేసిన సీనియర్ ఐఎఎస్ అధికారి అమోయ్‌కుమార్‌కు రోజు రోజుకు ఉచ్చు బిగుస్తుంది. రంగారెడ్డి జిల్లా నాగారం భూదాన్ భూముల కుంభకోణంలో అమోయ్‌కుమార్‌ను ఇడి విచారణను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఇప్పటికే మూడు రోజుల పాటు ఇడి అధికారులు అమోయ్‌కుమార్‌ను విచారించారు. సోమవారం మరోసారి విచారణకు రావాలంటూ ఇడి అధికారులు అతనికి సూచించారు. భూదాన్ భూముల కుంభకోణంతో పాటు రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలకు చెందిన వందలాది తరువాయి 2లో




### సచివాలయం ముట్టడికి
## ఎఐఎస్‌ఎఫ్ యత్నం

అడ్డుకున్న పోలీసులు : భగ్గుమన్న విద్యార్థి నేతలు

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, బోధన రుసుం విడుదల చేయాలని డిమాండ్

ప్రజాపక్షం /హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఎఐఎస్‌ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఫీజులు విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందంటూ మండిపడ్డారు. ఫీజులు తరువాయి 2లో



### క్రమశిక్షణగల ఫోర్స్‌లో ఉండి
## ఆందోళనలు సరికాదు

పోలీసు కుటుంబాల నిరసనలపై డిజిపి సీరియస్

ఘటనల వెనుక ప్రభుత్వ వ్యతిరేక శక్తులు : డిజిపి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీసు (టిజిఎస్‌పి) బెటాలియన్‌లో సెలవుల విషయంలో ఇప్పటికే పాత పద్ధతిని అనుసరిస్తామని చెబుతున్నప్పటికీ ఆందోళనను కొనసాగిస్తుండడంపై రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనకు దిగిన వారిపై తీవ్ర చర్యలు ఉంటాయని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇప్పటికే కొంతమందిని గుర్తించినట్లు ఆయన తెలిపారు. కావాలని కొందరు పోలీసు శాఖను అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. కానిస్టేబుల్ ఆందోళన వెనకాల కొంతమంది ప్రభుత్వ వ్యతిరేక శక్తుల హస్తముందని ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. బెటాలియన్ పోలీసుల ఆందోళనలపై తెలంగాణ తరువాయి 2లో



# ఓటింగ్‌కు తొమ్మిది రోజులు కౌంట్‌డౌన్

## ట్రంప్ పైచేయి? డెమోక్రాట్లలో ఆందోళన



**మిచిగన్ :** మరో పది రోజుల్లో కీలకమైన అమెరికా అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో డోనాల్డ్ ట్రంప్ పైచేయి సాధిస్తున్నట్లు వస్తున్న వార్తలతో డెమోక్రాట్లలో ఆందోళన నెలకొంది. ముఖ్యంగా 1992 నుండి 2012 వరకు డెమోక్రాట్లకు గట్టి పట్టున్న ఓటర్ల విజయం చేకూర్చిపెట్టిన 18 రాష్ట్రాలలో (బ్లూవాల్ స్టేట్స్) డోనాల్డ్ ట్రంప్ పాగా వేశారని పోల్ సర్వే నివేదికలు రావడం వతో డెమోక్రటిక్‌పార్టీలో ఆందోళన రేగుతున్నది. నవంబరు ఐదోతేదీ మంగళవారంనాడు అమెరికాలో అధ్యక్ష ఎన్నికల పోలింగ్ జరగనున్నది. నల్ల జాతీయులు, లాటిన్ అమెరికా జాతీయులు ఎక్కువగా ఉన్న మిచిగన్, విస్కాన్సిన్, పెన్సిల్వేనియా రాష్ట్రాలలో కమలాహారిస్‌కు తిరుగులేదని ఇప్పటివరకూ డెమోక్రటిక్‌పార్టీ నాయకులు భావిస్తూ వచ్చారు. ఐతే ప్రత్యేకించి మిచిగన్‌లో కమలాహారిస్‌కు సమస్య వచ్చి పడింది. ఈ ప్రాంతంలో అరబ్ దేశాలకు చెందిన అమెరికన్ ఓటర్లు ఎక్కువమంది ఉన్నారు. 2020లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో డోనాల్డ్ ట్రంప్ 1.50 లక్షల ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. మిచిగన్‌లో 3,00,000 మం ది అరబ్ దేశాలకు చెందిన అమెరికన్ ఓటర్లు ఉన్నారు. కమలాహారిస్ మిచిగన్ ఎన్నికల ప్రచారంలో గాజాలో పరిస్థితి పట్ల తీవ్ర మనోవేదన వ్యక్తం చేస్తున్నప్పటికీ కూడా బైడెన్ ప్రభుత్వం ఎందుకు ఇజ్రాయెల్‌కు ఆయుధాల సరఫరా నిలిపివేయడంలేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికి డిసైడింగ్ ఫ్యాక్టర్‌గా ఉన్న కొన్ని రాష్ట్రాలలో ట్రంప్ – కమలా హారిస్ మధ్య పోటీ నువ్వా–నేనా అన్న రీతిలో ఉండటంవల్ల కూడా డెమోక్రాట్స్‌లో ఆందోళన పెరుగుతున్నది. ఐతే గత కొద్ది రోజులుగా కమలాహారిస్ తన ఎన్నికల ప్రచారంలో ట్రంప్‌పై విమర్శల దాడిని ఉధృతం చేశారు. రెండోసారి ట్రంప్ గనుక అధికారంలోకి వస్తే అమెరికాలో చాలా తీవ్ర పరిణామాలు సంభవిస్తాయని ఆమె ఓటర్లకు పదే పదే హెచ్చరికలు చేస్తూ వస్తున్నారు. ఐతే సిఎన్‌ఎన్ తాజా నేషనల్ పోల్ సర్వే ప్రకారం డోనాల్డ్‌ట్రంప్‌కు 48 శాతం, కమలా హారిస్‌కు 46 శాతం మేరకు ఓటర్లలో ఇమేజ్ ఉన్నట్లు, పరిస్థితి నువ్వా నేనా అన్నరీతిలో మార్పులేకుండా కొనసాగుతున్నట్లు తెలుస్తున్నది. దేశ ఆర్థిక సమస్యలను ప్రతిబింబించి ప్రజలకు వివరించడంలో ట్రంప్ ఎన్నికల ప్రచారంలో ముందంజలో ఉండగా, నైతిక విలువలు, దేశ భవిష్యత్తు, వినయవిధేయతలు, దేశాధ్యక్షుడికి ఉండాల్సిన ఫిట్‌నెస్ వంటి విషయాలపై ప్రచారంలో కమలాహారిస్ ముందంజలో ఉన్నారు. ఒకవేళ ఇద్దరిమధ్య పోల్ మార్జిన్‌లో తేడాపొరలు ఉన్నాయనుకున్న ఈ తేడా 3.1 శాతం వరకూ కూడా ఉండవచ్చునని పోల్ సర్వే పేర్కొంది.

## పాకిస్థాన్ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ యాహ్యా అఫ్రిది



**ఇస్లామాబాద్ :** పాకిస్తాన్ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ యాహ్యా అఫ్రిది శనివారంనాడు ప్రమాణస్వీకారం చేశారు. పాకిస్తాన్ అత్యున్నత న్యాయస్థానానికి 30వ ప్రధాన న్యాయమూర్తిగా ఆయన బాధ్యత లు చేపట్టారు. ఇప్పటివరకూ జస్టిస్ క్వాజీ ఫయిజ్ ఇసా ఈ బాధ్యతలు నిర్వహించారు. ఆయన పదవీ విరమణతో అఫ్రిది ఆ స్థానాన్ని భర్తీ చేశారు. దేశాధ్యక్షుడు ఆసిఫ్ అల్ జర్దారీ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, ఆయన మంత్రివర్గ సభ్యులు, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇటీవల రాజ్యాంగానికి చేసిన 26వ సవరణ తర్వాత ఏర్పడిన ప్రత్యేక పార్లమెంటరీ కమిటీ పాకిస్తాన్ న్యాయవ్యవస్థలో అనేక కొత్త మార్పులు తీసుకువచ్చింది. ఈ మార్పుల్లో భాగంగా అఫ్రిదీని ప్రధాన న్యాయమూర్తి పదవికి ఈ కమిటీ ఎంపిక చేసింది. సీనియారిటీ ప్రాతిపదికపై సీనియర్ మోస్ట్ న్యాయమూర్తి పాకిస్తాన్ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా ఈ పార్లమెంటరీ కమిటీ అఫ్రిదీని ఈ పదవికి ఎంపిక చేసింది. సీనియారిటీ జాబితాలో అఫ్రిదీకంటే ఇంకా అర్హులైనవారు ఇంకా ఇద్దరు ఉన్నారు. వారిని కాదని మూడోస్థానంలో ఉన్న అఫ్రిదీని ఈ పదవికి పార్లమెంటరీ కమిటీ ఎంపిక చేయడం ద్వారా న్యాయవ్యవస్థపై పార్లమెంటరీ పెత్తనాన్ని చాటి చెప్పింది.

# ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రతీకార దాడి

- ఇద్దరు సైనికులు మృతి : అరబ్ దేశాల ఖండన
- సమర్థించిన అమెరికా, ప్రతిదాడి చేయొద్దని ఇరాన్‌కు సలహా

**టెహ్రాన్ :** ఎట్టకేలకు ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రతీకార దాడులు చేసింది. దాదాపు పాతిక రోజుల విరామం తర్వాత ఇరాన్ సైనికస్థావరాలు, క్షిపణి కేంద్రాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ శనివారం నాడు తెల్లవారకముందే ప్రతీకార దాడులు చేసింది. ఈ దాడుల్లో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్‌కు చెందిన ఇద్దరు సైనికులు మరణించారు. ఇరాన్ ప్రభుత్వం ఈ విషయం ధృవీకరించినప్పటికీ దాడులవల్ల నష్టం చాలా పరిమితంగానే ఉందని ప్రకటించింది. ఐతే ఇప్పుడు ఇరాన్ తిరిగి దాడులు ప్రారంభిస్తే ఈ యుద్ధం అందరూ ఊహించినట్టే ఉధృతం అవుతుందన్న విషయంపై మళ్ళీ ఆందోళన రేగింది. ఇజ్రాయెల్ దాడులను అరబ్ దేశాలు ఖండించాయి. సౌదీఅరేబియా, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలు ఈ దాడులను తీవ్రంగా వ్యతిరేకించాయి. అమెరికా మాత్రం దాడులను సమర్థించింది. స్వీయరక్షణలో భాగంగానే ఇజ్రాయెల్ ఈ దాడులు చేసిందని ప్రకటిస్తూ, మళ్ళీ ప్రతీకార దాడులకు పాల్పడవద్దని ఇరాన్‌కు సలహా ఇచ్చింది.

ఇజ్రాయెల్ మిలిటరీ అధికార ప్రతినిధి డేనియల్ హగర్ స్పందిస్తూ, ఇరాన్ క్షిపణి తయారీ కేంద్రాలను, భూతలం నుండి గగనతల లక్ష్యాలను ఛేదించగల క్షిపణి కేంద్రాలను కూడా తమ వాయుసేన లక్ష్యంగా చేసుకుంద ని, ఇప్పుడు ఇరాన్‌కంటే తాము బలమైనస్థానం లో ఉన్నామని ప్రకటించారు. ఐతే బిబిసి కథనం ప్రకారం, ఈ తాజా దాడులకు ముందుగా, "తమపై ఎలాంటి ప్రతీకార దాడులూ చేయవద్దు" అని థర్డ్‌పార్టీ ద్వారా ఇరాన్‌కు యూదు పాలకవర్గం సందేశం పంపిందని ఇజ్రాయెల్ మీడియా ప్రకటించింది. రెండు దేశాలూ పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధపడటంలేదనీ, అందువల్ల నే ఇరాన్ చమురు స్థావరాలు, అణుకేంద్రాలను ఇజ్రాయెల్ వాయుసేన ఉద్దేశపూర్వకంగా దాడు ల నుండి మినహాయించిందనీ విశ్లేషకులు అంచనా వేసినట్లు పేర్కొంది. ఇలామ్, ఖుజెస్థాన్, టెహ్రాన్ లక్ష్యంగా ఇజ్రాయెల్ వాయుసేన ఈ దాడులు చేసింది. తమ దేశ గౌరవ ప్రతిష్ఠలను, సార్వభౌమత్వాన్ని రక్షించుకునేందుకు ఇరాన్‌పై దాడి చేసే హక్కు తమకు ఉందని దాడుల అనంతరం ఇజ్రాయెల్ విదేశాంగమంత్రిత్వశాఖ ప్రకటించింది. అనేక నెలలుగా కొనసాగుతున్న దాడులకు, అక్టోబరు ఒకటోతేదీన ప్రవాహంలా చేసిన క్షిపణి దాడులకు ప్రతీకారంగా టెహ్రాన్‌కు ఆగ్నేయంగా ఉన్న స్థావరాలపైన, పశ్చిమప్రాంత స్థావరాలపైన దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ రక్షణశాఖ పేర్కొంది. ఈ ఏడాది సెప్టెంబ రు 27న హిజ్బొల్లా సెక్రటరీ జనరల్ హసన్ నస్రల్లా లక్ష్యంగా బీరూట్‌లోని హిజ్బొల్లా కేంద్ర కార్యాలయంపై ఇజ్రాయెల్ వాయుసేన పథకం ప్రకారం దాడిచేసింది. నస్రల్లా హత్యతో ఇరాన్ ఆగ్రహంతో ఊగిపోయింది. హమాస్, లెబనాన్‌లలో కీలకనాయకులను మట్టుపెడుతూ ఇరాన్ కు తీరని గాయాలు చేస్తున్న ఇజ్రాయెల్‌పై దాడు లు చేసేందుకు అదనుకోసం ఎదురుచూసి ఇరాన్ అక్టోబరు ఒకటిన ఒకేసారి 180 క్షిపణులను ప్రయోగించింది. దీంతో పశ్చిమాసియాలో యుద్ధం ముదిరిపాకానపడిందని, ఇది ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందని అందరూ భయపడ్డారు. కానీ ఇజ్రాయెల్‌కు పలు దేశాల సహాయ నిరాకరణవల్ల, ఇతర కారణాలవల్ల ఇరాన్‌పై తక్షణ ప్రతీకారానికి సిద్ధపడకుండా ఆచితూచి వ్యవహరించి నేతన్యాహూ ఈ తాజా దాడులకు ప్రణాళిక చేశారు.

**ఇది అంతర్జాతీయ చట్ట ఉల్లంఘన**
**ఎదురుదాడి చేస్తాం: ఇరాన్ ప్రతిజ్ఞ**

శనివారం తెల్లవారుజామునకు ముందుగానే ఇజ్రాయెల్ చేసిన దాడులపై ఇరాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ స్పందించింది. ఇజ్రాయెల్ చర్యను ఖండించింది. ప్రతిదాడులు చేస్తామని ప్రతిజ్ఞ చేసింది. ఇజ్రాయెల్ తమ సైనిక స్థావరాలపై దాడులు చేసిందని ధృవీకరించింది. అంతర్జాతీయ చట్టాలను, ఐక్యరాజ్యసమితి హక్కుల పత్రాన్ని చాలా స్పష్టంగా ఉల్లంఘించడమేనని ఇరాన్ విదేశాంగశాఖపేర్కొంది. ఐక్యరాజ్యసమితి ఛార్టర్‌లోని 51వ అధికరణ ప్రకారం ప్రతీకార దాడి చేసే వారసత్వహక్కు, సార్వభౌమత్వ, స్వీయరక్షణ హక్కు తమకు ఉందని ఉద్ఘాటించింది.

**ఏడాదికాలంగా 2,600మంది మృతి**
**లెబనాన్ ఆరోగ్యశాఖ ప్రకటన**

ఇరాన్‌పై దాడులు చేయడాన్ని లెబనాన్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడులు పశ్చిమ ఆసియాలో, గాజాలో, లెబనాన్‌లో కూడా మరింతగా ఉధృతమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. లెబనాన్ ఆరోగ్యమంత్రిత్వశాఖ శనివారం ఒక ప్రకటన చేస్తూ, గడచిన ఏడాదికాలంగా ఇజ్రాయెల్ చేస్తున్న దాడులవల్ల లెబనాన్‌లో 2,600 మంది మరణించారనీ, మరో 12, 200మంది గాయపడ్డారని పేర్కొంది. ఈ యుద్ధంవల్ల లెబనాన్‌లో 10.20 లక్షలమమంది ఇళ్ళు ఖాళీచేశారనీ, వీరిలో 4,00,000 లక్షల మంది పిల్లలు ఉన్నారని ఐక్యరాజ్యసమితి చిల్డ్రన్స్ ఏజన్సీ ప్రకటించిందని పేర్కొంది. ఇజ్రాయెల్ దాడుల్లో హిజ్బొల్లాకు చెందిన అగ్రశ్రేణి నాయకత్వంలో అనేకమంది మరణించారు. ముఖ్యంగా సెప్టెంబరు దాడుల్లోనే ఎక్కువమంది నాయకులు మరణించారు. కాగా 2023 అక్టోబరు రెండోవారం నుండీ పాలస్తీనా, గాజాలో జరుగుతున్న యుద్ధంలో 42,847మంది పౌరులు మరణించారు.మరో1,00,544మందిగాయపడ్డారు.

## జార్జియా ఇయులో చేరుతుందా?

### పార్లమెంటుకు కీలక ఎన్నికలు





**తిబ్లిసి :** జార్జియా పార్లమెంటుకు శనివారంనాడు ఎన్నికలు జరిగాయి. యూరోపియన్ యూనియన్‌లో చేరాలా? వద్దా? అనే విషయంపై ఈ ఎన్నికలు దిశానిర్దేశం చేస్తాయి. తూర్పు యూరప్, పశ్చిమ ఆసి యా ప్రాంతాలలో విస్తరించి ఉన్న కాకాసియా (కాకసస్)దేశం జార్జియా యూరోపియన్ యూనియన్‌లో చేరే విషయాన్ని కూడా ఈ ఎన్నికలే నిర్దేశించనున్నాయి. 1991లో సోవియట్ యూనియన్ నుండి స్వాతంత్ర్యం పొందిన జార్జియాకు ఈ ఎన్నికలు అత్యంత కీలకంగా మారాయి. రష్యా అనుకూల అధికార డ్రీమ్ పార్టీని పాశ్చాత్యదేశాల అనుకూల ప్రతిపక్షం సవాలు చేస్తున్నది. యూరోపియన్ యూనియన్‌లో చేరాలో వద్దో తేల్చుకోవాలని ఇప్పటికే ఇయూ కూడా జార్జియా ఓటర్లను హెచ్చరించింది. ఐతే ముందస్తు ఎన్నికల సర్వే ప్రకారం దేశంలో ఎక్కువమంది యూరోపియన్ యూనియన్‌లో చేరేందుకే మొగ్గ చూపుతుఆన్నరు. విదేశాంగవిధానమే ప్రధానంగా ఎన్నికల ప్రచారంలో ప్రజలను ప్రభావితం చేస్తున్నది. ప్రతిపక్షాలను తాము అడ్డుకుంటామని మాజీ ప్రధానమంత్రి ఇవానిస్ విలీ ఎన్నికల ప్రచార సభలో చెప్పారు. దేశంలో ప్రతిపక్షం యుద్ధ నేరాలకు పాల్పడిందని ఆయన విమర్శించారు. పాశ్చాత్యదేశాలకు అనుకూలంగా ఉన్న దేశాధ్యక్షురాలు సోలోమె జౌరాబిచ్‌విల్లీ కూడా ఉధృతంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. సరికొత్త జార్జియా నిర్మాణమే తమ లక్ష్యమని ఆమె వాదిస్తున్నారు.

## ఉక్రేన్‌పై యుద్ధానికి ఉత్తర కొరియా సైన్యం

**కీవ్ :** తమపై యుద్ధం చేసేందుకు రష్యాతో ఉత్తర కొరియా సైన్యం చేతులు కలిపిందని, వారి సైన్యం యుద్ధంలో చేరుతోందని ఉక్రేన్ అధ్యక్షుడు వ్లదిమీర్ జెలెన్స్కీ అన్నారు. ఉత్తర కొరియా సైన్యం కూడా రష్యాతో కలిసిందని ఇప్పటికే పాశ్చాత్యదేశాల అధికారులు ఉక్రేన్‌కు హెచ్చరించారు. వారం క్రితమే జెలెన్స్కీ ఒక ప్రకటన చేస్తూ 10,000 మంది ఉత్తర కొరియా సైన్యాలు తమదేశంపై దాడి చేసేందుకు రష్యా సైన్యంలో చేరాయని ప్రకటించారు. ఉక్రేన్ అధ్యక్ష కార్యాలయంలో సీనియర్ అధికారి ఒకరు మాట్లాడుతూ, ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ నిర్ణీత ప్రకారం కీవ్‌లో పర్యటించాల్సి ఉందని, జెలెన్స్కీ మాత్రం బ్రిక్స్ సదస్సులో పరిణామాల తర్వాత ఆయన పర్యటనను రద్దు చేశారని చెప్పారు. పుతిన్‌తో ఆంటోనియో గుటెర్రెస్ కరచాలనం చేస్తున్న ఫోటో దృశ్యాలు ఉక్రేన్‌లో ఆందోళన రేకెత్తించాయని పేరు చెప్పడానికి తిరస్కరించిన ఉక్రేన్ అధ్యక్ష భవన అధికారి చెప్పారు. ఇప్పటికి మూడు సంవత్సరాలుగా ఉక్రేన్‌లో యుద్ధం జరుగుతోంది. వైట్‌హౌస్ నేషనల్ సెక్యూరిటీ అధికార ప్రతినిధి జాన్ కిర్బీమాట్లాడుతూ, జపాన్, దక్షిణ కొరియా దేశాలు జరిపిన సమావేశంలో ఉత్తర కొరియాలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయన్నారు. తమతోపాటు ఈ మూడు దేశాల భద్రతా అధికారులూ ఈ పరిస్థితిపై సమీక్షించి ఈ విధమైన చర్యలకు దూరంగా ఉండాలని పిలుపు ఇచ్చినట్లు చెప్పారు. ఈ విధమైన చర్యలవల్ల భద్రతా సమస్యలు పెరుగుతాయని అన్నారు.

ఉక్రేన్‌తో యుద్ధానికి ఉత్తర కొరియా నుండి ఇప్పటికే మూడువేలకు పైగా సైనికులు రష్యాకు తరలివెళ్ళారన్నారు. వారికి రష్యా శిక్షణ ఇస్తోందని కిర్బీ విలేకరులతో చెప్పారు. ఐతే ఈ సైన్యం ఎక్కడికి వెళ్ళిందన్న విషయం తమకు పూర్తిగా తెలియరాలేదన్నారు. కానీ ఖచ్చితంగా ఈ సైన్యాలు రష్యాలోని కుర్స్క్ రీజియన్‌లో మోహరించి ఉంటాయన్నారు. కుర్స్క్ ప్రాంతంలో ఉత్తర కొరియా సైన్యాలను బుధవారం నాడు చూసినట్లు ఉక్రేన్ ఇంటిలిజెన్స్ వర్గా ల సమాచారం. రష్యాకు సుమారు 12,000 మంది ఉత్తర కొరియా సైన్యాలు వెళ్ళి ఉంటాయని వారు అంచనా వేస్తున్నారు.

## రూ.200 కోట్ల విరాళం

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ , ఎంఇఐఎల్ డైరెక్టర్లు బి. శ్రీనివాసరెడ్డి, సి హెచ్ సుబ్బయ్య, రవి రెడ్డి, దొరై స్వామి, ఎన్ తిరుపతి రావు, వైస్ ప్రెసిడెంట్ రమణారావు తదితరులు పాల్గొన్నారు. ఈ స్కిల్ యూనివర్సిటీలో అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్, లేబొరేటరీ బ్లాక్‌లు, గ్రంథాలయం, కంప్యూటర్ హబ్, విద్యార్థి, సిబ్బంది వసతి సముదాయాలు, పార్కింగ్, ఫుడ్ కోర్ట్, వివిధ రకాల సౌకర్యాలు, 700మంది కూర్చునేందుకు అనువుగా భారీ ఆడిటోరియం, సమావేశమందిరాలు, భద్రతా , ఇతర సిబ్బంది గృహ సముదాయాలను ఎంఇఐఎల్ ఫౌండేషన్ నిర్మించనుంది. ఈ యూనివర్సిటీ నిర్మాణానికి ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్ఖాన్ పేటలో శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎం ఈ ఐ ఎల్ ఫౌండేషన్ స్కిల్ యూనివర్సిటీ నిర్మాణానికి ముందుకు రావటం పట్ల అభినందించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఒప్పందంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటి ఏర్పాటు ప్రక్రియలో మరో ముందడుగు పడిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నెలకొల్పిన స్కిల్స్ యూనివర్సిటి భవన నిర్మాణానికి మేఘా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ముందుకు రావటం సంతోషకరమన్నారు. యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణానికి మేఘా ఇంజనీరింగ్ సంస్థ తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటి నిధుల నుంచి రూ.200కోట్లు కేటాయించిందన్నారు. వీటితో యూనివర్సిటి క్యాంపస్‌లో అవసరమైన భవనాలన్నింటినీ నిర్మించే బాధ్యతలను స్వీకరించిందన్నారు. ప్రపంచస్థాయి అధునాతన నమూనాలతో అన్ని మౌలిక వసతులు ఉండేలా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణం చేపట్టేందుకు కంపెనీ ముందుకు వచ్చిందన్నారు. సిఎస్‌ఆర్ నిధులతో ఈ క్యాంపస్ నిర్మాణానికి ఎంఈఐఎల్ ముందుకు వచ్చినందుకు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఐఎల్ ఎండి పివి కృష్ణారెడ్డి మాట్లాడుతూ తమ ఫౌండేషన్ దేశంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తుందన్నారు. యువతలో నైపుణ్యతను ప్రోత్సహించేందుకు ఇప్పటికే తమ ఫౌండేషన్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటి ఏర్పాటు చేయటంతో తమ వంతు బాధ్యతగా రూ. 200కోట్ల విరాళంతో దాని నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.

## ఎఐఎస్‌ఎఫ్ యత్నం

(మొదటి పేజీ తరువాయి)

విడుదల చేయకపోతే విద్యార్థుల చదువులు కొనసాగించేది ఏలా అన్ని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల బోధన రుసుం, ఉపకార వేతనాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సచివాలయాన్ని ముట్టడించేందుకు యత్నించారు. దీంతో పోలీసులు ఎఐఎస్‌ఎఫ్ నాయకులను బిఆర్‌కే భవన్ వద్ద అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. అప్రమత్తమైన పోలీసులు ఎఐఎస్‌ఎఫ్ నాయకులను అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. అంతకుముందు ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ ఎ స్టాలిన్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మ ణ్‌లు మాట్లాడుతూ రాష్ట్ర సర్కార్ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతూ విద్యార్థుల పట్ల వివక్షతను చూపుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రావటానికి విద్యార్థుల పోరాటం వారి తల్లిదండ్రుల సహాకారం ఉందన్న విషయం సిఎం రేవంత్ రెడ్డి గుర్తు పెట్టుకోవాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల ఉపకార వేతనాలు బోధన రుసులు రూ. 7650 కోట్ల పెండింగ్‌లో ఉన్నాయని, గత మూడేళ్లుగా వీటిని విడుదల చేయకపోవడంతో చదువులు పూర్తి చేసుకున్న విద్యార్థులు సర్టిఫికెట్లు తీసుకోవడానికి తీవ్ర ఇబ్బందుల పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఇటికాల రామకృష్ణ బానోత్ రాఘురాం, గ్యార క్రాంతి, రహమాన్, బరిగల వెంకటేష్, సి. రాజు,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు , చైతన్య,వంశీవర్ధన్ రెడ్డి,ముదిగొండ మురళీ,జేరిపోతుల జనార్ధన్, రామరావు వెంకటేష్, దత్తు రెడ్డి, పవన్ చౌహాన్, అంజి, యూనస్ , హరీష్, శ్రావణి , పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## బిగుస్తున్న ఉచ్చు (మొదటి పేజీ తరువాయి)

మంది బాధితులు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ (ఇడి) కార్యాలయానికి క్యూ కట్టారు. అమోయ్‌కుమార్ భాగోతాలపై ఇడి అధికారులకు బాధితుల ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అమోయ్‌కుమార్ వేల కోట్ల రూపాయల భూ కుంభకోణానికి పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుమారు నాలుగు వేల మంది బాధితులు అమోయ్‌కుమార్‌పై ఫిర్యాదు చేశారు.

**మధురానగర్‌లో రూ.1000 కోట్ల భూమి హాంఫట్..**

అమోయ్‌కుమార్‌ను ఇడి అధికారులు విచారిస్తున్న సమయంలోనే రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం మధురానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం. రామ్మోహన్‌గౌడ్, ఉపాధ్యక్షులు రాగిడి లక్ష్మారెడ్డి, నేతలు నర్సింహ్మారెడ్డి, ఆంజనేయులు, రాజమోహన్‌రెడ్డి, వసంత, శివ, అమీర్‌లు ఇడి కార్యాలయానికి చేరుకున్నారు. మధురానగర్‌లోని సుమారు రూ.1000 కోట్ల విలువైన 72 ఎకరాల భూమికి సంబంధించి రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన అమోయ్‌కుమార్ ధరణి వచ్చిన తరువాత రికార్డులను తారుమారు చేసి తమకు అన్యాయం చేశారని వారు ఇడి అధికారులకు ఫిర్యాదు చేశారు. మధురానగర్‌లోని సర్వేనెంబర్‌లో ఉన్న 72 ఎకరాలలో 840 ప్లాట్లుగా చేసి 1979లో విక్రయించా రు. 840మంది ఇక్కడ ప్లాట్లను ఖరీదు చేశారు. అన్ని రికార్డులు కూడా ఉన్నాయి. అయితే ఈ భూమిని అమోయ్ ఎవరికి చెప్పకుండా గుట్టు చప్పుడు కాకుండా అమోడా బిల్డర్స్‌కు బదలాయించారని వారు ఆరోపించారు. అమోడా బిల్డర్స్‌తో అమోయ్‌కుమార్ కుమ్మకై తమకు అన్యాయం చేశారని అతనిపై చట్టపరమైన చర్య లు తీసుకోవాలని బాధితులు ఇడి అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బాధితులకు ఇడి అధికారులు హామి ఇచ్చారు.

**మేడ్చల్ జిల్లాలో రూ.30,000కోట్ల భూ కుంభకోణం**

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా వట్టినాగులపల్లి లోని శంకర్ హిల్స్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం ఇడి అధికారులకు అమోయ్‌కుమార్‌పై మరో పిర్యాదు చేశారు. ధరణి అడ్డం పెట్టుకొని అక్రమాలకు పాల్పడ్డారని పిర్యాదులో పేర్కొన్నారు. శంకర్‌హిల్స్‌లోని 200ఎకరాలకు అక్రమ రిజిస్ట్రేషన్‌లు చేశారని ఇడి అధికారులకు బాధితులు వెల్లడించారు. తమ ఫ్లాట్లను ఎకరాల్లోకి మార్చి అడ్డగోలు రిజిస్ట్రేషన్లు చేశారని పిర్యాదులో పేర్కొన్నారు. 40 ఏళ్లుగా పొజిషన్లో ఉన్నా బలగాలతో వెళ్ళగొట్టే యత్నం చేశారని ఆరోపించారు. హైకోర్టు నుంచి స్టే ఆర్డర్ ఉన్నాఅమోయ్‌కుమార్ పట్టించుకొలేదని కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారన్నారు.

ఉదయం ఏడు గంటలకు రిజిస్ట్రేషన్, రాత్రికి రాత్రే పత్రాల సృష్టించారన్నారు. సర్వేనెంబర్ 111 నుండి 191 వరకు ఉన్న 460 ఎకరాల భూమి శంకర్ హిల్స్ లో సుమారు 3300 మంది ఫ్లాట్ ఓనర్స్ ఉన్నారన్నారు. సుమారు 30 వేల కోట్ల రూపాయల భూకుంభ కోణానికి పాల్పడ్డారంటున్న బాధితులు తమకు జరిగిన అన్యాయంపై ఈడికి ఫిర్యాదు చేశారు. ఐఏఎస్ అమోయ్ కుమార్ తోపాటు ఇతర అధికారులు, పెద్దల పాత్రపై దర్యాప్తు జరపాలంటున్న బాధితులు ఇడి అధికారులకు వెల్లడించారు.

## ఒక 'డిఎ'

(మొదటి పేజీ తరువాయి)

ఆమోదించింది. ముఖ్యంగా మూసీ పునరుజ్జీవ చర్యలు, హైడ్రా, 317 జిఒ , ఉద్యోగుల డిఎలు, ధాన్యం కొనుగోళ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ తదితర అంశాలపై మంత్రివర్గం చర్చించింది. అలాగే పలు అంశాలకు కూడా మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. సన్న బియ్యానికి రూ.500 బోనస్ ఇచ్చేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఏటూరునాగారంను రెవెన్యూ డివిజన్ చేస్తూ రాష్ట్ర కేబినెట్ తీర్మానం చేసింది. కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూర్ మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు ఆమోదం తెలిపింది. హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధి పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రేరాలో 54 ఉద్యోగాలు భర్తీ చేసేందుకు టిజిపిఎస్‌సికి ఆదేశాలు ఇచ్చింది. ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్ భూమి బదలాయింపునకు కూడా ఆమోదం తెలిపింది.

## ఆందోళనలు సరికాదు

(మొదటి పేజీ తరువాయి)

డిజిపి శనివారం స్పందించారు. క్రమశిక్షణ గల ఫోర్స్‌లో ఉండి ఆందోళనలు చేయడం సరికాదన్నారు. మన దగ్గర ఉన్న రిక్రూట్మెంట్ వ్యవస్థనే అన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నాయన్నారు. పోలీసుల ఆందోళన వెనుక ప్రభుత్వం వ్యతిరేక శక్తుల హస్తం ఉందనే అనుమానం ఉందని డిపార్ట్మెంట్లో క్రమశిక్షణ ఉల్లంఘనే అన్నారు. సెలవులపై పాత పద్ధతిని అమలు చేస్తామని చెప్పినప్పటికీ మళ్లీ ఆందోళనకు దిగడంపై సీరియస్ అయ్యారు. తెలంగాణ పోలీస్ బెటాలియన్ లలో పనిచేసే కానిస్టేబుల్స్ చేస్తున్న ఆందోళన సరికాదన్నారు.పోలీసు మ్యాన్యువల్ ప్రకారం పోలీసులు విధులను బహిష్కరించటం, రోడ్ల పైకి వచ్చి పోలీసులు ఆందోళన చేయడం తీవ్రమైన క్రమశిక్షణ ఉల్లంఘనగా పరిగణించాల్సి వస్తుందన్నారు. దీనిని ఎట్టి పరిస్థితి లో కూడ సహించకూడదన్నారు. పోలీసు డిపార్ట్మెంట్లో పనిచేస్తూ సామాన్య జనానికి ఇబ్బంది కలిగేలా రోడ్లపై వచ్చిన పోలీసులపై చట్టపరమైన, శాఖపరమైన చర్యలకు తీసుకుంటామన్నా రు.

**కాకీ యూనిఫామ్‌తోనే కానిస్టేబుళ్ల ధర్నా**

ఒకే పోలీస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా బెటాలియన్ పోలీసులు ఆందోళనకు దిగారు. నిరసన కార్యక్రమాల్లో కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. కాగా, వరంగల్ జిల్లా మామునూరు 4వ బెటాలియన్ గెటు ఎదుట పోలీసు కానిస్టేబుళ్లు మూకుమ్మడిగా ధర్నాకు దిగారు. ఏక్ పోలీస్ నినాదాలతో 4వ బెటాలియన్ ప్రాంగణంలో మారుమోగింది.

పని భారం వల్ల భార్యా పిల్లలు, వృద్ధ తల్లిదండ్రులను చూసుకోలేకపోతున్నామని దాంతో మానసిక వేదనకు గురవుతు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సదరు కానిస్టేబుళ్లు వాపోయా రు. రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖ తమ ఉద్యోగ సమయా న్ని 8 గంటలకు తగ్గించి తమను తమ కుటుంబాలను కాపాడాలని పోలీసు కానిస్టేబుల్ విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా జిల్లాలో పోలీసు కానిస్టేబుళ్లు కుటుంబాలు సైతం ఆందోళనకు దిగుతున్నారు. విషయం తెలుసుకున్న వరంగల్ సిపి అంబర్ కిషోర్ ఝా మామునూరు 4వ బెటాలియన్ చేరుకొని పోలీసు సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకొని ఉన్నతాధికారులకు తెలియచేస్తానన్నారు.

**సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి**

నల్లగొండ జిల్లాలోని అన్నెపర్తి వద్ద ఉన్న 12వ బెటాలియన్‌లో గత నాలుగు రోజుల క్రితం కానిస్టేబుళ్ల సభ్యులు ఆందోళనకు దిగి రాస్తారోకో చేశారు. దీంతో బెటాలియన్ కమాండర్ ఆందోళన చేసిన ఆరుగురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. అయితే హైదరాబాద్‌లో ఆందోళన చేస్తే కొంతమంది కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసి తిరిగి వారి సస్పెన్షన్‌ను ఎత్తివేయడంతో నల్లగొండ బెటాలియన్‌లో కూడా ఆరుగురి కానిస్టేబుళ్ల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని శనివారం ఆందోళనకు దిగారు. బెటాలియన్‌లో ఉన్న కానిస్టేబుళ్లంతా రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేసేందుకు సిద్ధమవుతుండటంతో నల్లగొండ రూరల్ ఎస్‌ఐ బందోబస్తుకు వెళ్లారు. ఆందోళన చేస్తున్న బెటాలియన్ కానిస్టేబుళ్లు, కుటుంబ సభ్యుల గురించి ఎస్‌ఐ సైదాబాబు అసభ్యంగా మాట్లాడటంతో ఆందోళన ఉధృతంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా కానిస్టేబుళ్ల సస్పెన్షన్‌ను ఎత్తివేసి వివాదం సద్దుమణిగే సమయంలోనే ఎస్‌ఐ వివాదస్పద వ్యాఖ్యలు మరో వివాదానికి దారితీశాయి. ఎస్‌ఐ గో బ్యాక్ అంటూ పెద్ద ఎత్తున ఆందోళనలు చేయడంతో బందోబస్తుకు వచ్చిన ఎస్‌ఐ చేసేది ఏమి లేక తిరిగి వెనుదిరిగారు. అయితే కానిస్టేబుళ్ల ఆందోళనను కొనసాగించారు. ఆందోళనకు బిఆర్‌ఎస్ నాయకులు, మాజీ ఎంఎల్‌ఏ కంచర్ల భూపాల్‌రెడ్డి, చెరుకు సుధాకర్‌లు సంఘీభావం తెలిపేందుకు వెళ్లే క్రమంలో వారిని పోలీసులు అరెస్టు చేసి మునుగోడు పోలీసు స్టేషన్‌కు తరలించారు.

**ఇబ్రహీంపట్నంలో రాస్తారోకో**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు నినాదాలు చేస్తూ నిరసనకు దిగారు. సాగర్ రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఒకే పోలీస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.

తమతమ కుటుంబాలతో పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చారు.దీంతో ఇరువైపులా కిలోమీటర్ల కొద్దీ వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పోలీసులు జోక్యం చేసుకొని రాస్తారోకో విరమింప చేశారు. ఈ నిరసన కార్యక్రమాల్లో కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు, కానిస్టేబుళ్లు, పాల్గొన్నారు.

## అసలు సమస్యలు పక్కదారి

(మొదటి పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. సమావేశంలో టిఎస్‌పిఎస్‌సి మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో మత రాజకీయాలు ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తూ అసలు సమస్యలను పక్కదారి పట్టించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయన్నారు. పార్లమెంట్‌ను కూడా నేడు మతోన్మాద శక్తులు మతవిద్వేషాలకు కేంద్రంగా మలుచుకుంటూ, తమ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నాయని విమర్శించారు. 1960లో రాజ్యాంగాన్ని బలపరుస్తూ చట్టాలు చేస్తే నేడు కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని బలహీనపరిచే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. నాడు వామపక్ష ప్రజాస్వామిక శక్తులు, మైత్రి సంఘాలు ఏర్పాటు చేసి మతసామరస్యాన్ని పెంపొందించడంలో క్రియాశీలక పాత్ర పోషించాయని గుర్తుచేశారు. ప్రస్తుతం తెలంగాణ రాజకీయాలను తమ వైపు తిప్పుకుని అధికారంలోకి రావాలనుకుంటున్న మతోన్మాద శక్తుల కుట్రలను పసిగట్టి వాటిని ఎదుర్కోవడానికి కమ్యూనిస్టు పార్టీలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ మాట్లాడుతూ మతం వేరు, మతోన్మాదం వేరని పేర్కొన్నారు. అయోధ్యలో మసీద్‌ను కూల్చడం మతోన్మాదం అని, అక్కడ బిజెపిని ఓడగొట్టడం మతమన్నారు. పాతబస్తీ తమ రాజ్యమంటూ అక్కడ ఎంఐఎం ఏలుతుంటే, మరోవైపు బిజెపి రాష్ట్రంలో అధికారం కోసం ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నదని విమర్శించారు. మతోన్మాద శక్తులను తిప్పికొట్టేందుకు తెలంగాణ ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ గతంలో ఇబ్రహీంఖులీ ఆస్థానంలో కవులంతా తెలుగు వాళ్లే కానీ, హైదరాబాద్‌లో ఉన్న అలాంటి సంస్కృతిని మోదీ, కాంగ్రెస్ రెండూ కలిసి నాశనం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం ప్రజలను అయోమయానికి గురిచేసే రాజకీయాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. స్వచ్ఛంద సేవా సంస్థల వేదిక తెలంగాణ కన్వీనర్ డాక్టర్ ఆలేటి ఆటం మాట్లాడుతూ గ్రామాల్లో కూడా మతోన్మాదం చాపకింద నీరులా ప్రవహిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

వీరతెలంగాణ విప్లవ సేనలు ఉన్న తెలంగాణలో హిందూ, ముస్లిం గొడవల నివారణకు తొడ కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ వినాయక్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ ఇమేజ్ దెబ్బతీయడాని కి పాలకవర్గాల స్వార్థపూరిత పాత్ర ఉన్నదని ఆరోపించారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి కులాల మధ్య కుంపట్లు పెట్టి అధికారంలోకి వచ్చేందుకు బిజెపి ప్రయత్నిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు ఇ.టి.నరసింహ మాట్లాడుతూ ఎంఐ ఎం, బిజెపిలు మతతత్వ రాజకీయాలు చేస్తూ సామాన్య ప్రజలను బలి చేస్తున్నాయని విమర్శించారు. ఈ రెండు పార్టీలు తమ వ్యాపారాలు అభివృద్ధి చేసుకుంటూ రాజకీయ ప్రజాప్రతినిధులుగా చలామణి అవుతున్నాయన్నారు. సామాన్య ప్రజలు వీరి మతతత్వ ఉద్రేక ప్రసంగాలకు లోనై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా మతతత్వ శక్తులు సాగిస్తున్న వికృతి క్రీడలకు సమాధానంగా ప్రజా చైతన్యాన్ని పెంచాల్సిన బాధ్యత పౌర సమాజంపై ఉన్నదన్నారు. సమావేశానికి సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షత వహించగా, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, రైతు స్వరాజ్య వేదిక నాయకులు కన్నెగంటి రవికుమార్, సామాజిక కార్యకర్త కనిజ్ ఫాతిమా, కోవ సంస్థ నాయకులు మజర్, తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్, సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం వహించొద్దు



### రోడ్డు నిర్మాణ ప్రాజెక్టులకు అటవీ అనుమతులు సాధించాలి

### మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రప్రగతికి జీవనాడులైన రహదారుల నిర్మాణం.. అటవీ అనుమతులు లేక ఆగిపోతే.. అది రాష్ట్ర ప్రజల అభివృద్ధికి, జీవన ప్రమాణాల పెంపుకు ఆటంకంగా మారుతుందని తెలంగాణ రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సచివాలయంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఛాంబర్ లో అటవీశాఖ మంత్రి కొండా సురేఖ తో కలిసి అటవీ అనుమతులపై రివ్యూ నిర్వహించారు. అటవీ అనుమతుల సాధనలో ఆలస్యంపై ఇద్దరు మంత్రులు ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 5 సంవత్సరాలుగా 7 రోడ్డు ప్రాజెక్టు పనులు, 4 సంవత్సరాలుగా 1 ప్రాజెక్టు, 3 సంవత్సరాలుగా 20 ప్రాజెక్టులు, గత సంవత్సర కాలంగా 31 ప్రాజెక్టులు అటవీ అనుమతులు లేక ఆగిపోయాయని తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి రాష్ట్ర ప్రగతికి ప్రతిబంధకంగా మారడం దారుణమని ఇద్దరు మంత్రులు అన్నారు. అటవీ అనుమతుల సాధనను పర్యవేక్షించేందుకు ఆర్ అండ్ బి శాఖ పరిధిలో ఎస్ఇ స్థాయి అధికారిని ప్రత్యేకంగా నియమిస్తామని మంత్రి కొండా సురేఖకు తెలిపారు. కేంద్రం నుంచి అనేక రోడ్లకు అనుమతులు సాధించినప్పటికి అటవీ అనుమతులు లేక ఆగిపోవడంతో.. కొత్త రోడ్ల మంజూరీ గురించి అడగడం ఇబ్బందిగా మారిందని.. రాష్ట్రానికి మరిన్ని జాతీయ రహదారులను మంజూరీ చేయించాలంటే ముందు మంజూరీ అయిన రోడ్లను నిర్మించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. సమావేశంలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ.. డిఎఫ్ఒల స్థాయిలో ఉన్న 11 అటవీ అనుమతుల ఫైళ్ల ఆలస్యంపై అధికారులను ప్రశ్నించారు. అటవీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి సంబంధించిన ఫైళ్ల క్లియరెన్స్‌లో అనవసర ఆలస్యం లేకుండా ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డికి హామి ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్ అండ్ బి అటవీ అనుమతులను కోఆర్డినేట్ చేసేందుకు అటవీ శాఖ నుంచి ఒక ప్రత్యేక అధికారిని నియమించడంతో పాటు..ఫైళ్ళ క్లియరెన్స్ ఆలస్యం కావడానికి గల కారణాలను డిఎఫ్ఒల నుంచి వివరణ తీసుకోవాలని పిసిసిఎఫ్ డోబ్రియాల్‌ను ఆదేశించారు. తన కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న 4 రోడ్డు ప్రాజెక్టు పనులకు సంబంధించిన అటవీశాఖ అనుమతుల ఫైళ్లను ఈ రోజే క్లియర్ చేస్తానని కొండా సురేఖ తెలిపారు. రాష్ట్రానికి సంబంధించిన రోడ్డు ప్రాజెక్టుల అటవీ అనుమతులను పర్యవేక్షించే కేంద్ర ప్రభుత్వ పర్యావరణ, అటవీ శాఖ రీజినల్ ఆఫీసర్ త్రినాథరావు రాష్ట్రానికి సంబంధించిన అటవీ అనుమతుల ఫైళ్లను చిన్న చిన్న అంశాలపై వివరణలు అడుగుతూ కావాలని కాలయాపన చేయడం పట్ల సమావేశంలో ఇరువురు మంత్రులు ఆవేదనవ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి జరుగుతుంటే అండగా నిలబడాల్సిందిపోయి.. ఇలా చిన్న చిన్న సాంకేతిక కారణాలతో ఫైళ్లను జాప్యం చేయడం తగదని అన్నారు. అంతకు ముందు ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పై జరిగిన సమీక్షలో డిసెంబర్ చివరికల్లా ఒక స్లాబ్ ను పూర్తి చేయాలని మోర్త్ ఆర్ ఓ కృష్ణప్రసాద్, ఎస్ఇ ధర్మారెడ్డికి సూచించారు. ఈ సమీక్షలో ఆర్ అండ్ బి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, అటవీశాఖ ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్, ఆర్ అండ్ బి శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, ప్రత్యేక కార్యదర్శి రెవెన్యూ (డిజాస్టర్ మెనేజ్ మెంట్) హరీష్, పిసిసిఎఫ్ డోబ్రియాల్, ఇఎన్‌సి, సిఇ లతో పాటు మోర్త్ ఆర్ఓ కృష్ణప్రసాద్, ఇతర అటవీ, ఆర్ అండ్ బీ, ఎన్.హెచ్.ఏ.ఐ అధికారులు పాల్గొన్నారు.

# హరీష్ ఆదేశాల మేరకే నడుచుకున్నాం

### కాళేశ్వరం కమిషన్ విచారణలో తొలిసారి మాజీ మంత్రి పేరు ప్రస్తావన

### పిసి ఘోష్ కమిషన్‌ముందు హాజరైన రామగుండం సిఇ కె.సుధాకర్ రెడ్డి







**ప్రజాపక్షం / హైదరాబాద్ :** కాళేశ్వరం కమిషన్ బహిరంగ విచారణలో నిన్న మొన్నటి వరకు మాజీ సిఎం కెసిఆర్ పేరు ప్రస్తావనకు రాగా తాజాగా జరిగిన విచారణలో మాజీ మంత్రి హరీశ్ రావు పేరు పలుమార్లు ప్రస్తావనకు వచ్చింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల టెండర్లపై పిసి ఘోష్ కమిషన్ శనివారం హైదరాబాద్‌లోని బిఆర్‌కెఆర్ భవన్‌లో విచారణ జరిపగా రామగుండం చీఫ్ ఇంజనీర్ (సిఇ) కె. సుధాకర్ రెడ్డి ఈ మేరకు కమిషన్ విచారణకు హాజరై హరీష్‌రావు పేరును పలుమార్లు ప్రస్తావించి సమాధానాలు చెప్పడం గమనా ర్హం. తనిఖీలు లేకుండానే మేడిగడ్డ బ్యారేజీ నిర్మా ణ పనులన్నీ పూర్తయినట్లు ఎలా అనుమతులు ఇస్తారని కమిషన్ చీఫ్ ప్రశ్నించగా 90శాతం పను లు పూర్తయిన క్రమంలోనే నిర్మాణపనులన్నీ పూర్తయినట్లుగా సబ్ స్టాన్షియల్ పత్రం ఇచ్చినట్లు సు ధాకర్ రెడ్డి అంగీకరించారు. మేడిగడ్డ డిజైన్ ఖరా రు సమయంలో ఎల్ అండ్ టి సంస్థను సంప్రదించానని, పనులు దాదాపు ఓవర్ అని తెలపడంతోనే సబ్ స్టాన్షియల్ పత్రం ఇవ్వడమే కాకుండా ఇందుకు సంబంధించిన డిపిఆర్ ప్రకారం కాఫర్ డ్యామ్ ఏర్పాటుకు అయిన డబ్బులు కూడా మంజూరు చేసినట్లు స్పష్టం చేశారు. ఇరిగేషన్‌శాఖ మం త్రిగా హరీశ్ రావు ఉన్న సమయంలోనే ఫీల్డ్ లో జరిగిన టెస్టుల రికార్డులను వ్యాప్కోస్ సంస్థకు ఇ వ్వమని హరీష్ రావు ఆదేశించారని, ఆయన ఆదేశాలతోనే ముందుకు వెళ్లామన్నారు. మేడిగడ్డ కుంగుబాటుకు కారణాలు తెలుపమని కోరగా భారీ వర్షాల కారణంగా వరద వేగాన్ని అంచనా వేయలేక పోవడం వల్లే బ్లాకులు కుంగి దెబ్బతిన్నాయన్నారు. డిజైన్ పేరుతో రూ. 40 వేల కోట్ల ప్రా జెక్టును రూ.127 వేల కోట్లకు ఎందుకు పెంచారని, ఇన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసింది కేవలం అదనంగా రెండు లక్షల ఎకరాల కోసమే నా అని కమిషన్ నిలదీసింది. అసలు ఫీల్డ్ లో జరిగిన టెస్టుల రికార్డులను వ్యాప్కోస్ సంస్థకు ఇవ్వమని ఎవరు ఆదేశించారని ప్రశ్నించింది. దీనికి సిఈ బదులిస్తూ అప్పటి ప్రభుత్వ పెద్దలు, ఇరిగేషన్ శాఖ మంత్రి ఇవ్వమని ఆదేశించారని తెలిపా రు. బ్యారేజీ పనులు పూర్తయినట్లు సర్టిఫికెట్ ఏ సమయంలో ఇస్తారని ప్రశ్నించగా దాదాపు 90 శాతం పనులు పూర్తయితే పనులు పూర్తయినట్లు గా సబ్ స్టాన్షల్ సర్టిఫికేట్ విడుదల చేస్తారని, తా ము అలానే చేశామన్నారు. సర్టిఫికెట్ ఇచ్చేముందు అసలు నిజాలు చూడకుండా గుడ్డిగా ఎలా సంతకాలు పెడుతారని కాళేశ్వరం కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాపర్ డ్యాం నిర్మాణం తొలగింపు కోసం అదనంగా ఖర్చు చేసే నిధులు ప్రభుత్వానికి నష్టమే కదా? అంటూ చివాట్లు పెట్టింది. బ్యారేజీలలో నీళ్లు స్టోరేజ్ చేయొచ్చా చేస్తే ఎంత చేయొచ్చునని అడగ్గా మేడిగడ్డ బ్యారేజీలో 100 మీటర్ల లెవె ల్ వరకు నీటిని నిలువ చేసుకోవచ్చన్నారు. మేడిగడ్డ బ్యారేజీ లోని బ్లాక్ లలో పొడవు, అడ్డం డిజైన్ సరిగ్గా లేకపోవడం వల్లే బ్యారేజీకి డ్యామేజి జరిగిందన్నారు. అన్నీ బాగానే చెబుతున్నావ్..సబ్ స్టా న్షియల్ కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చేముందు నువ్వు స్పృహలో లేవా అని ప్రశ్నించగా కాపర్ డ్యాం కారణంగానే (షీట్ ఫైల్స్ సరిగ్గా రిమూవ్ చేయక పోవడం వల్లనే) డ్యామేజీ జరిగిందని ఆయన సమాధానం ఇచ్చారు.

# రైతులకు ఇబ్బందుల్లేకుండా అన్ని పంటలు కొనుగోలు

### ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు ఉండాలి

### మార్క్‌ఫెడ్, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతన్నలు ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి రావడంతో ప్రభుత్వ పరంగా ఆ పంటల కొనుగోళ్లకు సంబంధించి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టి సారించారు. తన మూడు రోజుల మలేషియా పర్యటనను ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం మార్క్‌ఫెడ్, వ్యవసాయమార్కెటింగ్, అధికారులతో ధాన్యం, పత్తి ,ఇతర పంటల కొనుగోళ్ళ మీద పూర్తి స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా మార్క్ ఫెడ్ అధికారులతో సమావేశమైన మంత్రి ఖరీఫ్ కొనుగోళ్ళపై ఆరా తీశారు. పెసర కొనుగోళ్ళు పూర్తి కావచ్చాయని, ఇప్పటికే రూ. 8.03 కోట్లు విలువ గల 924.85 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని, ఇంకా ఒకటి రెండు మార్కెట్లలో మాత్రమే పెసరు పంట వస్తుందని మార్క్ ఫెడ్ ఎండి శ్రీనివాస్ రావు మంత్రికి వివరించారు. అంతేకాకుండా రూ.35.86 కోట్లు వెచ్చించి 4,793 రైతుల వద్ద నుండి 7330.50 మెట్రిక్ టన్నులు సోయాచిక్కుడు కొనుగోలు చేశామని, ఇంకా 50 వేల టన్నులు వచ్చే మార్కెట్లకు అవకాశాముందని మార్కెఫెడ్ అధికారులు తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ పంట కొనుగోలు పూర్తి కాగానే, ఎక్కడ ఏ మార్కెట్లలో ఎక్కువ రేటు ఉందో విచారించి, తరలించే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, తద్వారా మార్క్ ఫెడ్ ఆదాయం పెంచే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎరువుల కొనుగోలు, అమ్మకాలకు సంబంధించి ప్రతిఏటా మార్క్ ఫెడ్‌కు నిర్వహణ ఖర్చులు, రవాణా ఖర్చులను సహేతుక పద్దతుల ద్వారా నిర్వహించి, ప్రతి ఏటా పెరిగే ఖర్చుల భారాన్ని తగ్గించే విధంగా ప్రయత్నించాలని, రైతులకు ఇబ్బంది రాకుండా వచ్చే యాసంగిలో కూడా ఎరువుల సరఫరా సక్రమంగా అయ్యేటట్లు చూడాలని మంత్రి సూచించారు.

**పత్తికి కచ్చితంగా మద్దతు ధర కల్పించాలి**

రాష్ట్రంలో పత్తి కనీస మద్దతు ధర కార్యకలాపాలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్కెటింగ్ డైరెక్టర్ ఉదయ్ కుమార్‌తోపాటు మార్కెటింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పత్తి కొనుగోళ్ల పారదర్శకంగా నిర్వహించడం తోపాటు రైతులకు అవసరమైన మద్దతు ధర అందేలా చూడాలని అధికారులను ఆదేశించిన మంత్రి తుమ్మల ఇందుకు సంబంధించి పలు సూచనలు చేశారు. పత్తి మద్దతు ధర కొనుగోలుకు సంబంధించి నాణ్యత ప్రమాణాలపై రైతులకు మార్కెట్ యార్డుల నందు కొనుగోలు కేంద్రాల వద్ద నిరంతరము అవగాహన కల్పించాలన్నారు. మార్కెటింగ్ అధికారులు ఉన్నతాధికారులు నిరంతరం ఆయా మార్కెట్ యార్డులలో కొనుగోలు కేంద్రాలకు వెళ్లి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిబంధనల ప్రకారం పత్తిని కొనుగోలు జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పత్తి రైతులు తేమ విషయంలో పడుతున్న ఇబ్బందులను సిసిఐ సిఎండి మాట్లాడి వారి దృష్టికి తీసుకెళ్లాలని, పత్తిలో తేమశాతం ఎక్కువ ఉన్నా కూడా సిసిఐ వారే కొనుగోలు చేసేలా చూడాలని ఆదేశించారు. పత్తి రైతులకు అవసరమైన మద్దతు అందించి, వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ధాన్యపు కొనుగోలు ఆరంభమైనందున, అన్ని కొనుగోలు కేంద్రాలలో అవసరమైనంత మేర టార్పలిన్ అందుబాటులో ఉంచాలని, డ్రైయర్లు, ప్యాడీ క్లీనర్లు, సన్నబియ్యం నిర్ధారణ చేసే పరికరాలు ప్రతీ కొనుగోలు కేంద్రానికి చేరాయా, లేదా అనేది సరిచూసుకోవాలని అడిషనల్ డైరెక్టర్లు, జాయింట్ డైరెక్టర్లను మంత్రి ఆదేశించారు.



## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ప్రత్యేక యాప్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్థలం ఉండి కూడ సొంతింటిని కట్టులేకపోతున్న నిరుపేదలకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి సొంతింటి కలను ప్రభుత్వం త్వరలో నిజం చేయబోతోందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. త్వరలోనే రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభిస్తామని, ఇందుకు కావాల్సిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయని వెల్లడించారు. అంతేకాకుండా రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపికకు ప్రత్యేక యాప్ ను రూపొందించామని, వచ్చే వారంలో ఈ యాప్ అందుబాటులోకి రానుందని మంత్రి తెలిపారు. శనివారం సచివాలయంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన కార్యాలయంలో యాప్‌ను పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని , రాజకీయ పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని తెలిపారు. లబ్దిదారుల ఎంపిక కోసం రూపొందించిన యాప్‌లో అధికారులకు స్వల్ప మార్పులు, చేర్పులు సూచించామని, వాటిని సరిచేసి వచ్చే వారంలో దీనిని అందుబాటులోకి తీసుకురానున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని యాప్‌లో తెలుగు వెర్షన్ ఉండేలా చూడాలని అధికారులకు సూచించామని చెప్పారు. లబ్దిదారుల ఎంపిక నుంచి ఇందిరమ్మ ఇండ్లు పూర్తయ్యేవరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వీలైనంతవరకు వాడుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇళ్లు లేని ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని, దీనిని దృష్టిలో పెట్టుకొని అధికార యంత్రాంగం పని చేయాలన్నారు. ఈ సమావేశంలో సత్తుపల్లి ఎంఎల్‌ఎ మట్టా రాగమయి, హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గంగులకు చాడ పరామర్శ



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాతృమూర్తి లక్ష్మి నర్సమ్మ ఇటీవల మృతి చెందడంతో శనివారం కరీంనగర్‌లోని గంగుల ఇంటికి వెళ్లి లక్ష్మి నర్సమ్మ చిత్ర పటానికి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గంగుల వెంకన్న, సుధాకర్, కమలాకర్‌లను పరామర్శించారు. ఈ సంధర్బంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ కమలాకర్ తల్లిదండ్రులు గంగుల మల్లయ్య లక్ష్మి నర్సమ్మ ఎంతో కష్టపడి పైకి ఎదిగారని, వెల్గటూరు మండలం పైడిపల్లి గ్రామానికి చెందిన వీరు ఆ గ్రామ అభివృద్ధి కోసం అక్కడి ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో లక్ష్మీ నర్సమ్మ ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొని నాడు గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై ప్రజలకు ఎంతో సేవ చేశారని గుర్తు చేశారు. అనంతరం కుటుంబ పోషణ, పిల్లల భవిష్యత్తు కోసం కరీంనగర్‌లో స్థిరపడ్డారని, వారి కుమారులు వ్యాపార, ప్రజా రంగాల్లో రాణించారంటే అందుకు లక్ష్మి నర్సమ్మ కృషి ఎంతో ఉందన్నారు. కుమారుల ఎదుగుదలను చూసి ఎంతో సంతోషించేదని, అలాంటి మాతృమూర్తి మరణం వారి కుటుంబానికి ఎంతో తీరని లోటు అన్నారు. వారి మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ వారి కుటుంబానికి సానుభూతి తెలియజేస్తున్నట్లు వెంకటరెడ్డి తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు బోయిని అశోక్, పైడిపల్లి రాజు, బూడిద సదాశివ ఉన్నారు.

# నవంబర్ 15లోగా సలహాలు, సూచనలు ఇవ్వండి

### వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల మంజూరుకు మార్గదర్శకాలు రూపొందించడానికి నియమించిన ప్రత్యేక కమిటీ విజ్ఞప్తి

### మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రత్యేక కమిటీ తొలి సమావేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల మంజూరుకు అవసరమైన విధి విధానాలు, మార్గదర్శకాలు రూపొందించడానికి జర్నలిస్టు యూనియన్‌లు, అసోసియేషన్‌లు, ప్రెస్‌క్లబ్‌లు, వ్యక్తులు రాతపూర్వకమైన సలహాలు, సూచనలను నవంబర్ 15వ తేదీలోగా సమాచార, పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ (ఎంఆర్)కు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ కోరింది. ప్రత్యేక కమిటీ ప్రథమ సమావేశం శనివారం బూర్గుల రామకృష్ణారావు భవనం(బిఆర్‌కెభవన్)లో జరిగింది. తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ (ఆంధ్రజ్యోతి ఎడిటర్), ఎంఎల్‌సి అమీర్ అలీఖాన్ (సియాసత్ న్యూస్ ఎడిటర్), ఆర్. రవికాంత్‌రెడ్డి (ది హిందూ పొలిటికల్ ఎడిటర్), కె.నరహరి (సీనియర్ ఫొటో జర్నలిస్ట్), రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ డిఎస్.జగన్ పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్ర హైకోర్టు తీర్పులు, నూతన మార్గదర్శకాలు, వివిధ రాష్ట్రాలలో అమలులో ఉన్న అక్రిడిటేషన్ కమిటీ నిబంధనలను, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు ఇతర మీడియాలకు అక్రిడిటేషన్‌ల అంశాలపై ప్రాథమికంగా చర్చించారు. రాష్ట్రంలో నూతన మార్గదర్శకాలపై జర్నలిస్టు యూనియన్‌లు, అసోసియేషన్‌లు, ప్రెస్‌క్లబ్‌లు, వ్యక్తుల నుండి రాతపూర్వకమైన సలహాలు, సూచనలను ప్రత్యేక కమిటీ ఆహ్వానించింది. నవంబర్ 15లోగా వాటిని సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ (ఎంఆర్)కు అందజేయాలని కమిటీ కోరింది.

### నవంబర్ 30 నుంచి డిసెంబర్ 1వరకు హన్మకొండలో

# ఐఎఎల్ రాష్ట్ర ద్వితీయ మహాసభలు

### ఐఎఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్





**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇండియన్ అసోసియేషన్ ఆఫ్‌లాయర్స్ తెలంగాణ రాష్ట్ర ద్వితీయ మహాసభలు నవంబర్ 30 నుంచి డిసెంబర్ 1వ తేదీవరకు హన్మకొండలో నిర్వహించనున్నట్లు ఐఎఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోనిఐఎఎల్ రాష్ట్ర కార్యాలయంలో బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్ధన్ అధ్యక్షతన ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఐఎఎల్ రాష్ట్ర ప్రధాన కార్యద ర్శి బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని సెక్యులరిజాన్ని రక్షించడంలో ప్రజా పోరాటాలలో న్యాయవాదులది కీలక పాత్ర ఉండాలని, ఐఎఎల్ ఆ పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో న్యాయవాదుల మీద దాడులు పెరిగిపోతున్నాయని న్యాయ రక్షణ కోసం వృత్తిపరమైన బాధ్యతలను నిర్వహిస్తున్న న్యాయవాదులకు రక్షణ చట్టం తక్షణమే తీసుకురావాల్సిన అవసరముందన్నారు. అదేవిధంగా వివిధకోర్టుల్లో న్యాయవాదులతో పాటు జూనియర్ అడ్వకేట్లు, మహిళా అడ్వకేట్లు సమస్యలను ఐఎఎల్ రాష్ట్ర మహాసభల్లో చర్చించడంతో పాటు సెమినార్ నిర్వహించనున్నామని ఈ సెమినార్‌లో రాష్ట్ర హైకోర్టు జడ్జిలు, ఐఎల్ నాయకులు పాల్గొనున్నారని వెల్లడించారు. దుస్సా జనార్ధన్ మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగినఐఎఎల్ రాష్ట్ర మహాసభలను ఘనంగా నిర్వహించడానికి భారీ ఏర్పాటు జరుగుతున్నాయని, న్యాయవాదులందరు పెద్ద ఎత్తున పాల్గొనున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఐఎఎల్ నా యకుల ఉదయ భాస్కర్, భీమనప ల్లి శ్రీనివాస్, కెవిఎల్, శేషగిరిరావు, జయ శ్రీనివాస్, వి.రాములు, లతీఫ్, ప్రభాకర్, బొమ్మగాని శ్రీనివాస్, మురళీ, రాంమూర్తి, లీలా కుమారి, దామోదర్, రమణ, వెంకటరమణారెడ్డి, ఉదయ్ శంకర్, వెంకటరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ చేసిన టీచర్లందరికీ ఎమ్మెల్సీ ఎన్నికలల్లో ఓటు హక్కు ఉండాలి

### హైకోర్టులో పిల్ దాఖలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ (ఉపాధ్యాయుల) ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని కోరుతూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం (పిల్) దాఖలైంది. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం మండలం బండకాడిపల్లికి చెందిన సెకండరీ గ్రేడ్ టీచర్ బీమనబోయిన కృష్ణమూర్తి దాఖలు చేసిన పిల్‌ను శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథే, జస్టిస్ ఎల్.శ్రీనివాస రావులతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. రాబోయే టీచర్స్ కా నిస్టెన్సీ ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులను ఓటర్లు గా పరిగణించేలా కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఉత్తర్వులు జారీ చేయాలని పిటిషనర్ తరపు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ కోరారు. డిగ్రీ చేసినప్పటికీ ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ టీచర్లకు ఓటు హక్కు కల్పించకపోవడం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. హైస్కూల్ టీచర్లతో సమానంగా పనిచేస్తున్నారని, వాళ్లకు మాదిరిగానే ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ టీచర్లకు కూడా డిగ్రీలు ఉన్నాయని, అయినా ఓటు హక్కు కల్పించకపోవడం వివక్ష కిందకే వస్తుందన్నారు. టీచర్ల నియోజకవర్గ ఎమ్మె ల్సీ ఎన్నికల్లో ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ టీచర్లకు కూడా ఓటు హక్కు కల్పించాలని కో రారు. ప్రజాప్రాతినిధ్య చట్టానికి విరుద్ధమన్నారు. దీనిపై ఎన్నికల సంఘం తరపు న్యా యవాది స్పందిస్తూ, పిటిషనర్ ఆ చట్టంలోని నిబంధన 27(3) (బి) సెక్షన్‌ను సవా లు చేయలేదని, పిల్‌లో ఉత్తర్వులు జారీ అవసరం లేదన్నారు. దీనిపై ప్రభాకర్ స్పం దిస్తూ, ఆ సెక్షన్‌ను ప్రశ్నిస్తూ పిల్‌ను సవరించేందుకు అనుమతించాలని కోరారు. ఇందు కు అనుమతిచ్చిన ధర్మాసనం తదుపరి విచారణను వాయిదా వేసింది.

### ఫిరాయింపు ఎంఎల్‌ఎలు

## కాంగ్రెస్‌లోకి ప్రేమతో రాలేదు : మధుయాష్కీ



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** పార్టీ ఫిరాయించిన ఎంఎల్‌ఎలు కాంగ్రెస్‌లోకి ప్రేమతో రాలేదని వాళ్ల అక్రమాస్తులను కాపాడుకోవడానికి వచ్చారని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ నిజామాబాద్ మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్ జగిత్యాల సంచలన వ్యాఖ్యాలు చేశారు. పట్టభద్రుల ఎంఎల్‌సి తాటిపర్తి జీవన్‌రెడ్డి అనుచరుడు కాంగ్రెస్ నాయకుడు ఇటీవల దారుణ హత్యకు గురికాగా శనివారం జగిత్యాలలోని జీవన్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను బుజ్జగించి, గంగారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్, ఆది శ్రీనివాస్‌లతో కలసి మధుయాష్కీ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏడాదిలోగా ప్రభుత్వాన్ని కుల గొడతానని అభద్రతకు గురిచేస్తున్న బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు చేస్తున్న దుష్ప్రచారం వల్ల కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తిగా ఉన్న ఎంఎల్‌ఎలను పార్టీలో చేర్చుకున్నామని మధుయాష్కీ తెలిపారు. వారిని కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం చేర్చుకోలేదని తేల్చి చెప్పారు. ఫిరాయింపు ఎంఎల్‌ఎలకు పదవులు ఇస్తామని వారికి ఎలాంటిది రాసివ్వలేదని స్పష్టం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఫిరాయింపులను నిరోధక చట్టాన్ని తీసుకువచ్చి వారి సభ్యత్వాలను కోల్పోయే విధంగా చేస్తారనే ఆలోచన అధిష్ఠానం చేస్తుందని మధుయాష్కీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడైన ఎంఎల్‌సి జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో, పాలనలో జరుగుతున్న అభిప్రాయాలను ఢిల్లీ పెద్దలతో పాటు సిఎం, టిపిసిసి అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. గంగారెడ్డి హత్య విషయమై డీజితో మాట్లాడుతున్నాని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కొత్త మోహన్, తాటి పర్తి శోభారాణి, విజయలక్ష్మీ దేవేంధర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు

**పొరుగుసేవ పద్ధతిలో 120 రోజులు పనిచేయుటకు**

హుజూర్‌నగర్, కోదాడ నీటిపారుదల శాఖ డివిజన్ పరిధిలో పొరుగుసేవ పద్ధతిలో 120 రోజులు పనిచేయుటకు ఈ క్రింద పేర్కొన్న అర్హత గల సిబ్బంది నియామకమునకై దరఖాస్తులు ఆహ్వానించడమైనది.

| క్ర.సం. | పోస్టులు | కోదాడ | హుజూర్‌నగర్ | Qulifications & Experience |
|---|---|---|---|---|
| 1 | ఎలక్ట్రీషియన్ | 2 | 2 | వైండింగ్ చేయుటలో అనుభవం ITI గుర్తింపు పొందిన కళాశాలలో ఎలక్ట్రీషియన్ ఉత్తీర్ణులై ఉండవలెను. |
| 2 | ఫిట్టర్ | 1 | 1 | ITI ఫిట్టర్ చదివి ఉత్తీర్ణులై ఉండవలెను. |
| 3 | పంపు ఆపరేటర్ | 20 | 28 | ప్రభుత్వ గుర్తింపు పొందిన కళాశాలలో ITI ఎలక్ట్రీషియన్ లేదా మెకానికల్ సమానమైన కోర్సులో ఉత్తీర్ణులై ఉండవలెను. |
| 4 | వాచ్‌మెన్ | 17 | 28 | 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండవలెను. |

పైన తెలిపిన పోస్టులకు సంబంధించి అర్హత గల అభ్యర్థుల పూర్తి బయోడేటా జీరాక్స్ సర్టిఫికెట్లు. ఒక పాస్ ఫోటోతో ఈ క్రింది అడ్రసును సంప్రదించగలరు.
**దరఖాస్తులు స్వీకరించు తేది:** 26.10.2024 నుండి 31.10.2024 వరకు 10.30 AM నుండి 4.30 PM వరకు ఆఫీసు పని వేళలలో స్వీకరించబడును.
**దరఖాస్తులు స్వీకరించు స్థలం :** హుజూర్‌నగర్ టౌన్ హాల్, సాయిబాబా గుడి రోడ్డు, హుజూర్‌నగర్. సంప్ర॥ 7989904207
**తేజ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ & మ్యాన్ పవర్ సర్వీసెస్**, గరిడేపల్లి, సూర్యాపేట జిల్లా.

**డాక్యుమెంట్స్ పోయినవి**

హనుమకొండ జిల్లా వేలేరు మండలములోని గుండ్లసాగర్ గ్రామానికి చెందిన **గాదె తిరుపతిరెడ్డి, తండ్రి నరసింహారెడ్డి** గారికి సంబంధించిన పట్టాపాస్ బుక్కు గత నెల సెప్టెంబర్ లో తిరుపతిరెడ్డి గుండ్ల సాగర్ నుండి హనుమకొండకు బస్‌లో ప్రయాణం చేయుచుండగా భూమికి సంబంధించిన డాక్యుమెంట్స్ పట్టా పాస్ బుక్ పోయినది, **పట్టా పాస్ బుక్ నెంబర్: T21100060349,** ఖాతా నెం 508 గల పాస్ బుక్ దొరికిన వారు ఈ క్రింది అడ్రస్‌లో ఇవ్వగలరని మనవి.

ఇట్లు
**గాదె తిరుపతిరెడ్డి, తండ్రి: నరసింహారెడ్డి,**
గ్రామం:గుండ్లసాగర్, మండలం: వేలేరు,
జిల్లా: హనుమకొండ,
పిన్ కోడ్ నెంబర్ 506151,
**ఫోన్ నంబర్: 8639415733.**

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: సర్కిల్-2, ఉప్పల్.**

NIT నెం. 14/EEC-2/UPL/GHMC/2024-25 (టెండర్ నోటీసు) తేదీ: 26-10-2024

**పని పేరు:** 1 పని కొరకు జిహెచ్‌ఎంసి, ఉప్పల్ సర్కిల్-2, హబ్సిగూడ వార్డు నెం. 8లో హబ్సిగూడ, వీధి నెం.1, పి&టి కాలనీ వద్ద హిందూ శ్మశానవాటికను శుభ్రం చేయడానికి జెసిబి మరియు కార్మికులను నిమగ్నం చేయడం. **అంచనా విలువ: రూ.0.85లక్షలు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 28.10.2024న మ.12.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ వి.హరిలాల్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఉప్పల్ డివిజన్ నెం.2, జిహెచ్‌ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-2, ఉప్పల్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 5922-PP/CL/ADVT/1/2024-25, Date: 26-10-2024

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

EE-Div16/EE/Divn.16//(SBZ)/GHMC
NIT నెం. 30/Cir-16/Engg-Div-16/SBZ/GHMC/2024, తేదీ: 26-10-2024

పని పేరు: జిహెచ్‌ఎంసి, సికింద్రాబాద్ జోన్, అంబర్‌పేట్ సర్కిల్-16లో జంగిల్ చెట్లను తొలగించడం. **మొత్తం విలువ: రూ.1.96లక్షలు,** క్రసం.1, ప్రారంభ తేదీ: 28.10.2024న మ.3.00గం.ల నుండి, బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 29.10.2024న మ.3.00గం.ల వరకు. శ్రీ కె.రమేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-16, సర్కిల్-16 అంబర్‌పేట్, సికింద్రాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి. సెల్: 6309920591 / 8790374055. **సంప్రదించవలసిన చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-16, ఎస్‌బిజెడ్, జిహెచ్‌ఎంసి అబిడ్స్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-16, ఎస్‌బిజెడ్, జిహెచ్‌ఎంసి

DIPR R.O. No. : 5937-PP/CL/ADVT/1/2024-25, Date: 26-10-2024

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఇ.ఇ. డివిజన్ - 29, సికింద్రాబాద్, జిహెచ్‌ఎంసి.

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు

NIT నం. 28/EE-Div.29/SBZ/GHMC/2024-25 తేదీ: 25-10-2024

**పని పేరు:** GHMC, SBZ, సికింద్రాబాద్, డివిజన్-29, తార్నాక వార్డు-143 & మెట్టుగూడ వార్డు-144లో దీపావళి పండుగను దృష్టిలో ఉంచుకుని వివిధ శ్మశాన వాటికల్లో జంగిల్ క్లియరెన్సుకు హాజరవడం. **అంచనా విలువ: రూ.6.20లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం:** 26.10.2024న ఉ.10.30గం.ల నుండి 29.10.2024న ఉ.10.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-29, జిహెచ్‌ఎంసి, సికింద్రాబాద్. సెల్: 6309920591. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-29, సికింద్రాబాద్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 5881-PP/CL/ADVT/1/2024-25, Date: 26-10-2024

# ఫోకస్


జో రూట్

కనబరిచాడు. భారత బ్యాటింగ్ దిగ్గజం సచిన్ తెండూల్కర్ 2004లో ఆడిన తన 119వ టెస్టులో, ఢాకాలో బంగ్లాదేశ్‌పై 248 పరుగుల తన అత్యధిక వ్యక్తిగత స్కోరును సాధించాడు.

కెరీర్‌లో లేటుగా రాణించి, అత్యధిక పరుగులు సాధించిన బ్యాట్స్‌మెన్ మాదిరిగానే, కొంత మంది బౌలర్లు కూడా తమతమ కెరీర్‌లో చాలా ఆలస్యంగా కెరీర్ బెస్ట్

## జో రూట్.... ఓల్డ్ ఈజ్ గోల్డ్

పాకిస్తాన్‌తో జరిగిన టెస్టు సిరీస్‌ను ఇంగ్లాండ్ 1–2 తేడాతో చేజార్చుకున్నప్పటికీ, మొదటి టెస్టులో జో రూట్ ప్రతిభ, ఆ జట్టుకు చిరస్మరణీయమైన విజయాన్ని సాధించిపెట్టింది. విదేశీ గడ్డపై క్లీన్‌స్వీప్ కాకుండా పరువు దక్కించుకోగలిగింది. సాధారణంగా క్రికెటర్లు తమతమ కెరీర్ ప్రారంభంలో లేదా మధ్యలో అద్భుతమైన ఫామ్‌లో ఉంటారు. చివరి దశలో క్రమంగా వారి దక్షత క్షీణిస్తుంది. కానీ, ఇంగ్లాండ్ సీనియర్ ఆటగాడు జో రూట్ ఇందుకు పూర్తి భిన్నంగా చక్కటి ప్రతిభ కనబరిచాడు. కెరీర్‌లో అత్యధిక స్కోరును పాకిస్తాన్‌తో, ముల్తాన్ వేదికగా ఈ నెల 7 నుంచి 11 వరకు జరిగిన మొదటి టెస్టులో సాధించాడు. 147వ టెస్టు ఆడుతున్న అతను, మొదటి ఇన్నింగ్స్‌లో 375 బంతులు ఎదుర్కొని, 17 బౌండరీలతో 262 పరుగులు సాధించాడు. టెస్టు కెరీర్‌లో అతనికి ఇదే అత్యధిక స్కోరు. హారీ బ్రూక్స్‌తో కలిసి అతను నాలుగో వికెట్‌కు 454 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని అందించాడు. ఇంగ్లాండ్‌కు టెస్టు క్రికెట్‌లో ఇదే అత్యధిక భాగస్వామ్యం. ఇంతకు ముందు కొలిన్ కౌడ్రే, పీటర్ మే 414 పరుగులతో నెలకొల్పిన రికార్డును జో రూట్, హారీ బ్రూక్స్ అధిగమించారు. 2012లో కేప్‌టౌన్‌లో శ్రీలంకపై దక్షిణాఫ్రికా ఆటగాడు జాక్వెస్ కాలిస్ 224 పరుగులు చేశాడు. అతనికి అది 150వ టెస్టు. వందకు మించి టెస్టులు ఆడిన తర్వాత కెరీర్ అత్యధిక స్కోరు సాధించడంలో కాలిస్ తర్వాతి స్థానం జో రూట్‌కు దక్కుతుంది. శ్రీలంక మాజీ కెప్టెన్ కుమార సంగక్కర తన 122వ టెస్టు (2014)లో బంగ్లాదేశ్‌పై ఏకంగా 319 పరుగులు చేశాడు. అయితే, అతని కంటే ఎక్కువ టెస్టుల్లో రూట్ తన కెరీర్‌లో అత్యుత్తమ బ్యాటింగ్ ప్రతిభ బౌలింగ్‌తో రాణించారు. ఇటీవల రిటైరైన జేమ్స్ ఆండర్సన్ (ఇంగ్లాండ్) తన 129వ టెస్టులో గొప్పగా రాణించాడు. 2017 సెప్టెంబరులో, లార్డ్స్ మైదానంలో వెస్టిండీస్‌తో జరిగిన టెస్టులో అతను కేవలం 42 పరుగులిచ్చి ఏడు వికెట్లు పడగొట్టాడు. టెస్టు కెరీర్‌లో అతనికి అదే అత్యుత్తమ బౌలింగ్. ఇంగ్లండ్‌కే చెందిన అలిస్టర్ కుక్ చాలా అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. 2014లో ట్రెంట్‌బ్రిడ్జి వేదికగా భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను ఇశాంత్ శర్మను అవుట్ చేశాడు. టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మన్‌గా ఇంగ్లాండ్‌కు అత్యుత్తమ సేవలు అందించిన కుక్ చాలా అరుదుగా బౌలింగ్ చేసేవాడు. కెరీర్‌లో అతనికి లభించిన ఏకైక వికెట్ అదే. ఆ వికెట్ తీసుకున్న మ్యాచ్ కుక్ టెస్టు క్రికెట్‌లో 105వది కావడం విశేషం.


ఆండర్సన్

# కుస్తీ పండుగ..

క్రీడ



అల్బానియాలోని తిరానా ప్రపంచ కుస్తీ పండుగకు ముస్తాబైంది. ఈనెల 28వ తేదీ సోమవారం నుంచి 31వ తేదీ గురువారం జరిగే ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్ మెగా పోటీలకు ఆతిథ్యం ఇవ్వనుంది. పురుషులకు ఫ్రీస్టయిల్, గ్రీకో రోమన్, మహిళలకు ఫ్రీస్టయిల్ విభాగాల్లో పోటీలు ఉంటాయి. పురుషుల విభాగం ఫ్రీస్టయిల్‌లో 61, 70, 79, 92, గ్రీకో రోమన్‌లో 55, 63, 72, 82 కిలోల ఈవెంట్స్‌ను నిర్వహిస్తారు. అదే విధంగా మహిళలకు ఫ్రీస్టయిల్‌లో 55, 59, 65, 72 కిలోల డివిజన్లలో పోటీలు నిర్వహిస్తారు. యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యుడబ్ల్యుడబ్ల్యు) ఆధ్వర్యంలో జరిగే ఈ మెగా ఈవెంట్‌లో, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొన్న వారు అనర్హులు. వారిని మినహాయించి, మిగతా రెజ్లరర్లు ఈ చాంపియన్‌షిప్స్‌లో పోటీపడే అవకాశం ఉంటుంది.

### రెజ్లింగ్‌కు శతాబ్దాల చరిత్ర

రెజ్లింగ్ లేదా కుస్తీ.. ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన క్రీడల్లో ఒకటి. దీనికి శతాబ్దాల చరిత్ర ఉంది. మన దేశంలోనూ కుస్తీ లేదా మల్లయుద్ధంగా పిలిచే ఈ క్రీడ ప్రస్తావన అటు చరిత్రలో.. ఇటు ఇతిహాసాల్లోనూ ఉంది. శీరారక దృఢత్వానికి ఒక వ్యాయామంగా కుస్తీని పేర్కొంటారు. కేవలం శారీరకబలమేగాక, తెలివి, సమయస్ఫూర్తి కూడా అవసరమని దారాసింగ్ వంటి రెజ్లర్లు నిరూపించారు. మన దేశంలో టర్కో–మంగోల్ సంతతికి చెందిన మొఘల్ పాలనలో, ఇరానియన్, మంగోలియన్ సంప్రదాయాలు కూడా వచ్చి చేరాయి. ఇవి భారత కుస్తీతో జత కలిసి, ఆధునిక 'పెహల్వానీ'గా రూపాంతరం చెందింది. కుస్తీని ఉత్తర భారతంలో 'దంగల్' అని కూడా పలుస్తారు. పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో కుస్తీ పోటీలు వృత్తాకారంలో ఉన్న కోర్టులో నిర్వహిస్తారు. ఈ రింగ్‌ను 'అఖారా' అని పిలుస్తారు. పోటీపడిన వారిలో ఒక మల్లయోధుడి వీపు నేలకు తలిగే వరకూ పోటీ కొనసాగుతుంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లో, వేరువేరు పేర్లతో కుస్తీని కొద్దిపాటి మార్పులతో నిర్వహిస్తారు. కేరళలో గట్టా గుస్తీగా పేర్కొనే సాధారణ రెజ్లింగ్ కొనసాగుతుంది. మిగోరంలో సంప్రదాయ కుస్తీ శైలికి 'ఇన్బువాన్' అని పేరు. దక్షిణాసియా జానపద కుస్తీలో వ్యక్తుల మధ్యకాకుండా, జట్ల మధ్య జరుగుతుంది. కబడ్డీ క్రీడా ఈ విధానం నుంచే ఉద్భవించిందని అంటారు. కాగా, నాగాలాండ్‌లో సంప్రదాయ కుస్తీని 'కెనే' అని పిలుస్తారు. ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉన్న సింధ్‌తోపాటు, గుజరాత్‌లోని పలు ప్రాంతాల్లో కుస్తీని 'మలాఖ్రా' అని వ్యవహరిస్తారు. మల్లయుద్ధం అనే పదం దాదాపు దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ వినిపిస్తుంది. తమిళనాడులో 'మాల్యుతం' అని పిలిచినా, మణిపూర్‌లో 'ముక్నా'గా వ్యవహరించినా కుస్తీ మూల విధానాల్లో పెద్దగా మార్పు లేదు. మొఘల్ శైలిలో జరిగే కుస్తీని 'పెహల్వానీ'గా పేర్కొంటారు. అందుకే, కుస్తీ వీరుడిని పెహల్వాన్ అని పిలవడం రివాజు. పిడికిళ్లను ఆయుధంగా చేసుకొని జానపద కుస్తీ రూపాన్ని 'వజ్రముష్టి'గా పేర్కొంటారు. బాక్సింగ్‌కు ఇది మాతృక అన్నది కొంత మంది వాదన.





### రెజ్లింగ్‌లో మన దేశం..

భారత్ వివిధ ప్రాంతీయ, అంతర్జాతీయ వేదికలపై కుస్తీ పోటీల్లో పాల్గొంది. పతకాలు సాధించింది. ఒలింపిక్స్‌లో మనకు ఇప్పటి వరకూ స్వర్ణం రాలేదు. 2 రజతం, 6 కాంస్యంతో మొత్తం 8 పతకాలు దక్కాయి. ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో ఒక స్వర్ణం, 5 రజతం, 17 కాంస్యాలతో 23 మెడల్స్ సాధించింది. ఆసియా క్రీడల్లో 11 స్వర్ణం, 15 రజతం, 19 కాంస్యాలతో మొత్తం 65 పతకాలు తన ఖాతాలో వేసుకుంది. ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్‌లో 25 స్వర్ణం, 82 రజతం, 137 కాంస్యంసహా 244 పతకాలు గెల్చుకుంది. కామన్వెల్త్ గేమ్స్ విషయానికి వస్తే 49 స్వర్ణం, 99 రజతం, 26 కాంస్యాలతో 114 పతకాలు కైవసం చేసుకుంది. మొత్తం మీద ఇప్పటి వరకూ భారత్ సాధించిన పతకాలు 453. వీటిలో 86 స్వర్ణం, 143 రజతం, 224 కాంస్య పతకాలు ఉన్నాయి.

### 1961లో తొలి పతకం..

ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్ 1904లో ప్రారంభమైనప్పటికీ, భారత్ స్వాతంత్ర్యం పొందిన తర్వాత 1961 వరకూ బోణీ చేయలేకపోయింది. ఆ ఏడాది యొకొహామా (జపాన్)లో జరిగిన పోటీల్లో పురుషుల 67 కిలోల విభాగంలో ఉదయ్ చంద్ కాంస్య పతకం సాధించాడు. అదే వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు తొలి పతకం. కాగా, తొలి స్వర్ణాన్ని సుశీల్ కుమార్ అందించాడు. 2010లో, మాస్కో (రష్యా) వేదికగా జరిగిన పోటీల్లో అతను 66 కిలోల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో స్వర్ణాన్ని అందుకున్నాడు. ఆ తర్వాత ఇప్పటి వరకూ భారత్‌కు ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో స్వర్ణం ఎంతమావిగానే మారింది.

# పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

- ప్రపంచంలో అతిపెద్ద పక్షి ఏది?
  నిప్పుకోడి.
- 'ఫాదర్ ఆఫ్ కంప్యూటర్స్' అని ఎవరిని పిలుస్తారు?
  చార్లెస్ బాబేజ్.
- పారిశ్రామిక విప్లవం ఏ సంవత్సరంలో ప్రారంభమైంది?
  పారిశ్రామిక విప్లవం సాధారణంగా 18వ శతాబ్దం చివరిలో ప్రారంభమైనట్లు పరిగణించబడుతుంది.
- కెనడా కరెన్సీ అంటే ఏమిటి?
  కెనడియన్ డాలర్.
- 'ప్రైడ్ అండ్ ప్రిజుడీస్' ఎవరు రాశారు?
  జేన్ ఆస్టెన్.
- ఈజిప్టు రాజధాని ఏది?
  కైరో.
- భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన మొదటి మహిళ ఎవరు?
  మేరీ క్యూరీ.
- సౌదీ అరేబియా కరెన్సీ ఏమిటి?
  సౌదీ రియాల్.
- రష్యన్ విప్లవం ఏ సంవత్సరంలో జరిగింది?
  1917.
- 'ది స్క్రీమ్' ఎవరు చిత్రించారు?
  ఎడ్వర్డ్ మంచ్.
- స్విట్జర్లాండ్ కరెన్సీ ఏమిటి?
  స్విస్ ఫ్రాంక్.
- వాటర్లూ యుద్ధం ఏ సంవత్సరంలో జరిగింది?
  1815.
- 'ఫాదర్ ఆఫ్ ది ఇంటర్నెట్' అని ఎవరిని పిలుస్తారు?
  వింటన్ సెర్ఫ్.
- దక్షిణాఫ్రికా రాజధాని ఏది?
  ప్రిటోరియా (పరిపాలన), కేప్ టౌన్ (లెజిస్లేటివ్), బ్లూమ్‌ఫోంటైన్ (న్యాయసంబంధం).
- 'ది ఒడిస్సీ' ఎవరు వ్రాసారు?
  హోమర్.
- బెర్లిన్ ఎయిర్‌లిఫ్ట్ ఏ సంవత్సరంలో జరిగింది?
  1948–1949.
- చైనా కరెన్సీ ఏమిటి?
  చైనీస్ యువాన్.
- గురుత్వాకర్షణ నియమాన్ని ఎవరు కనుగొన్నారు?
  సర్ ఐజాక్ న్యూటన్.
- మన సౌర వ్యవస్థలో అతిపెద్ద చంద్రుడు ఏది?
  గనిమీడ్ (బృహస్పతి యొక్క చంద్రుడు).
- యూరోపియన్ యూనియన్ (EU) ఏ సంవత్సరంలో ఉనికిలోకి వచ్చింది?
  1993.
- యుఎస్‌ఎలోని సౌత్ డకోటా రాజధాని ఏది?
  పియర్.
- రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన మొదటి మహిళ ఎవరు?
  మేరీ క్యూరీ.
- ఆస్ట్రేలియా కరెన్సీ ఏమిటి?
  ఆస్ట్రేలియన్ డాలర్.
- ఫ్రెంచ్ విప్లవం ఏ సంవత్సరంలో ప్రారంభమైంది?
  1789.
- 'గర్ల్ విత్ ఎ పెర్ల్ ఇయర్రింగ్' ఎవరు చిత్రించారు?
  జోహన్నెస్ వెర్మీర్.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్రన్




ప్రజాపక్షం/మెట్‌పల్లి: బిఆర్‌ఎస్ ప్రభుత్వం పెంచిన మున్సిపల్ కార్మికులకు రూ.1000 రూపాయిలు ఏడు నెలల బకాయిలు చెల్లించి (ఇఎస్ఐ) తక్షణమే అమలు చేయాలని ఎఐటి యుసి రాష్ట్ర అధ్యక్షులు కే రవిచంద్రన్, కార్యదర్శి వి.జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో కార్మికులతో శనివారం రాష్ట్ర అధ్యక్షులు రవి చంద్రన్, కార్యదర్శి జైపాల్ రెడ్డి, సమావేశమై మాట్లాడుతూ రావల్సిన బకాయిల గురించి మాట్లాడి వారితో కలిసి మున్సిపల్ కమిషనర్ మోహన్ వినతి పత్రం అందజేశారు.వీరి జీతాలు 1నుండి 5 తారీకు లోపు జీతాలు రెవెన్యూకు సంబంధం లేకుండా 010 హెడ్ ట్రెజరీ ద్వారా వేతనాలు అందజేయాలి. పండగపూట సెలవులు డిఎంఏ సర్కులర్ ప్రకారం అమలు చేయాలన్నారు ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఉస్మాన్, మున్సిపల్ కార్మిక అధ్యక్షులు లక్ష్మణ్, నాయకురాలు మధు రమ్మ, శ్రీకాంత్, సుమన్, వాజిద్, తోటి కార్మికులు తదితరులు పాల్గొన్నారు

## సిపిఐ సీనియర్ నేత వి.నరసయ్య మృతి

ప్రజాపక్షం/మణుగూరు : మణుగూరు మండలం సమితి సింగారం పంచాయతీ ఫైర్ స్టేషన్ బజార్ సిపిఐ సీనియర్ కార్యకర్త వేరుపుల నరసయ్య(85)మృతి చెందారు. విషయం తెలియగానే సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. అయోధ్య, సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్గ్యాల సుధాకర్, జిల్లా సమితి సభ్యులు ఎస్ కే సర్వర్, రైతు సంఘం జిల్లా నాయకులు మంగ వీరయ్య, ఎఐటియుసి మణుగూరు మండల కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, మహిళా సమాఖ్య మండల కార్యదర్శి దుబ్బాక నిర్మల, ప్రమీల తదితరులు హాజరై ఎర్రజెండా కప్పి, పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. వీరి వెంట బోడ్డుపల్లి చంద్రమౌళి, యనమల సుధాకర్ పాల్గొన్నారు.

# సమస్యలు లేని పట్టణంగా కొత్తగూడెంను తీర్చిదిద్దుతా

### నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదు

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

### రూ.1.90కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### రూ.50లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌లు ప్రారంభం





ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి : అతి త్వరలోనే సమస్యలు లేని పట్టణంగా కొత్తగూడెంను తీర్చిదిద్దుతానని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు.కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 14,28, 29, 26 వార్డుల్లో రూ.1.90లక్షల డిఎంఎఫ్ నిధులతో చేపట్టనున్న సిసి డ్రైన్‌ల నిర్మాణాలకు శనివారం కూనంనేని శంకుస్థాపన చేసి 26వ వార్డు పరిధిలో రూ. 50లక్షల వ్యయంతో నిర్మాణం పూర్తి చేసుకున్న కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో పక్కారోడ్లు, డ్రైన్‌ల నిర్మాణం పక్కాగా పూర్తి చేస్తామని, ఇప్పటికే చాలా వార్డుల్లో అంతర్గత రోడ్లు పూర్తయ్యాయని, మిగిలిన రోడ్లు, బస్తి ప్రధాన రహదారులకు ప్రణాళిక సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించామని తెలిపారు. ప్రతి వార్డలో కమ్యూనిటీ హాల్, ఓపెన్‌జిమ్ములు ఏర్పాటుకు కృషి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, మున్సిపాల్ చైర్‌పర్సన్ సీతామహాలక్ష్మి , మున్సిపాల్ కమీషనర్ శేషాంజన్‌స్వామి, డిఈ రవి, పబ్లిక్ హెల్త్ డిఈ శ్రీనివాస్, ఏఈ నవ్యజ్యోతి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ అశోక్ చౌహాన్, కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

### 'కుడా' ఏర్పాటుతో శరవేగంగా అభివృద్ధి

శనివారం కొత్తగూడెం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ(కూడ) ఏర్పాటు కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, అధికారులకు పలుమార్లు రిప్రజెంటేషన్లు అందించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కొత్తగూడెం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ(కెయుడిఏ) ఏర్పాటు కోసం జీవో 177 జారీ చేసిందని తెలిపారు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలను కలుపుతూ కార్పొరేషన్ ఏర్పాటు కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు.(కూడ) ఏర్పాటు అయిన వెంటనే నియోజకవర్గం అన్ని రకాలుగా అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి గుర్తింపు, పరిశ్రమలు వస్తాయి. ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు పెద్ద మొత్తంలో వస్తాయని తెలిపారు. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలను కలిపి కార్పొరేషన్ ఏర్పాటుకు శక్తివంచనలు లేకుండా కృషి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం, దుర్గరాశి వెంకన్న, సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, గిద్దోడా నాగేశ్వర రావు, పూర్ణచంద్రరావు, కంచర్ల జమలయ్య, సాయి బాబా, భూక్యా శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, సత్యనారాయణచారి, బోయిన విజయ్, యూసుఫ్, ధర్మరాజు, కోటం రాజు, సుధాకర్, పోతు పురుషోత్తం పాల్గొన్నారు.

### 'కుడా'తో జంట నగరాల అభివృద్ధి

ప్రజాపక్షం/భద్రాచలం: కొత్తగూడెంపాల్వంచ పట్టణాలను కలుపుతూ కొత్తగూడెం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (కుడ) ఏర్పాటు ద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జంటనగరాలను కలిపితే మెరుగైన అభివృద్ధి సాధిస్తామని పలుమార్లు ప్రభుత్వపెద్దల దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం జిఓ నెం.177 జారీ చేసినట్లు ఆయన చెప్పారు. కుడ ఏర్పాటు ద్వారా నియోజకవర్గం అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్నన్ని వనరులు రాష్ట్రంలో ఎక్కడా లేవని, ఇప్పటికే పాల్వంచ పట్టణం కేంద్రంగా పరిశ్రమలు విలసిల్లుతున్నాయని, ఇక్కడితో ఆగకుండా కార్పొరేషన్ ఏర్పాటుకు కూడా కృషి చేస్తున్నట్లు కూనంనేని వివరించారు. కొత్తగూడెంపాల్వంచ బైపాస్ రోడ్డు కోసం రూ.కోటి మంజూరైందని, త్వరలో పనులు ప్రారంభిస్తారని చెప్పారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, నాయకులు ముత్యాల విశ్వనాధం, దుర్గరాశి వెంకన్న, సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళీ, పూర్ణ చంద్రరావు, కంచర్ల జమలయ్య, అడుమిల్ల సాయిబాబా, భూక్యా శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, యూసఫ్, బోయిన విజయ్ కుమార్, పి సత్యనారాయణ చారి, కోటం రాజు, సుధార్ పాల్గొన్నారు.

# జమిలి ఎన్నికలు సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం

### సిపిఐ శత వార్షికోత్సవాలను వాడవాడలా నిర్వహించాలి

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు




ప్రజాపక్షం/హనుమకొండప్రతినిధి : జమిలి ఎన్నికలను ఒకేసారి నిర్వహించడం భారత సమాఖ్య విధానానికి విరుద్ధమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా సమితి సమావేశం ఆదరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ బిజెపి నోట జమిలి ఎన్నికల మాట వినబడుతున్నదని, కేవలం పెట్టుబడిదారుల కోసమే జమిలి ఎన్నికలు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారని, జమిలి ఎన్నికలు మన దేశంలో సాధ్యం కాదని, అది సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందన్నారు. రాష్ట్రాల హక్కులను పూర్తిగా అణిచివేసేందుకే జమిలి ఎన్నికల పాట అందుకున్నారన్నారు. కార్పొరేట్ వ్యవస్థ రోజు రోజుకు విస్తరించడం వల్లనే నిరుద్యోగం, నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అడిగిడుతున్న సందర్భంగా సిపిఐ శత దినోత్సవ వేడుకలను సంవత్సరం పాటు ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా పార్టీని గ్రామ గ్రామానికి విస్తరించాలని, వాడవాడలా శత సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. పేదవానికి ఇళ్ల స్థలాలు, పక్కా ఇండ్లు నిర్మించే వరకు భూ పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. స్థానిక సంస్థల్లో పార్టీ అభ్యర్థులను నిలబెట్టి ప్రజా సమస్యలను పరిష్కారం దిశగా పయనించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, కార్యవర్గ సభ్యులు ఊట్కూరు రాములు, కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, భాషబోయిన సంతోష్, నకిర్తే ఓదెలు, జక్కు రాజు గౌడ్, మంచాల రమాదేవి, నేదునూరి రాజమౌళి పాల్గొన్నారు.

# సిపిఐ శతవార్షికోత్సవాలను జయప్రదం చేయాలి

### * నల్లగొండలో డిసెంబర్ 30న బహిరంగ సభ

### * రాష్ట్ర ప్రారంభ సభ సన్నాహక సమావేశంలో పల్లా వెంకటరెడ్డి




ప్రజాపక్షం/నల్లగొండప్రతినిధి: దోపిడీ లేని వ్యవస్థ కోసం సమ సమాజ స్థాపన కోసం నాడు స్వాతంత్ర్య పోరాటంలో అగ్రభాగంలో నిలిచి పోరాడిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి అన్నారు. సిపిఐ వంద సంవత్సరాల సందర్భంగా శనివారం స్థానిక మగ్దూమ్ భవన్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా సిపిఐ శతవార్షికోత్సవ రాష్ట్ర ప్రారంభ సభ సన్నాహక సమావేశం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి పల్లా వెంకట రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26వ తేదీన కాన్పూర్‌లో సిపిఐ ఆవిర్భవించి బ్రిటిష్ ప్రభుత్వంకు వ్యతిరేకంగా పోరాడి ఎన్నో నిర్బంధాలను కుట్రలను జైలు జీవితాలను ఎదుర్కొని త్యాగాలు చేసిన గొప్ప చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అని గుర్తు చేశారు. పాలకులు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతరం ప్రజలను చైతన్యం చేస్తూ అనేక పోరాటాలకు నాయకత్వం వహిస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి ఉమ్మడి నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేయాలని దశాబ్దాల కాలంగా జిల్లా ప్రజలను పట్టి పీడిస్తున్న ఫ్లోరైడ్ మహమ్మారి నుంచి ప్రజలకు విముక్తి కలిగించాలని అనేక దపాలుగా పోరాటాలు నిర్వహించిందన్నారు. దేశంలో సిపిఐ ఏర్పడి వంద సంవత్సరాలలో అడుగుపెడుతున్న సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో డిసెంబర్ 30వ తేదీన రాష్ట్ర స్థాయి ప్రారంభ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి, గన్నా చంద్రశేఖర్, సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, మల్లేపల్లి ఆదిరెడ్డి, ఉజ్జిని యాదగిరిరావు, నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లొడంగి శ్రవణ్ కుమార్,భువనగిరి జిల్లా సహాయ కార్యదర్శి దామోదర్ రెడ్డి, ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



## నవంబరు 26న పార్లమెంట్ ఉభయసభలు భేటీ

**న్యూఢిల్లీ :** భారత రాజ్యాంగాన్ని ఆమోదించుకుని 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నవంబరు 26వ తేదీన పార్లమెంట్ ఉభయ సభల ప్రత్యేక సంయుక్త సమావేశం జరగనున్నట్లు అధికారులు తెలిపారు. సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్ హాల్‌లో లోక్‌సభ, రాజ్యసభ సంయుక్త సమావేశం నిర్వహించనున్నారు. నవంబరు 26, 1949లో భారత రాజ్యాంగం ఆమోదం పొందగా, జనవరి 26, 1950 నుంచి అమల్లోకి వచ్చింది. గతంలో నవంబరు 26న జాతీయ న్యాయ దినోత్సవంగా జరిపేవారు. కానీ.. 2015లో బిఆర్ అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా నవంబరు 26ను రాజ్యాంగ దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది.

# మీరే..నాకు 'గైడ్స్, ఉపాధ్యాయులు'

### వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గ ప్రజలకు కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంకగాంధీ బహిరంగలేఖ

### ప్రజాప్రతినిధిగా కొత్తేమో కానీ... ప్రజా యోధురాలిగా కాదని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** కేరళ రాష్ట్రం వయనాడు లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఇటీవల నామినేషన్ దాఖలు చేసిన కాంగ్రెస్ నేత ప్రియాంకగాంధీ వాద్రా ఓటర్లను ఆకట్టుకునే పనిలో మరింత వేగం పెంచారు .ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలలో పోటీచేసిన కాంగ్రెస్ మాజీ చీఫ్ రాహుల్‌గాంధీ సిపిఐ నేత అన్నీరాజాపై 3.6లక్షల మెజార్టీతో గెలుపొందిన విషయం తెలిసిందే. రెండు లోక్‌సభ స్థానాలనుంచి పోటీ చేసిగెలుపొందిన రాహుల్ గాంధీ వయనాడు లోక్‌సభ స్థానానికి రాజీనామా చేయడంతో వయనాడు స్థానానికి ఉప ఎన్నిక జరుగబోతున్నది. నవంబరు 13న వాయనాడు లోక్‌సభ నియోజకవర్గానికి ఎన్నికలు జరుగనున్నాయి. ప్రియాంకగాంధీ వయనాడు లోక్‌సభా స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేసిన అనంతరం శనివారం నాడు వయనాడు ప్రజలకు రాసిన ఒక బహిరంగ లేఖలో ఆమె ఓటర్లకు తనతరుపున ఒక సందేశం ఇచ్చారు.ప్రజాప్రతినిధిగా తనకు ఇది మొదటి ప్రయాణం కావచ్చేమో కానీ, ప్రజా పోరాట యోధురాలిగా మాత్రం కాదని స్పష్టం చేశారు. ప్రజా స్వామ్యం, న్యాయం, రాజ్యాంగంలో పొందుపరచబడిన విలువల కోసం శక్తివంచనలేని పోరాటం చేయటమే తన జీవితంలో ఎంతో ప్రధానమైనదని ప్రియాంకగాంధీ నొక్కిచెప్పారు. వయనాడు ప్రజలకు తాను సన్నిహితంగా ఉండి పనిచేస్తానని, వారు ఎదుర్కొనే సవాళ్లను పరిష్కరించేందుకు సహాయపడతానని ఈ సందర్భంగా ప్రియాంక హామీ ఇచ్చారు. నవంబరు 13న వయనాడు లోక్‌సభ నియోజకవర్గానికి జరుగనున్న ఉప ఎన్నికలలో తనను ఎన్నుకోవాలని ఆమె ప్రజలను అభ్యర్థించారు. తాను ప్రజలతో ఎంతో అనుబంధంతో సేవలు అందిస్తానని, ప్రజలకోసం అంతా చేస్తానని, వారి కోసమే పనిచేస్తానన్నారు. ప్రజలు పార్లమెంట్‌లో ఏ విధంగా తాను ప్రాతినిథ్యం వహించాలని కోరుకుంటున్నారో, వారి ఆకాంక్షలకు అనుగుణంగా అదే పద్ధతిలో తాను పనిచేస్తానని ప్రియాంకగాంధీ అభయం ఇచ్చారు. వయనాడు ప్రజలు తొలిసారిగా ప్రజాప్రతినిధిగా పనిచేసే అవకాశం వచ్చిన తనకు తన ప్రయాణంలో ప్రజలు మార్గదర్శకులు, ఉపాధ్యాయులుగా దోహదపడాలని కోరారు. మన అందరి భవిష్యత్తులను పరిరక్షించేందుకు ముందుకు సాగేందుకు వయనాడ్ ఎన్నికల పోరాటంలో ప్రజల మద్దతు కోరుతున్నానని, వయనాడు ఎంపిగా తనను ఎన్నుకున్నట్లయితే ప్రజలందరికీ రుణపడి ఉంటానని ప్రియాంక గాంధీ తన బహిరంగా లేఖలో హామీ ఇచ్చారు. వయనాడ్‌లో ప్రకృతి బీభత్సం సందర్భంగా కొండచరియలు విరిగినప్పుడు తాను తన సోదరుడు రాహుల్‌గాంధీతో పాటు వయనాడ్ నియోజకవర్గం పరిధిలోని చురాల్‌మలా, ముందక్కిలో పర్యటించి ప్రజల కష్టాలు, బాధలు చూసి చలించిపోయానని, తల్లులు దూరమైన బాధతో ఉన్న పిల్లలను, ప్రమాదంలో పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రుల బాధలను తెలుసుకుని కన్నీటి పర్యంతమయ్యానని, తాను ఇంటికి తిరిగి వెళ్లేటప్పుడు వయనాడు ప్రజలకు పార్లమెంట్‌లో ప్రాతినిథ్యం వహించడం తాను ఎంతో గౌరవంగా, గర్వంగా భావిస్తానని నిర్ణయించుకున్నానని బహిరంగలేఖలో తెలియజేశారు. పప్రకృతి తన గొప్ప అందాన్ని, వెలకట్టలేని వనరులను వయనాడ్ ప్రజలకు కానుకగా ఇవ్వడం ఎంతో సంతోషదాయకమన్నారు. వాటిని పరిరక్షిస్తానని తాను విశ్వసిస్తున్నానన్నారు. వయనాడు ప్రజలు పర్యావరణాన్ని ఉత్సవంగా జరుపుకునే సంస్కృతిని తాను ఎంతో గౌరవిస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం దృష్టికి తాను వయనాడు ప్రజల తరఫున తీసుకెళ్లి అభివృద్ధికి పాటుపడతానని ప్రియాంక గాంధీ వయనాడ్ ప్రజలకు తన బహిరంగ లేఖలో స్పష్టమైన హామీ ఇచ్చారు.




# గిరిజనుల ప్రాతినిథ్యం ద్వారానే దేశ సమ్మిళిత అభివృద్ధి సాధ్యం

### ఐఐటి భిలాయ్ స్నాతకోత్సవ సభలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్బోధ



**భిలాయ్ :** గిరిజనుల చురుకైన ప్రాతినిథ్యంలేకుండా దేశ సమ్మిళిత అభివృద్ధి సాధ్యం కాదని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్ఘాటించారు. ప్రకృతితో సామరస్యంగా వ్యవహరిస్తూ ఏవిధంగా జీవించారనేది మనం గిరిజన సామాజిక వర్గం నుంచి నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె నొక్కిచెప్పారు. శనివారంనాడు ఛత్తీస్‌ఘర్ దుర్గ్ జిల్లాలోని భిలాయ్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) 3వ, 4వ ఉమ్మడి స్నాతకోత్సవ కార్యక్రమానికి రాష్ట్రపతి ముర్ము ముఖ్యఅతిథిగా విచ్చేసి తన సందేశాన్నిచ్చారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా భిలాయ్ ఐఐటి గిరిజన సామాజికవర్గం సమస్యలు, కష్టనష్టాలను పరిష్కరించేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఆమె అభినందించారు. ప్రకృతిని అనుసంధానంగా చేసుకుని గిరిజనులు వారి జీవనవిధానాన్ని ఒక గొప్ప విజ్ఞాననిధిని సొంతం చేసుకున్నారని, మనం వారి ఆలోచనావిధానాన్ని, జీవనవిధానాన్ని అవగాహన చేసుకోవడం ద్వారా భారతదేశ స్థిర అభివృద్ధిని సాధించడంలో కీలకపాత్రను పోషించగలుగుతామన్నారు. మన గిరిజన సోదరులు, సోదరీమణులకు చురుకైన ప్రాతినిథ్యం కల్పించడం ద్వారానే దేశ సమ్మిళిత అభివృద్ధి సాధ్యమని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము పేర్కొన్నారు. ఐఐటి భిలాయ్ ప్రత్యేకంగా వ్యవసాయ, ఆరోగ్య, ఆర్థిక సాంకేతికపరిజ్ఞానంపై దృష్టి సారించడం ప్రశంసనీయం అన్నారు. రాయ్‌పూర్ ఎయిమ్స్ సౌజన్యంతో ఐఐటి భిలాయ్ మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేసి గ్రామీణ ప్రజలకు వైద్య, ఆరోగ్య సూచనలు అందజేస్తున్నదని ఆమె వివరించారు. ఐఐటి భిలాయ్ ఇందిరాగాంధీ అగ్రికల్చరల్ యూనివర్సిటీ రాయ్‌పూర్ సౌజన్యంతో రైతులకు సాంకేతిక పరిష్కారాలను సృష్టిస్తున్నదన్నారు. అంతేకాకుండా రైతులు తమ వనరులను సద్వినియోగం చేసుకునేలా తగిన మార్గనిర్దేశనం చేస్తున్నదని రాష్ట్రపతి వెల్లడించారు.' క్రాప్ డాక్టర్' అనే మొబైల్ అప్లికేషన్‌ను ఆరు లక్షల మంది రైతులు ఉపయోగిస్తున్నారని వెల్లడించేందుకు తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు. అంతేకాకుండా ఐఐటి భిలాయ్ సమాజానికి అవసరమైన పరిశోధనను ప్రోత్సహిస్తోందన్నారు. నేను చెప్పిఉన్నటువంటి జాతీయ భద్రత, రక్షణకు సంబంధించిన అనేక ప్రాజెక్ట్‌లను భిలాయ్ ఐఐటి నిర్వహిస్తున్నదని ఆమె తన సంతృప్తిని వ్యక్తంచేశారు. నేటివరకు దేశంలో 23 ఐఐటిలు ఉన్నాయన్నారు. యువతకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన సాంకేతిక విద్యను అందించే ధ్యేయంతో దేశంలోని అన్ని ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వం ఐఐటిలను నెలకొల్పిందని గుర్తుచేశారు. ఛత్తీస్‌ఘర్ గవర్నర్ రమేన్ డెకా, ఛత్తీస్‌ఘర్ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణు దేశాయ్, ఐఐటి భిలాయ్ బోర్డ్ ఆఫ్ గవర్నర్ల (బిఓజి) చైర్మన్ కృష్ణమూర్తి వెంకటరమణన్, ఐఐటి భిలాయ్ డైరెక్టర్, ప్రొఫెసర్ రాజీవ్ ప్రకాష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆ ఘనత సైన్యానిది..దౌత్యానిది

**పుణె :** వాస్తవాధీన రేఖ వద్ద గస్తీ విషయంలో చైనాతో కుదిరిన ఒప్పందం ఘనత అత్యంత ఊహకందని రీతిలో పని చేసిన సైన్యానిది, నేర్పుతో కూడిన దౌత్యానిది అని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ కొనియాడారు. పుణెలో విద్యార్థులతో శనివారం జరిగిన చర్చాగోష్ఠిలో విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ సంబంధాలు తొందరగా సాధారణమవుతాయని అనుకోవద్దని, అయితే, సహజ ప్రకియలో విశ్వాసాన్ని పెంపొందించుకోవడం, పరస్పరం కలిసి పని చేసేందుకు ఆసక్తి చూపడంపైనే అది ఆధారపడి ఉంటుందన్నారు. ఇటీవల రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సమ్మిట్ సందర్భంగా చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ప్రధాని నరేంద్ర మోదీ కలిసారని, ఉభయదేశాలు ముందుకు వెళ్ళేందుకు ఇరు దేశాల విదేశాంగ మంత్రులు, జాతీయ భద్రతా సలహాదారులు త్వరలో సమావేశం కావాలని నిర్ణయించారని చెప్పారు. నేడు మనం చేరుకున్న పరిస్థితికి మన వైపునుంచి అత్యంత దృఢమైన కృషి, మన వైఖరి తెలియజేయడం ఒక అంశమని, అత్యంత ఊహకందని పరిస్థితుల్లో మిలిటరీ ఎల్‌ఏసి వద్ద దేశాన్ని రక్షించడం మరో కారణమని పేర్కొన్నారు. మిలిటరీ , దౌత్యం ఎవరి పని వారు చేసుకున్నారని అన్నారు. దశాబ్దానికిపైగా భారతదేశం మౌలిక సదుపాయాలను పెంపొందించుకోలేదని, గతంలో సరిహద్దు వద్ద మౌలిక సదుపాయల కల్పనను నిర్లక్ష్యం చేశారని అన్నారు. దశాబ్దాం క్రితం కంటే నేడు మిలిటరీపై ఐదింతలు ఖర్చు చేస్తుండడంతో ఫలితాలు కనిపిస్తున్నాయన్నారు. సమస్య పరిష్కారానికి విభిన్న అంశాలుఉంటాయని జై శంకర్ అన్నారు. మొదటిది సరిహద్దుల నుంచి ఇరువైపుల సైన్యం ఉపసంహరణ, తరువాత ఉద్రిక్తలు తగ్గించుకొని ఇరువైపుల విశ్వాసం పెంపొందించుకోవడం వంటివి అని తెలిపారు. ఆ తరువాత సరిహద్దును ఎలా నిర్వహించాలనేది పెద్ద అంశమని, సరిహద్దుల పరిష్కారంపై చర్చలు జరగాలని చెప్పారు. ఇప్పుడు జరుగుతున్నదంతా సైన్యం ఉపసంహరణ అనే తొలి అంకమని వివరించారు. 2020లో స్థితి నుంచి సైన్యం ఉపసంహరణ తరువాత గస్తీ విషయంలో ఇరు పక్షాలు అవగాహనకు వస్తాయని తెలిపారు. గస్తీ విషయంలో కొంత ఆటంకాలు ఉన్నాయని, దానిపైనే రెండేళ్ళుగా చర్చిస్తున్నామని జై శంకర్ వెల్లడించారు. దేప్సాంగ్, దెమ్చోక్ ప్రాంతాలపై అక్టోబర్ 1న అవగాహన కుదుర్చుకున్నామని, గతంలో మాదిరిగానే అక్కడ ఉంటుందన్నారు.



# పోటీలో లేని ఆప్...

### 'ఇండియా' కూటమి అభ్యర్థులకు కేజ్రీవాల్ ప్రచారం



**ముంబయి :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కీలక నిర్ణయం తీసుకుంది. మహారాష్ట్రలో 'ఇండియా కూటమి' అభ్యర్థుల తరపున ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రచారం చేయనున్నారు. ఆప్ కార్యకర్తలు ఉన్న చోట్ల, ఎలాంటి వివాదాలు లేనటువంటి ఎంవిఎ అభ్యర్థుల తరపున ఆయన ప్రచారం చేయనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. మహారాష్ట్ర ఎన్నికలకు 'ఆప్' దూరంగా ఉండగా, మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) తరపున ప్రచారంలో కేజ్రీవాల్ పాల్గొంటారని పేర్కొన్నాయి. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, మహారాష్ట్రలో ప్రచారానికి రావాల్సిందిగా శివసేన (యుబిటి), ఎన్‌సిపి (ఎస్‌పి) నేతలు అరవింద్ కేజ్రీవాల్‌ను ఇటీవల కోరారు. ఇందుకు సానుకూలంగా కేజ్రీవాల్ స్పందించారు. ఆప్ కార్యకర్తలు ఉన్న ప్రాంతాల్లోనూ, వివాద రహిత అభ్యర్థులు ఉన్న చోట్ల ప్రచారానికి ఆయన అంగీకరించారు. కేజ్రీవాల్‌తో పాటు పలువురు ఆప్ సీనియర్ నేతలు కూడా మహా వికాస్ అఘాడి తరపున ప్రచారంలో పాల్గొంటారు. 288 మంది సభ్యుల జార్ఖండ్ అసెంబ్లీకి ఒకే విడతలో నవంబర్ 20న పోలింగ్ జరుగనుండగా, నవంబర్ 23న ఫలితాలు వెలువడతాయి.

# ఢిల్లీ గాలి నాణ్యతలో స్వల్ప మెరుగుదల



**న్యూఢిల్లీ :** ఢిల్లీ గాలి నాణ్యతలో స్వల్ప మెరుగుదల వచ్చింది. సానుకూల గాలుల ఫలితంగా గడచిన రెండు రోజులుగా ఢిల్లీ వాతావరణంలో గాలి నాణ్యతా ప్రమాణాలు మెరుగుపడ్డాయి. దీంతో 'వెరీ పూర్ కేటగిరీ' నుండి 'పూర్ కేటగిరీ'స్థాయికి ఢిల్లీ గాలినాణ్యతా ప్రమాణాలు పెరిగాయి. శనివారం సాయంత్రం నాలుగు గంటల నాటికి24 గంటలలో గాలి నాణ్యతా ఇండెక్స్ (ఎక్యూఐ) అంతకుముందున్న 270 నుండి 255 పాయింట్లకు తగ్గిందని కేంద్ర కాలుష నియంత్రణ మండలి (సిపిసిబి) ఒక ప్రకటనలో తెలియజేసింది. ఢిల్లీలో ఉన్న మొత్తం 40 వాతావరణ కేంద్రాలకుగాను 36 కేంద్రాల నుండి అందిన గణాంకాల ప్రకారం, రెడ్ జోన్‌లో ఉన్న ఆనంద్ విహార్, జహంగీర్‌పూరి, ముంద్కా, వజీర్‌పూర్, వివేక్ విహార్, సోనియా విహార్ లలో 'వెరీపూర్' నుండీ 'పూర్' కేటగిరీకి గాలి నాణ్యత మెరుగుపడింది. ఇక్కడికంటే వాటి పొరుగు ప్రాంతాలైన గ్రేటర్ నోయిడా, గురుగ్రామ్, ఫరీదాబాద్‌లలో గాలినాణ్యత కొంత ఉత్తమంగా ఉంది. ఈ ప్రాంతాలలో గాలి నాణ్యత 'మధ్యస్థంగా' ఉంది. కాగా ఢిల్లీ తరహాలోనే నోయిడా, ఘజియాబాద్‌లు 'పూర్' కేటగిరీలో ఉంది. గాలి నాణ్యతను వివిధ కేటగిరీలుగా విభజించారు. పూర్ కేటగిరీ అంటే గాలి నాణ్యత ఇండెక్స్ 201నుండి 300 పాయింట్లు నమోదవుతుంది. వెరీ పూర్ కేటగిరీ కింద గాలినాణ్యత 301 నుండి 400 పాయింట్ల వరకూ నమోదవుతుంది. 401నుండి 450 పాయింట్లవరకూ నమోదైతే తీవ్ర స్థాయిగా పరిగణిస్తారు. 450 పాయింట్లకు పైగా ఉంటే గాలి నాణ్యత అతితీవ్రస్థాయికి దిగజారడంగా పరిగణిస్తారు.

# చిన్న పార్టీలు అభ్యర్థులను ప్రకటించడం సరికాదు

### 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్' నినాదం ప్రతిపక్ష కూటమికి అవసరం

### శివసేన (యుబిటి) నేత సంజయ్ రౌత్

**ముంబయి :** సీట్ల పంపకాలపై మహావికాస్ అఘాడీ (ఎంవిఎ) కూటమిలో ఇంకా ప్రతిష్టంభణ కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో శివసేన (యుబిటి) నేత సంజయ్ రౌత్ స్పందిస్తూ ఎవరికైనా 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్' నినాదం అవసరం అని భావిస్తే... అది ప్రతిపక్ష కూటమికేనని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏకపక్షంగా అభ్యర్థులను ప్రకటించడంపై పీసెంట్ అండ్ వర్కర్స్ పార్టీ (పిడబ్ల్యుపి), సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) వంటి చిన్న పార్టీలపై రౌత్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నవంబరు 20వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్కొక్కరు 85 సీట్ల చొప్పున పోటీ చేస్తాయని ఎంవిఎలోని కాంగ్రెస్, ఎన్‌సిపి(ఎస్‌పి) శివసేన (యుబిటి)లు ప్రకటించాయి. ఆ తరువాత రౌత్ మాట్లాడుతూ 288 సీట్లకు గానూ 270 స్థానాల్లో ఎంవిఎ మధ్య ఏకాభిప్రాయం కుదిరిందని చెప్పారు. అయితే చిన్న పార్టీలతో ఎంవిఎ లో ఏకాభిప్రాయం కుదరకపోతే తమ పార్టీ 20–25 స్థానాల్లో పోటీ చేస్తుందని ఎస్‌పి మహారాష్ట్ర అధ్యక్షుడు అబు అజ్మీ శుక్రవారం ప్రకటించారు. ఇప్పటికే ఆ పార్టీ ఐదు స్థానాల్లో అభ్యర్థులను నిలపగా, మరో ఏడు స్థానాలను కావాలని పట్టుబడుతోంది. కాగా, హర్యానాలో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయిందని, ఆ పార్టీ అందరినీ కలుపుకుని పోవాలని రౌత్ సూచించారు. అబు అజ్మీతో చర్చలు జరుగుతున్నాయని, తన రెండు నియోజక వర్గాలను ఆయన దక్కించుకుంటారు కానీ ఆయన తన స్థానాలను ప్రకటించారు. పిడబ్ల్యుపి కూడా తన సీట్లను ప్రకటించిందని, ఇది సరికాదన్నారు. ఎంవిఎ నుండి ఎవరైనా ఇలా చేస్తే ప్రజలు కలత చెందుతారని, తాము చర్చలు కొనసాగిస్తామని రౌత్ చెప్పుకొచ్చారు. ఎన్‌సిపి చీఫ్ సరద్ పవార్ కూడా పిడబ్ల్యుపితో సీట్లపంపకాలపై చర్చలు జరుపుతారన్నారు.



# 'మహా'లో కాంగ్రెస్, బిజెపి రెండవ జాబితా విడుదల

**ముంబయి/ న్యూఢిల్లీ :** మహారాష్ట్ర లో అసెంబ్లీ ఎన్నికల సందడి నెలకొంది. పోలింగ్‌కు ఇంకో నెల రోజుల సమయం కూడా లేకపోవడంతో పార్టీలు వ్యూహ, ప్రతివ్యూహాలకు పదును పెడుతున్నాయి. దాదాపు అన్ని పార్టీలు అభ్యర్థుల ఎంపిక కసరత్తు పూర్తిచేశాయి. ఒకటి అరా స్థానాలు మినహా అన్ని స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేశాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ శనివారం 23 అభ్యర్థులతో రెండవ జాబితాను విడుదల చేసింది. సిట్టింగ్ ఎమ్మెల్యే కైలాష్ గోరంట్యాల్ మరోసారి జాల్నా నుంచి పోటీ చేయనున్నారు. అదే విధంగా పార్టీ నేత సునీల్ కేదార్ భార్య అంజు సావునేర్ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగనున్నారు. కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ సమావేశమై అభ్యర్థులను ఎంపిక చేసిన తరువాత జాబితాను విడుదల చేశారు. తొలి జాబితాలో 48 మంది అభ్యర్థులను ప్రకటించగా, తాజాగా జాబితాలో 23 మందిని ప్రకటించింది. మొత్తంగా ఇప్పటి వరకు 71 స్థానాల్లో అభ్యర్థులను పోటీకి దింపింది. తొలి జాబితాలో 25 మంది సిట్టింగ్ శాసనసభ్యులకు మరోసారి అవకాశం లభించింది. పార్టీ సీనియర్ నేత, డిప్యూటీ స్పీకర్ వసంత్ పుర్కే మరోసారి రాలేగాన్ నుంచి పోటీ చేయనున్నారు. 2019లో ఓటమి పాలైన శివాజీరావు మోగె కుమారుడు జితేంద్ర అర్ని స్థానంలో బరిలోకి దిగనున్నారు. సిఇసి సమావేశం తరువాత పార్టీ నేత రమేష్ చెన్నితల మీడియాతో మాట్లాడుతూ మహారాష్ట్రలో మిగిలిన స్థానాలపై సిఇసి చర్చలు జరుపుతోందన్నారు. మహావికాస్ అఘాడీ (ఎంవిఎ) ఐక్యంగా పోటీ చేస్తుందని, కూటమి మధ్య విభేదాలు లేవన్నారు. మహారాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు తాము కలిసి పోటీ చేస్తున్నామని చెప్పారు. తాము విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్న విశ్వాసం ఉందన్నారు. ప్రస్తుత అవినీతి ప్రభుత్వాన్ని పారద్రోలేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధమవ్వాలని చెన్నితల పిలుపునిచ్చారు. పిసిసి చీఫ్ నానా పటోలే మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో కంటే అసెంబ్లీ ఎంవిఎ మెరుగైన పనితీరును కనబరుస్తదని చెప్పారు. పూర్తి మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంవిఎ క్లీన్‌స్వీప్ చేసేందుకు అంతా సిద్ధమైందని వేణుగోపాల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. సిఇసి సమావేశ దృశ్యాలను సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు. కాగా, గురువారం కాంగ్రెస్ అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. సకోలి నుంచి పటోలే, కరాడ్ దక్షిణ నుంచి మాజీ ముఖ్యమంత్రి పృథ్వీరాచ్ చౌహాన్, బ్రహ్మపురి నుంచి ప్రస్తుత అసెంబ్లీలో ఉన్న ప్రతిపక్షనేత విజయ్ వేదెట్టివార్ పోటీ చేయనున్నారు.

**22 మందితో బిజెపి రెండవ జాబితా**

మరోవైపు బిజెపి కూడా మరో 22 మంది అభ్యర్థులతో రెండో జాబితాను ప్రకటించింది. కాగా బిజెపి ఇప్పటికే తొలి జాబితాలో 99 మంది అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది. తాజా మరో 22 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంతో ఆ పార్టీ మొత్తం 121 స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేసినట్లయ్యింది.

# 'నేడు' కొత్త ప్యాసింజర్ టెర్మినల్ కార్గో గేట్ 'షురూ'

### భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు క్రాసింగ్ వద్ద కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రారంభం

### ఇరుదేశాల వర్తక, వాణిజ్య సంబంధాలు మరింత బలోపేతానికి మార్గం సుగమం



**న్యూఢిల్లీ / కోల్‌కతా :** భారత్‌బంగ్లాదేశ్ మధ్య వర్తక, వాణిజ్య సంబంధాలు మరింతగా మెరుగుపడేందుకు మార్గం సుగమమైంది. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని ఉత్తర 24పరగణాల జిల్లాలోని భారత్‌బంగ్లాదేశ్ సరిహద్దు క్రాసింగ్ వద్ద కొత్తగా నిర్మించిన ప్యాసింజర్ టెర్మినల్ కార్గొగేట్‌ను ఆదివారం నాడు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రారంభించడం శుభ పరిణామమే. దక్షిణ ఆసియాలోనే అతిపెద్ద 'భూమి నౌకాశ్రయం'(ల్యాండ్ పోర్ట్)గా పెట్రపోల్‌లోని క్రాసింగ్ ప్రఖ్యాతిగాంచింది. భారత్‌బంగ్లాదేశ్ మధ్య వర్తక, వాణిజ్య ఒడంబడికలకు ఇది కీలక ద్వారంగా ఉంది. పెట్రపోల్ (ఇండియా)బెనపోల్ (బంగ్లాదేశ్) భారతబంగ్లాదేశ్ భూభాగాల్లోకి ప్రవేశించేందుకు ఇది ఒక అతిముఖ్యమైన సరిహద్దు క్రాసింగ్ అనే పేరున్నది. ప్రయాణికులు ఇక్కడకు రాకపోకలు సాగించి వర్తకాలకు షరతులు విధించుకుంటారని ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటన వెల్లడించింది. ఈ ఇరుదేశాల మధ్య భూ ఆధారిత వర్తకం (విలువ ద్వారా) దాదాపు 70శాతం మేరకు ఇక్కడే జరుగుతోంది. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ విభాగమైన 'ల్యాండ్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా' పాలనావ్యవస్థ నియంత్రణ కింద ఈ లావాదేవీలు జరుగుతుంటాయి. అంతేకాకుండా ఇది 8వ అతిపెద్ద అంతర్జాతీయ ఇమ్మిగ్రేషన్ పోర్ట్ ఆఫ్ ఇండియాగా కూడా పేరుగడించింది. భారత్ బంగ్లాదేశ్ మధ్య 23.5లక్షల మందికిపైగా కార్యకలాపాలు సాగించేందుకు అనువుగా సదుపాయాలు కల్పించబడ్డాయి. పెట్రపోల్ వద్ద నున్న ఈ కొత్త ప్యాసింజర్ టెర్మినల్ ప్రాంతాల మౌలికసదుపాల కల్పనకు భారత్‌బంగ్లాదేశ్‌ల మధ్య ప్రయాణించేందుకు ఒక సరికొత్త ప్రయాణ అనుభవాన్ని ద్విగిణీకృతం చేస్తోందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదనే చెప్పకతప్పదు. ఆధునిక సాంకేతికపరిజ్ఞానంతో కూడిన అత్యంత పటిష్టమైన ఈ నిర్మాణం అందరు వినియోగదారులకు సురక్షిత, సమర్థత, సౌకర్యాల కల్పన హామీలను ఈ టెర్మినల్ ఇస్తోంది.ఈ టెర్మినల్ రోజుకు 20,000మంది ప్రయాణికులను హ్యాండ్లింగ్ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉందని చెప్పవచ్చు. ఇమ్మిగ్రేషన్స్, క స్టమ్స్, సెక్యూరిటీ సర్వీస్‌లు అన్నీ ఒకే గొడుగుకింద కల్పించబడ్డాయి. 59,800చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్యాసింజర్ టెర్మినల్ కార్గో గేట్ నిర్మించబడింది. పెట్రపోల్‌లోని ఈ టెర్మినల్ వద్ద అత్యంత అధునాతన సౌకర్యాలతో కూడిన అద్భుత విలాసవంతమైన అంతర్జాతీయ ట్రాన్స్‌పోర్ట్ హబ్స్ విఐపి లాంజ్‌లు కూడా నిర్మించబడ్డాయి. డ్యూటీ ఫ్రీ షాప్, కనీస వైద్య సదుపాయాలు, బేబీ ఫీడింగ్ రూమ్, ఫుడ్ అండ్ బేవరేజి ఔట్‌లెట్స్ కూడా నిర్మితమయ్యాయి. ఆటోమేటెడ్ ప్రవేశం, నిష్క్రమణ వ్యవస్థలను కూడా ప్రభుత్వం అమలు చేసింది. అన్ని దక్షిణ ఆసియా దేశాలతో సాంస్కృతిక వర్తక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇప్పటికే ల్యాండ్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు ఆదేశాలు ఇవ్వడం ద్వారా నూతన అధ్యాయాన్ని నెలకొల్పారని కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటన తెలియజేసింది. ఇరుదేశాలకు సంబంధించిన జీరోలైన్ వద్ద నిర్మించిన ఉమ్మడి కార్గో గేట్ 'మైత్రి ద్వార్'ను కూడా ఆదివారం నాడు హోం మంత్రి అమిత్‌షా ప్రారంభించనున్నారు. మే 9,2023న ఆయన దీనికి శంకుస్థాపన చేశారు. పెట్రపోల్ సరిహద్దు వద్ద ప్రతీరోజూ సుమారు 600700ట్రక్కులు రాకపోకలు సాగించడాన్ని ఇకమీదట మనం చూసే అవకాశం ఉన్నది. భారత్'బంగ్లాదేశ్ మధ్య వస్తువుల ప్రవాహంతో వర్తకవాణిజ్యాలను సులభతరం చేయడం కార్గో గేట్‌ను అంకితం చేయడం వెనక గల ప్రధానకారణంగా ల్యాండ్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా తెలియజేసింది. అక్టోబరు 24వ తేదీన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం జరగాల్సి ఉన్నప్పటికీ దానా తుపాన్ కారణంగా అక్టోబరు 27కు (ఆదివారం) వాయిదాపడింది. ఈ నూతన అవస్థాపనా సౌకర్యాలు భారత్‌బంగ్లాదేశ్ సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో ప్రాముఖ్యత కలిగిన ముందడుగు అని పెట్రపోల్ ల్యాండ్‌పోర్ట్ మేనేజర్ కమలేష్ సైనీ తెలియజేశారు.

# ఉపాధి హామీకి కేంద్రం తూట్లు..

### ఆరు నెలల్లో 84.8 లక్షల మంది కార్మికుల తొలగింపు



**న్యూఢిల్లీ :** గ్రామీణ ప్రజల కడుపు నింపే ఉపాధి హామీ పథకానికి (ఎంజిఎన్ఆర్ఇజిఎస్) కేంద్రం తూట్లు పొడుస్తున్నది. పథకం నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులను తొలగిస్తున్నది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్య ఆరు నెలల్లోనే 84.8 లక్షల మంది కార్మికులను ఈ పథకం నుంచి తొలగించారని లిబ్‌టెక్ అనే సంస్థ పేర్కొన్నది. ఉపాధి హామీ పథకం తీరుతెన్నులను ఈ సంస్థ ఎప్పటికప్పుడు విశ్లేషిస్తున్నది. గత ఆరు నెలల కాలంలో కొత్తగా 45.4 లక్షల మంది కార్మికులు చేరారని, అంటే మొత్తం కార్మికుల సంఖ్య 39.3 లక్షలు తగ్గిందని ఈ సంస్థ పేర్కొన్నది. ఎక్కువ మందిని తొలగించిన రాష్ట్రాల్లో మొదట తమిళనాడు(14.7 శాతం), ఆ తర్వాత ఛత్తీస్‌గఢ్ (14.6 శాతం) ఉన్నాయి. కార్మికులను తొలగించడం కొన్నేండ్లుగా కొనసాగుతున్నదని, 2022–23, 2023–24 ఆర్థిక సంవత్సరాల్లో మొత్తం 8 కోట్ల మంది కార్మికులను తొలగించినట్టు లిబ్‌టెక్ పేర్కొన్నది. ఉపాధి హామీ పథకంలో వ్యక్తిగత పని దినాలు తగ్గుతున్నాయని ఈ సంస్థ పేర్కొన్నది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది దాదాపు 16.6 శాతం వ్యక్తిగత పని దినాలు(ఒక్క ఆర్థిక సంవత్సరంలో ఒక కార్మికుడు పని చేసే రోజులు) తగ్గనున్నట్టు తెలిపింది. కాగా, ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థ(ఎబిపిఎస్)ను తప్పనిసరి చేయడం కార్మికులకు ఇబ్బందిగా మారింది. ఇందుకోసం కార్మికుల జాబ్ కార్డుకు ఆధార్ లింక్ అవ్వాలి. ఆధార్, జాబ్ కార్డుపై పేరు సరిగ్గా పొంతన కుదరాలి. బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ లింక్ కావడంతో పాటు, ఎన్‌పిసిఐలో నమోదు కావాలి. వీటిల్లో ఏది లేకపోయినా కార్మికులు ఎబిపిఎస్‌కు అనర్హులుగా మారుతున్నారని, మొత్తం కార్మికుల్లో 27.4 శాతం మంది అనర్హులుగా ఉన్నట్టు లిబ్‌టెక్ తెలిపింది.

**క్రమానుగతంగా గొంతు నులిపే యత్నం :జైరామ్ రమేశ్**

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మోదీ ప్రభుత్వం క్రమానుగతంగా గొంతు నులిపే ప్రయత్నం చేస్తుందని కాంగ్రెస్ ప్రధాని కార్యదర్శి జైరామ్ రమేశ్ విమర్శించారు. కోట్లాది భారతీయ పేదలకు జీనరేఖగా ఉండే పథకానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. నరేగా పథకానికి ఆధార్ ఆధారిత చెల్లింపు విధానాన్ని(ఎబిపిఎస్) అమలు చేయాలని 2024 జనవరిలో గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ జాతీయ స్థాయిలో ఆదేశాలు జారీ చేసిందని ఆయన తెలిపారు. ఎబిపిఎస్‌కు అర్హత పొందాలంటే కార్మికులు అనేక షరతులను అధిగమించాలని, అందులో ఆధార్ జాబ్ కార్డులో , జాబ్ కార్డులో పేర్లను మ్యాచ్ చేయాలని, ఆధార్ సీడెడ్ బ్యాంక్ ఖాతాను జాతీయ చెల్లింపుల కార్పొరేషన్‌కు అనుసంధానం చేయాలని చెప్పారు. దాని ఫలితం పది నెలలైనా సమాచారం లేదన్నారు. ఇందులో కేవలం 27.4 శాతం రిజిస్టర్డ్ వర్కర్‌లు మాత్రమే నమోదైనట్లు, 4.2 శాతం క్రియాశీల కార్మికులు ఎబిఇఎస్‌కు అనర్హులైనట్లు తెలిపారు. అన్నిటకి మించి ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 84.8 లక్షల శ్రామికుల పేర్లు తొలగించారని , ఇది ఎబిపిఎస్ అనుసంధానం అనే షరతు తరువాతనే జరిగిందన్నారు.తక్షణమే ఎబిపిఎస్ అనుసంధాన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని జైరామ్ రమేశ్ డిమాండ్ చేశారు.

# పాప్‌కార్న్

## తాగుబోతు కీటకాలు!



మనుషుల్లోనేకాదు... క్రిమికీటకాల్లోనూ ఆల్కహాల్ అలవాటు ఉంటుందా? ఉంటుందనే అంటున్నారు శాస్త్రవేత్తలు. ఇటీవలి అధ్యయనం ప్రకారం, తరచు ఆల్కహాల్‌ను హారంగా తీసుకునే హార్నెట్ జాతి కీటకాలు, కొంత మొత్తాన్ని దాచుకుంటాయికూడా. ఆ ఆల్కహాల్ పరిణామం సదరు కీటకాలపై ఎలాంటి దుష్ప్రభావాలను చూపదు. అయితే, ఇది ఇతర కీటకాలు, జంతువులు తట్టుకోలేని



మోతాదు. హార్నెట్స్ అనేవి సాధారణ కందిరీగల జాతి. ఇవి పెద్దపెద్ద ఇళ్లు లేదా భారీ నిర్మాణాలతో కూడిన ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటాయి. ఆసియా, ఐరోపా, ఆఫ్రికాలో అత్యధికంగా 20 జాతు లు ఉన్నాయి. ఒక జాతి ఉత్తర అమెరికాకు తరలి వెళ్లిందని అంటారు. వెస్పిడే హార్నెట్స్‌ను కీటకాల కుటుంబానికి చెందినవిగా పేర్కొంటారు. ఈ కుటుంబంలో వివిధ రకాల హార్నెట్స్ ఉంటాయి. పసుపు రంగుతో కూడిన కందిరీగలు, పేపర్ కందిరీగలు, కుమ్మరి కందిరీగలు, పుప్పొడి కందిరీగలు ఈ కుటుంబంలోని కొన్ని ఉపజాతులు. ఇవి సాధారణంగా పసుపు, నలుపు లేదా గోధుమ రంగులో ఉంటాయి. రంగురంగుల హార్నెట్స్ కూడా ఉంటాయిగానీ అరుదు. ఇతర కీటకాలతో పోలిస్తే హార్నెట్స్ ప్రమాదకరమైనవి. ఎక్కువ విషాన్నా విడుదల చేస్తాయి. 'వి' మాండరినియాగా పేర్కొనే ఆసియా జెయింట్ హార్నెట్ అనేది ప్రపంచంలోనే అతిపెద్ద కందిరీగ జాతి. సాధారణంగా ఇవి ఎత్తయిన ప్రదేశాల్లో గూళ్లు నిర్మించుకోవడానికి ఇష్టపడతాయి. చక్కెర, ప్రొటీన్లతో కూడిన ఆహారాన్ని తీసుకుంటాయి. ఇతర కీటకాలను వేటాడతాయి. ఆల్కహాల్ ఈ హార్నెట్స్‌పై ఎక్కువ ప్రభావాన్ని చూపలేవు. మిగతా ఏ కీటకాలు లేదా జీవుల్లో లేని విధంగా హార్నెట్స్ ఆల్కహాల్‌ను శరీరంలో నిల్వ చేసుకోగలుగుతాయి. అంత పరిమాణంలో ఆల్కహాల్ మరే ఇతర కీటకంలో ఉన్నా అది బతకడం అసాధ్యం. కానీ, హార్నెట్స్ ఇందుకు విరుద్ధం. ఆల్కహాల్‌ను ఇవి ఎలాంటి సమస్య లేకుండా భారీ స్థాయిలో నిల్వ చేసుకుంటాయి.

## పెట్రాలో రహస్య సమాధి

పురావస్తు శాస్త్రవేత్తలు జోర్డాన్‌లోని పెట్రాలో తాజాగా ఒక రహస్య సమాధిని కనుగొన్నారు, అందులో సుమారు 2000 సంవత్సరాల నాటి అస్థిపంజరాలు, మతపరమైన కార్యకలాపాలకు ఉపయోగించే 'హోలీ గ్రెయిల్'ను పోలి ఉండే ఒక పాత్రను వెలికితీశారు. జోర్డాన్ దక్షిణ ప్రాంతంలో ఉన్న పెట్రా ఒక చారిత్రక, పురావస్తు నగరం. ఇది హెలెనిస్టిక్, రోమన కాలంలో అరబ్ రాజ్యానికి కేంద్రంగా ఉండేది. పెట్రా నగర నిర్మాణానికి క్రీస్తుశకం 312లో పనులు మొదలుపెట్టినట్టు అందుబాటులో ఉన్న చారిత్రక ఆధారాలను బట్టి గుర్తించారు. బైబుల్‌లో ప్రస్తావించిన అరబ్ తెగ 'నాబాటియన్స్' కాలంలో పెట్రా వారి రాజధానిగా ఉండేది. సబాటియన్ పాలనలలో, చైనా, ఈజిప్టు, గ్రీస్, భారత్ తదితర ప్రాంతాలతో సుగంధ ద్రవ్యాల వ్యాపారానికి కేంద్రంగా కొనసాగింది. దీనిని క్రీస్తు శకం





106లో రోమన్లు స్వాధీనం చేసుకొని, తమ సామ్రాజ్యంలో భాగంగా మార్చేశారు. క్రీస్తుశకం రెండు, మూడు శతాబ్దాల్లో పెట్రా అభివృద్ధి చెందింది. ఏడవ శతాబ్దంలో అరబ్బులు పెట్రాను తిరిగి ఆక్రమించుకున్నారు.12వ శతాబ్దంలో పెట్రాపై ఆధిపత్యంకోసం ఎన్నో యుద్ధాలు జరిగాయి. ఆ కారంగానే పెట్రా నగరం ధ్వంసమై, కాలగర్భంలో కలిసిపోయింది. 1812లో స్విస్ అన్వేషకుడు జోహన్ లుడ్విగ్ బెర్న్‌డమ్ ఈ నగరం ఉనికిని కనుగొన్న తర్వాత, పురావస్తు తవ్వకాలు జరిగాయి. పెట్రా వారసత్వ సంపద బయటపడింది. పెట్రా అనే పదానికి గ్రీకులో 'శిల' అని అర్థం. పర్వత శిఖరాలపై ఈ నగరాన్ని రిన్మించారు. తూర్పు నుంచి పడమర వరకూ మూసా (మోసెస్ లోయ) ఉంది. ఎరుపు, ఊదా, లేత పసుపు రంగులో ఉండే ఇసుకరాయి శిఖరాలు ఈ ప్రాంతంలో అధికం. పెట్రాలో సుమారు 800 సమాధాలు ఉన్నయి. వీటిని రాచకుటుంబానికి చెందిన సమాధులు (రాయల్ టూంబ్స్) అని పిలుస్తారు. వీటిలో 'ది ట్రెజరీ' ఎంతో ప్రఖ్యాతి చెందింది. పెట్రా నగరంలో రాతితో చెక్కిన ట్యామ్‌లు, నీటి కాలువలు, సిరామిక్ పైపులుసహా విస్తృతమైన నీటి వనరుల వ్యవస్థ ఉంది. పెట్రాలో భవనాలను నిర్మించడానికి ఉపయోగించిన రాళ్ల కారణంగా దీనిని 'రోజ్ సిటీ' అని పిలుస్తారు. 1985లో పెట్రాను ప్రపంచ వారసత్వ ప్రదేశంగా ఐక్యరాజ్యసమితి విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ (యునెస్కో) ప్రకటించింది. ఈ విధంగా గుర్తించిన ప్రాంతాల పరిరక్షణ, పర్యవేక్షణ బాధ్యతలను యునెస్కో స్వీకరిస్తుంది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల సాంస్కృతిక, చారిత్రక, శాస్త్రీయ లేదా ఇతరత్రా ప్రాముఖ్యత గలిగిన ప్రాంతాలను యునెస్కో వారసత్వ సంపదగా గుర్తిస్తుంది.

## వాతావరణ అధ్యయనంలో క్లౌడ్ ఫిజిక్స్ కీలక పాత్ర



వాతావరణంలో విపరీతమైన మార్పులను గమనిస్తున్నాం. ప్రకృతి ఎప్పుడు, ఏ రీతిలో విరుచుకుపడుతుందో, ఎలాంటి విధ్వంసం సృష్టిస్తుందో చెప్పలేని పరిస్థితి. గతంలో ఎన్నడూ లేనంతగా ఉష్ణోగ్రతలు ఈ ఏడాది నమోదయ్యాయి. తుఫాన్ల సంఖ్య పెరిగింది. భారీ వర్షాలు.. వరదలకు కొదువే లేదు. కొన్ని ప్రాంతాల్లో ఆకస్మిక వరదలతో ఊళ్లకు ఊళ్లే కొట్టుకుపోయాయి. ఎప్పటికప్పుడు వాతావరణ హెచ్చరికలు లేకపోతే, భారీగా ఆస్తి, ప్రాణ నష్టాలు తప్పవు. నిరంతరం వాతావరణాన్ని అధ్యయనం చేసి, క్రమం తప్పకుండా సమాచారాన్ని అందించడంలో వాతావరణ శాఖ ముందుంటుంది. అధిక ఉష్ణోగ్రతలతో పోలిస్తే, భారీ వర్షాలు, తత్ఫలితంగా ఉద్భవించే వరదల కారణంగానే నష్టం విపరీతంగా ఉంటుంది. ఈ కోణంలోనే మెరుగైన సమాచారం కోసం ప్రయోగాలు, ప్రయత్నాలు ఎంతోకాలంగా జరుగుతునే ఉన్నాయి. వాతావరణ పరిస్థితులను లోతుగా అధ్యయనం చేయడంలో క్లౌడ్ ఫిజిక్స్ కీలక పాత్ర పోషిస్తున్నది. ఈ రంగంలో అన్ని భాగస్వామ్య అంశాలను క్రోడీకరించి, వాతావరణ వివరాలను వెల్లడించడానికి వీలుగా భారత్ మొదలుపెట్టిన 'మిషన్ మౌసం' కూడా ఈ క్లౌడ్ ఫిజిక్స్ ఆధారంగానే సమాచారాన్ని సేకరించి, విశ్లేషిస్తుంది. వివిధ పరిస్థితుల్లో మేఘాలు ఏ విధంగా ప్రవర్తిస్తాయో అధ్యయనం చేయడాన్ని క్లౌడ్ ఫిజిక్స్‌గా పేర్కొంటారు. వాతావరణ నమూనాలను అర్థం చేసుకోవడంలో, మార్చడంలో క్లౌడ్ ఫిజిక్స్ సహాయపడుతుంది. పుణేలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ (ఐఐటిఎం)లో ఒక ప్రత్యేక విభాగం పని చేస్తున్నది. నియంత్రిత పరిస్థితుల్లో మేఘాలు ఎలా ఏర్పడతాయో 'మిషన్ మౌసం' ప్రాజెక్టులో అధ్యయనం చేస్తారు. ఈ పరిశోధనలు, అధ్యయనాలకు క్లౌడ్ చాంబర్‌ను ఉపయోగిస్తారు. క్లౌడ్ చాంబర్ అనేది మూసి ఉన్న ఓ స్థూపాకార లేదా గొట్టపు నిర్మాణం. దీని లోపలకు నీటి ఆవిరి, ఏరోసోల్స్‌ను పంపుతారు. నిర్దిష్ట తేమ, ఉష్ణోగ్రతల కింద మేఘాలు అభివృద్ధి చెందుతాయి. మేఘ బిందువులు, మంచు కణాలను శాస్త్రవేత్తలు సూక్ష్మంగా అధ్యయనం చేయడానికి అవకాశం ఉంటుంది. చాలా దేశాల్లో కనిపించే ప్రాథమిక క్లౌడ్ ఛాంబర్ల మాదిరి కాకుండా, పుణెలో ఉష్ణప్రసరం లక్షణాలున్న ఛాంబర్ ఉంది. ఇది భారత దేశంలో రుతుపవనాల మేఖాలను అధ్యయనం చేయడానికి అవువుగా ఉంటుంది. సాధారణ, తీవ్రమైన పరిస్థితులలో క్లౌడ్ ప్రవర్తనను అర్థం చేసుకోవడం క్లౌడ్ ఛాంబర్ ప్రాథమిక లక్ష్యం. వర్షపు తుంపరలు, మంచు కణాలు ఎలా ఏర్పడుతున్నాయో తెలుసుకోవడం ద్వారా, తుపానుల నుంచి వచ్చే తేమ వాతావరణాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తుందో అంచనా వేస్తారు. ఈ అధ్యయనం ద్వారా సేకరించిన సమాచారం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

## రక్తాన్ని పీల్చే కీటకం 'సెట్సే'



మనుషులు, జంతువుల రక్తాన్ని పీల్చే కీటకం 'సెట్సే' కీటకం 34 ఆఫ్రికన్ దేశాల్లో ఉన్నాయి. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలోని ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎఒ) తాజా నివేదికను అనుసరించి ఇది (గ్లాసినా జాతికి చెందిన, హోలోమెటబొలాస్ కీటకం. పర్యావరణ పరంగా వీటిని మూడు గ్రూపులుగా విభజించారు. పుస్కా లేదా ఫారెస్ట్ గ్రూప్ (ఉపజాతి ఆస్టెనినా),మోర్సిటాన్స్ లేదా యి: పుస్కా, లేదా ఫారెస్ట్ , గ్రూప్ (ఉపజాతి ఆస్టెనినా); మోర్సిటాన్స్, లేదా సవన్నా, సమూహం (ఉపజాతి గ్లోసినా), పాల్పాలిస్ లేదా నది, సమూహం (ఉపజాతి నెమోర్హినా). నదుల ఒడ్డున దట్టమైన వృక్ష సంపదన ఉన్న ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా కనిపిస్తాయి. శుష్క భూభాగంలోని సరస్సులు, తడి అధికంగా ఉండే దట్టమైన అడవుల్లోనూ అధికంగా పెరుగుతాయి. ఇవి పూర్తిగా పరాన్నజీవులు. రక్తాన్ని తాగుతాయి. ట్రిపనోసోమా పరాన్న జీవులను వ్యాప్తిచేస్తాయి. మనుషుల్లో నిద్రలేమికి ఇవి ప్రధాన కారణమవుతాయి. అదే విధంగా జంతువుల్లో వ్యాధులను వ్యాప్తి చేస్తాయి. వీటి బెడదవల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పశు సంపద తరచు అనారోగ్యబారిన పడడమే ఇందుకు ప్రధాన కారణం. వీటి నియంత్రణకు ఆఫ్రికన్ దేశాలు చేస్తున్న ప్రయత్నాలు ఆశించిన స్థాయిలో ఫలితాలను ఇవ్వడం లేదు.

**బిఎస్ఎస్ మైత్రేయి**

# అతివలు అదృష్టవంతులు!

ప్రజాపక్షం
27-10-2024, ఆదివారం

మహిళలు దేశ జనాభాలో సగం. ఓటర్లలో సగానికన్నా ఇంతోఅంతో హెచ్చు. కాని ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల్లో అత్యధికులు పురుషులే. విజేతల్లో మహిళలు 8–10 శాతం ఉంటారు. పేదలు, స్త్రీలు, బాలల అభ్యున్నతికి కంకణం కట్టుకున్నామని వాగ్దానం చేయని పాలకపార్టీ లేదు. కాని చట్టసభల సీట్లలో కనీసం 33శాతం తమకివ్వమని మహిళాలోకం పాతికేళ్లకు పైబడి పోరాటాలు చేస్తోంది. పురుషాధిక్య సామాజిక, రాజకీయ వ్యవస్థ అటువంటి బిల్లుకు అడ్డుపడుతూనే ఉంది. పురుషాధిక్య సనాతన వ్యవస్థ రక్షణ కు కంకణం కట్టుకున్న బిజెపి కేంద్రప్రభుత్వ ప్రధానమంత్రి నరేంద్రమోదీజీ మొన్నటి లోక్‌సభ ఎన్నికలకు ముందు మహిళల ఓట్ల కోసం అతి తెలివి ప్రదర్శించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంటు ఆమోదం పొందారు. అయితే అది మరో ఐదు–పదేళ్ల తర్వాతగాని అమలులోకి రాని చిక్కుముడులు తొలగించలేదు. 2021లో జరగాల్సిన జనాభా లెక్కల సేకరణ (సెన్సెస్) కొవిడ్ కారణంతో చేపట్టలేదు. దాని ప్రభావం పోయి రెండేళ్లయినా సెన్సెస్‌ను ఆదేశించలేదు. సెన్సెస్ పూర్తయి, వాటి ప్రాతిపదికపై నియోజకవర్గాల పునర్విభజన ఖరారు అయినాక జరిగే ఎన్నికలకుగాని మహిళా రిజర్వేషన్ చట్టం అమలులో కి రాదు. అసలు ఎప్పటికైనా సాధ్యమవుతుందా అనుకునే దానికి చట్టబద్ధత కల్పించినందుకు మోదీని అభినందించాల్సిందే. తీరా అమలు జరిపే సమయం వచ్చేసరికి దానికి ఎన్ని మడతపేచీలు పెడతారో ఊహించలేము.

అందుకని రాజకీయ పార్టీలు ఓ పదేళ్ల నుంచి ఓటర్లకు తాయిలాలు వాగ్దానం చేయటం మొదలుపెట్టారు. ఆసరాలేని వృద్ధులకు వంద–రెండు వందల ఆసరా ఫించన్‌తో ప్రారంభమై ఇప్పటికది ఆయా రాష్ట్రాల్లో రాజకీయ పరిస్థితుల బట్టి రూ.3–4 వేల వరకు చేరింది. ద్రవ్యోల్బణ వ్యవస్థలో అది సబబేనని సరిపెట్టుకోవచ్చు. కాని పిల్లల్ని బడికి పంపిస్తే సాలీనా ఉచిత సహాయం మరో ఎత్తుగడ. 19–59 మధ్య వయస్కులైన స్త్రీలకు నెలవారీ ఉచిత సహాయంతో పార్టీలు వారి ఓట్లకు గాలమేస్తున్నాయి. పనిచేయగల వయస్సులోని వారికి పనిచూపలేని అసమర్థతను పార్టీలు ఈ రూపేణా బయటపెట్టుకుంటున్నాయి. ఎన్నికల్లో జనరల్ ప్రకటన చేస్తారు. తీరా అధికారంలోకి వచ్చిన పార్టీ దాన్ని అమలు చేయటానికి వచ్చేసరికి తెల్లకార్డు వారికే అంటూ కోత పెడుతోంది. ఉచిత గ్యాస్ బండలైనా, కరెంట్ అయినా, ఉచిత బియ్యం గట్రా సరుకులైనా, ఇదే సూత్రం అమలవుతోంది. ఇతర అనేక సంక్షేమ కార్యక్రమాలు కలుపుకుని ఖాళీ ఖజానాలతో దేబరిస్తున్న ప్రభుత్వాలు ఆ హామీలు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పలేక – గత ప్రభుత్వాన్ని దూషిస్తూ సోది ఉపన్యాసాలు చేస్తుంటాయి. భారతప్రభుత్వమే రాజ్యాంగం హామీ ఇచ్చిన సంక్షేమ రాజ్యానికి స్వస్తిచెప్పి పెట్టుబడికి దాసోహమంటుంటే రాజకీయ పార్టీలు వాగ్దానాలతో ప్రజలకు సంక్షేమం చేకూర్చగలవా?ఒకవేళ చేకూర్చినా, పరోక్ష పన్నులు పెంచి సామాన్యులనుండే ఆ సొమ్ము గోళ్లూడగొట్టి వసూలు చేస్తున్నాయి.

స్త్రీల పట్ల రాజకీయ పార్టీలు ఎంత సానుభూతి చూపుతున్నాయో కొన్ని ఉదాహరణలు చూదాం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 'న్యాయపత్ర' పేరుతో విడుదల చేసిన ఎన్నికల ప్రణాళికలో కాంగ్రెస్ 'మహాలక్ష్మి'పథకం ప్రకటించింది. దీనికింది దేశంలోని ప్రతి పేద కుటుంబానికీ ఏటా రూ.1 లక్ష ఉచిత సహాయం. బిజెపి కూడా అనేక ఇతర పథకాలు ప్రకటించింది. తెలంగాణ అసెం బ్లీ ఎన్నికలప్పుడు (2023 డిసెంబర్) కాంగ్రెస్ పార్టీ యువతులకు వివాహ సమయంలో 10 గ్రాముల బంగారం, రూ.1లక్ష నగదు, అర్హులకు ఎలక్ట్రికల్ స్కూటర్ వాగ్దానం చేసింది. 10నెలలు గడిచినా అది వాగ్దానాల జాబితాలోనే ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌డిఎ కూటమి(టిడిపి, జనసేన, బిజెపి) 19–59ఏళ్ల వయోగ్రూపులోని స్త్రీలకు నెలకు రూ.1500 పెన్షన్ ప్రకటించింది. 60 ఏళ్లు వస్తే వృద్ధాప్య పింఛను వస్తుంది కదా! ఇటీవల హర్యానా ఎన్నికల్లో కాంగ్రెస్ 18–60 ఏళ్ల వయోగ్రూపులోని స్త్రీలకు నెలకు రూ.2000 అలవెన్స్ ఇస్తామంటే ఆ మరునాడు ఎన్నికల ప్రణాళిక విడుదల చేసిన బిజెపి రూ.2100 ఇస్తామంది. జమ్మూ–కశ్మీర్ ఎన్నికల్లో బిజెపి, కుటుంబంలోని అతిపెద్ద మహిళకు ఏటా రూ.18 వేలు ఉచిత సహాయం ఇస్తామంది. కాంగ్రెస్ పార్టీ కుటుంబ పెద్దగా ఉన్న మహిళకు నెలకు రూ.3వేలు చొప్పున ఇస్తామంది.

ఇటువంటి ఉచిత పంపిణీలను మిఠాయిలతో పోల్చిన ప్రధానమంత్రి మోదీ, ఏ రాష్ట్రంలో ఎన్నికలొచ్చినా రూ.50–60వేల కోట్ల ప్రాజెక్టులు ప్రకటిస్తుంటారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా మహిళలకు 'ఉచిత' వాగ్దానాలు తప్పవు. అందుకే వారు అదృష్టవంతులు! కాని ఆ పప్పుబెల్లాలతో జీవితాలు మెరుగుపడవు కదా!! పోరాటాలే శరణ్యం.

# చరిత్ర తెలియని అజ్ఞానం – హిందూత్వ అహంకారం

## మదరసాలపై ఎన్‌సిపిసిఆర్ సిఫారసు ముస్లింలను దూరం పెట్టటమే



బినొయ్ విశ్వం, మాజీ ఎంపి
సిపిఐ జాతీయ కార్యదర్శి,
కేరళ రాష్ట్ర కార్యదర్శి

విద్యా హక్కు చట్టం (2009) అమలు చేయడం లేదని, తనిఖీల అనుమతించడం లేదనే నెపాలతో మదరసాలకు ప్రభుత్వ నిధులు ఇవ్వడాన్ని నిలిపివేయాలని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఎన్‌సిపిసిఆర్) చేసిన సిఫార్సులపై, దాని ఆధారంగా కేంద్రం, పలు రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న చర్యలపై సుప్రీం కోర్టు స్టే విధించింది. దీంతో మైనారిటీలకు, లౌకిక భావాలు కలిగిన దేశ పౌరులకు స్వల్ప ఉపశమనం లభించింది. కాని ఆ చర్య కలుగజేసిన భయాందోళన అలాగే ఉంది. ఎన్‌సిపిసిఆర్ చర్య వెనుక సహజంగానే ఎం. ఎస్.గోల్వాల్కర్ రచించిన 'బంచ్ ఆఫ్ థాట్స్' భావజాల మార్గదర్శనం ఉంటుంది. ఆ విచారధార(సిద్ధాంతం) మతపరమైన మైనారిటీలను దేశ శత్రువులుగా ప్రకటించిం ది. లోక్ జన్‌శక్తి పార్టీ (ఎల్‌జెపి) నేత ఎ.కె.బాజ్‌పాయ్ ఈ చర్యను వ్యతిరేకించారంటే, అధికార ఎన్‌డిఎ కూటమి సభ్యులు కూడా దాని వెనుక ప్రమాదాన్ని గుర్తించారని భావించాలి. స్వతంత్ర్య భారతదేశంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్స్ (సిపిసిఆర్) చట్టం, 2005 ఒక అభ్యుదయ శాసనం. ఈ చట్టం ఆధారంగా ఎన్‌సిపిసిఆర్ 2024 అక్టోబర్ 11న రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. భారతదేశంలో చిన్న పిల్లలను వ్యభిచారం, యాచన, చివరకు ముఖ్య అవయవాల విక్రయంకోసం అక్రమ రవాణ చేస్తుంటా రు. చాలామంది ఈ విషయం తమకు తెలియదని చెబుతుంటారు. 1986లోని బాలలు, యుక్తవయసు కార్మిక (నిషేధ, నియంత్ర) చట్టం అవహేళనకు గురవుతుంది. కానీ, ఇవేవి ఎన్‌సిపిసిఆర్‌కు పట్టవు. ప్రపంచవ్యాప్తంగా ఫాసిస్టులు ఇష్టానుసారం నియమ, నిబంధలను దుర్వినియోగం చేస్తూ తమ అంతిమ లక్ష్యాలను సాధించారని చరిత్ర చెబుతోంది.

**భావన, దాని చరిత్ర**

ఇతర మతాలకు చెందిన బాలలను మదరసాల నుంచి గెంటివేయాలని ఎన్‌సిపిసిఆర్ డిమాండ్ చేస్తుంది. 'ఇది స్నానపు నీటితో పాటు పిల్లలను పారవేయటం లాంటిదేనని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఎన్‌సిపిసిఆర్ ప్రకారం వివిధ మత సమూహాలకు చెందిన బాలలు కూడా మదరసాలకు వెళ్తున్నట్లు నిరూపితమైంది. ఇలా ఎందుకు జరిగింది? నిజమైన కేరళ స్టోరీ అనుభవాలు తెలిసిన వారికి ఇది అర్థం కావడం కొంచెం కష్టమే. ఎందుకంటే అందరికీ ప్రభుత్వ విద్యను కల్పించడంలో ఆ రాష్ట్రం విజయవంతమైంది. దేశంలో విద్యాహక్కు చట్టం రాకముందు, అమలులోకి వచ్చిన తరువాత కూడా అనేక చోట్ల ప్రాథమిక విద్య అందరికీ అందుబాటులో లేదు. అనేక రాష్ట్రాలలో మత బోధనలతో పాటు లౌకిక విద్యను సమకూర్చే వ్యవస్థ ఏర్పడింది. ప్రభుత్వాలు వాటికి ఆర్థిక సాయం చేయాల్సిన పరిస్థితి వచ్చిం ది. వాస్తవాలను అర్థం చేసుకోవడంలో ఎన్‌సిపిసిఆర్ విఫలమైంది.

అఫ్ఘానిస్తాన్‌లో 1970లలో వామపక్ష ప్రభుత్వాన్ని కూలదోసేందుకు, అమెరికా ప్రాపకంతో అతివాద ఉగ్రవాదులైన తాలిబాన్‌లు ఏర్పాటు చేసిన శిక్షణా కేంద్రాలకే తరువాతి కాలంలో మదరసాలుగా నామకరణం జరిగింది. ఇదే అమెరికా, దాని మిత్రపక్షాలు ఇస్లామోఫోబియా(ఇస్లాం అంటే భయం) వృత్తాంతాన్ని ముందుకు తీసుకుపోయేందుకు ఉద్దేశ్యపూర్వకంగా వాటిపై ప్రచారం చేస్తున్నాయి. భారతీయ చరిత్ర, సమాజం యొక్క వాస్తవికతల నేపథ్యంలో ఈ భావనే అసంగతమైంది. అరబిక్ పదం 'మదరసా' అంటే పాఠశాల అని అర్థం తప్ప మరేమీ కాదు. బ్రిటీష్ హయాంలో వలసవాద ప్రత్యేక విద్యావిధానాన్ని ప్రవేశపెట్టేంతవరకు మత, లౌకిక పాఠశాలలకు ఆ పేరునే ఉపయోగించేవారు. ఉచిత, సార్వత్రిక విద్యా విధానం లేకపోవడంతో అనేకమంది ముస్లిమేతర పిల్లలు మదరసాలపై ఆధారపడ్డారు. భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవ పితామహుడు రాజా రామ్మోహన్ రాయ్, భారత తొలి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్, రచయిత మున్షీ ప్రేమ్‌చంద్ ఇంకా అనేక మంది ప్రముఖులు మదరసాలు, మౌలీల నుంచే జ్ఞానపు తొలి కిరణాలను అందుకున్నారు. ఈ చారిత్రక వాస్తవాలు హిందూత్వ మతోన్మాదులకు ఆగ్రహం కలిగించవచ్చేమో! భారత చరిత్ర పోటీ, ఘర్షణలతో కూడుకున్నది కాదని, సహజీవనం, సహనంతో కూడినదని రూఢీ అవడం మన కాలంలోని విద్వేషవ్యాప్తికారులకు రుచించకపోవచ్చు. నేటి ద్వేషపూరిత చర్చల్లో లేచి నిలబడి నిజం మాట్లాడడం కష్టమైనప్పటికీ దానిని చెప్పకుండా వదిలేయలేము.

> **అరబిక్ పదం 'మదరసా' అంటే పాఠశాల అని అర్థం తప్ప మరేమీ కాదు. బ్రిటీష్ హయాంలో వలసవాద ప్రత్యేక విద్యావిధానా న్ని ప్రవేశపెట్టేంత వరకు మత, లౌకిక పాఠశాలలకు ఆ పేరునే ఉపయోగించేవారు. భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవ పితామహుడు రాజా రామ్మోహన్ రాయ్, భారత తొలి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్, రచయిత మున్షీ ప్రేమ్‌చంద్, ఇంకా అనేక మంది ప్రముఖులు మదరసాలు, మౌలీల నుంచే జ్ఞానపు తొలి కిరణాలను అందుకున్నారు. ఈ చారిత్రక వాస్తవాలు హిందూత్వ మతోన్మాదులకు ఆగ్రహం కలిగించవచ్చేమో!**

ఢిల్లీ సుల్తానేట్‌ల కాలం నుంచి మదరసా విధానం కొనసాగుతోంది. దీనిని బానిస వంశాలు, ఖిల్జీ, తుగ్లక్ రాచరికాలు పోషించాయి. మొరాకో దేశ యాత్రికుడు ఇబ్న్ బటూటా తన యాత్రల చరిత్రలో మహమ్మద్ బిన్ తుగ్లక్ వారసుడు ఫిరోజ్‌షా తుగ్లక్ (1309–1388)హయాంలో మహిళలకు విద్య, బానిసలకు కళలు, విజ్ఞాన శాస్త్రం, హస్తకళలు నేర్పేందుకు మదరసాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. తరువాత కాలంలో భారతదేశంలోని పలు ప్రాంతాలలో, ప్రత్యేకించి కేరళలో క్రైస్తవ ఆధిపత్య ప్రాంతాలలో చర్చిల పక్కనే ఏర్పాటు చేసిన పాఠశాలల్లో కేవలం ఆ మతస్తుల పిల్లలకే కాకుండా, ఎవరు కావాలన్నా విద్యను నేర్పించేవారు. ఎవరి వద్ద నుండైనా లేదా ఇతర మతస్తుల నుంచైనా విద్యను నేర్చుకోవడం సిగ్గుగా భావించే వారు కాదు.

**సామాజిక న్యాయమనేది బుజ్జగింపు కాదు**

తప్పుడు, బూటకపు వార్తల ద్వారా ఇటీవల సంవత్సరాలలో కేరళ విషపు దాడులకు లక్ష్యంగా మారింది. ద్వేషాన్ని, అపనమ్మకాన్ని వివిధ కోణాల నుంచి వ్యాప్తి చేస్తున్నారు. సమాజంలోని అన్ని వర్గాలతో, మతాలతో మైత్రి, సంఘీభావంతో ఉండడమే తప్పుగా ప్రచారం జరుగుతోంది. మదరసాల నిర్వహణ ఇందుకు మినహాయింపు కాదు. వాస్తవమేమిటి? ప్రాథమిక స్థాయిలో ఉత్తమ విద్యా విధానం కలిగిన కేరళ రాష్ట్రంలో మదరసాలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం అవసరం లేదు. మదరసాలకు కేరళ ప్రభుత్వం భారీ మొత్తంలో నిధులు ఇస్తున్నట్లు చేస్తున్న తప్పుడు ప్రచారం పట్టి అవాస్తవం. అయితే, ఇతర కేటగిరిల ఉద్యోగులకు మాదిరిగానే మదరసా ఉపాధ్యాయులు పెన్షన్, ఇతర ప్రయోజనాలకు ఆర్థిక మూలంగా ఉన్న మదరసా ఉపాధ్యాయుల సంక్షేమ నిధి చట్టబద్ధంగా ఏర్పాటైంది. ఇది సామాజిక న్యాయం విధానం ఆధారంగానే తప్ప మతపరమైన బుజ్జగింపు కోణంలో ఏర్పాటు చేయలేదు.

మత స్వేచ్ఛ రాజ్యాంగపరమైనది. ప్రతి భారతీయ పౌరుడు తను ఎంచుకున్న మతాన్ని అనుసరించే, ప్రచారం చేసుకునే స్వేచ్ఛకు 25వ అధికరణ హామీ ఇస్తుంది. చట్ట వ్యతిరేకమైన, దేశ భద్రతకు హానికరమైన చర్యలను నిరోధించేందుకు ప్రభుత్వానికి అధికారం ఉంది. మతపాఠశాలలైనా లేదా లౌకిక పాఠశాలలైనా చట్టపరమైన మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహింపబడాల్సిందే. కానీ, ఎన్‌సిపిసిఆర్ తన చర్య ద్వారా మతపరమైన మైనారిటీలను వేరు చేసేందుకు ఆజ్యం పోయడం బాలల హక్కుల చట్టానికి లేదా దేశానికి న్యాయం చేయదు.

**అధికసంఖ్యాకవాదం దూకుడు**

మనలాంటి దేశంలో భావి తరాలకు లౌకిక విలువలను పాదుకొల్పడం అత్యంత ముఖ్యమైనది. 'భిన్నత్వంలో ఏకత్వం' భావన మీదనే భారతదేశం ఉనికి, వృద్ధి ఆధారపడి ఉంది. మన గొప్ప దేశం బహుళత్వ సారాన్ని మత గురువులు, అన్ని మతాల ప్రజలు అర్థం చేసుకుంటారు. మతాలతో సంబంధం లేకుండా అన్ని ఆలోచనా ధారలలోని గొప్ప నాయకుల బోధనల ద్వారా వాటిని నేర్పించవచ్చు. ఈ నేపథ్యంలో శ్రీ నారాయణ గురు మాటలు గుర్తు చేసుకోదగినవి : 'సర్వమత సవుం ఏకం' (అన్ని మతాల సారం ఒక్కటే).

కానీ, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు మతపరమైన మైనారిటీలు అభద్రతతో రోజులు గడుపుతున్నారనే వాస్తవాన్ని చూడకుండా ఉండేందుకు ఎన్‌సిపిసిఆర్ తన కళ్ళు గట్టిగా మూసుకోవడం దురదృష్టకరం. అధికసంఖ్యాకవాదం దూకుడుతో ఉన్న దుష్ట శక్తులు వారిని తమ ద్వేషపు మాటలు, చర్యలతో భయపెడుతున్నారు. ఈ సామాజిక రాజకీయ నేపథ్యంలోనే ఎన్‌సిపిసిఆర్ చర్యను మనం చూడవచ్చు. ఇది బిజెపి 'ఇతరులు'గా వ్యవహరిస్తున్న కోట్లాది భారతీయులకు పుండు మీద కారం చల్లినట్లుగా ఉంటుంది. చట్టబద్ధమైన కమిషన్ సమాజంలో విభజన విత్తనాలను నాటుతుందని, మైనారిటీలను వేరు చేసే ఆలోచన విధానంతో వ్యవహరిస్తుందని ఊహించలేదు. అందుకే భారత ప్రజలు రాజ్యాంగ విలువలను పరిరక్షిస్తూ, ఎన్‌సిపిసిఆర్ తాజా చర్యను ఉపసంహరించుకోవాలని కోరాలి.

# దక్షిణాదికి దండన తప్పదా?

**రాజధాని సందడి**

– బొమ్మగాని కిరణ్‌కుమార్

హైదరాబాద్ నగరంలో శుక్రవారం ఎబిపి టెలివిజన్ నెట్‌వర్క్ నిర్వహించిన సదరన్ రైజింగ్ సమ్మిట్ ఒక ఆసక్తికర అంశాన్ని మరోసారి రాజకీయ యవనికపైకి తీసుకువచ్చింది. సమ్మిట్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రసంగం చేస్తూ 2026 తదుపరి లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన సందర్భంగా ఉత్తరాది రాష్ట్రాలతో సమానంగా దక్షిణ భారతదేశ రాష్ట్రాల స్థానాలను పెంచాలని ప్రతిపాదించారు.మోదీ ప్రభుత్వం వినకుంటే తానే దక్షిణాదికి పన్నుల పంపిణీ, ప్రాజెక్టులతో పాటు ముఖ్యంగా లోక్‌సభ పునర్విభజనలో జరిగే అన్యాయంపై బలమైన ఉద్యమానికి దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడగట్టి ఒక వేదికపై తీసుకువస్తానని ప్రకటించారు. కర్నాటక సిఎం సిద్ధరామయ్యను ఆ పని చేయాలని కోరినప్పటికీ, ఆయన రాజకీయ కక్ష సాధింపులను ఎదుర్కొంటుండటంతో తానే ఆ పని భుజాన వేసుకోనున్నట్లు తెలిపారు. గత కొద్ది సంవత్సరాలుగా లోక్‌సభ స్థానాల పునర్విభజనలో దక్షిణ భారతరాష్ట్రాలకు నష్టం జరుగుతుందనే చర్చ జరుగుతుంది. కుటుంబనియంత్రణను విజయవంతంగా పాటించినందుకే ఈ రాష్ట్రాలు నష్టపోతున్నాయి. అందుకే ఒక్కో జంట 16 మంది పిల్లలను కనాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ఇటీవల నూతన తమిళ వధూవరుల సామూహిక వివాహ కార్యక్రమంలో ఆశీర్వదించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా మహిళలకు ఇద్దరికంటే ఎక్కువ మందిని కనాలని, స్థానిక సంస్థల్లో ఇద్దరికంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటేనే పోటీకి అవకాశం కల్పించేలా చట్టం తీసుకువస్తామని అధిక సంతానాన్ని ప్రోత్సహిస్తూ మాట్లాడారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో అసలు సమస్య ఏమిటి?

**జనాభా లెక్కలతోనే తంటా**

దశాబ్దానికి ఒకసారి జనాభా లెక్కల సేకరణ తరువాత నియోజకవర్గాల పునర్విభజన అనేది రాజ్యాంగ ఆదేశం. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు నాలుగు సార్లు ఆ ప్రక్రియ జరిగింది. 1952,1963, 1973లో వరుసగా జరిగాయి. ఎమర్జెన్సీ కారణంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టకుండా 1976లో లోక్‌సభ స్థానాలను 25 ఏళ్ల వరకు పెంచకుండా రాజ్యాంగ సవరణ చేశారు. పాతికేళ్లు దాటిన తరువాత ఆ పనిని 2001లో ప్రధాని వాజ్‌పేయి నెత్తికెత్తుకున్నారు. అయితే ఆయన నియోజకవర్గాల సంఖ్య పెంపు జోలికి వెళ్లకుండా , అప్పటికే ఉన్న 543 లోక్‌సభ స్థానాలనే కొనసాగిస్తూ 2002లో పునర్విభజన చేశారు. దానికి అనుగణంగా 2009 సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. వాజ్‌పేయి అదే సమయంలో నియోజకవర్గాల సంఖ్యను పెంచకుండా మరో 25 ఏళ్ళు వాయిదా వేస్తూ 84వ రాజ్యాంగ సవరణ తీసుకువచ్చారు. అంటే 2026 తరువాత చేపట్టే దశాబ్ది జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని అందులో ఉంది. గత లోక్‌సభ చివరి సెషన్‌లో 2024 లోక్‌సభ ఎన్నికలు పూర్తవగానే జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ చేపడతామని నాటి, నేటి కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. అంటే కొవిడ్ కారణంగా 2001లో జరగాల్సిన జనాభా లెక్కల ప్రక్రియ వాయిదా పడుతూ వస్తుంది. దానిని త్వరలోనే చేపడతామని ఇటీవల అమిత్ షా మరోసారి ఉద్ఘాటించారు. కానీ, ఇక్కడ ఒక చిక్కు ఉంది. 2026లో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేయాల్సి ఉంది. అదే సమయంలో 2026 తరువాత జనాభా లెక్కల ఆధారంగా, ఆ పని చేపట్టాలని 84వ రాజ్యాంగ సవరణ చెబుతోంది. ఇదే విషయాన్ని ఇటీవల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనిని ఎలా పరిష్కరిస్తారని ఆయన నిలదీశారు. పనిలో పనిగా జనాభా లెక్కల ప్రకారం దక్షిణ రాష్ట్రాలు లోక్‌సభ స్థానాలు కోల్పోతాయనే ఆందోళనపై కూడా సమాధానాన్ని కేంద్రం నుంచి ఆయన కోరారు.

**బిహార్, యుపిలకే లాభం**

జనాభా ఆధారంగా, ఇప్పుడు ఉన్న సంఖ్యలోనే లోక్‌సభ స్థానాల పునర్విభజన జరిగితే దక్షిణ భారత రాష్ట్రాలకు అన్యాయం జరగడం ఖాయం. 2019లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం తమిళనాడు, కర్నాటక ఎనిమిది చొప్పున, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు కలిపి ఎనిమిది లోక్‌సభ స్థానాలను కోల్పోతాయి. అంటే దక్షిణ భారతదేశంలో సుమారు 129 లోక్‌సభ స్థానాలలో పాతిక గల్లంతవుతాయి. అవే లెక్కల ప్రాతిపదికన దక్షిణాది 100 లోక్‌సభ సీట్లకు కాస్త అటుఇటుగా కుదించబడుతుంది. అవి నేరుగా ఉత్తరాది రాష్ట్రాల ఖాతాల్లోకి వెళ్ళిపోతాయి. ఇప్పటికే 80 స్థానాలు ఉన్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో మరో 11 లోక్‌సభ స్థానాలు చేరి ఆ సంఖ్య 91కి పెరుగుతుంది. అలాగే 40 స్థానాలు కలిగిన బిహార్ రాష్ట్రంలో అదనంగా 10 స్థానాలు పెరిగి, మొత్తం 50 అవుతాయి. అంటే కేవలం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో స్థానాలే దగ్గర దగ్గరగా దక్షిణాదిలోని ఆరు రాష్ట్రాలకు ఉన్న సీట్ల సంఖ్యతో సమానంగా ఉంటాయి.

బిహార్ అందులో సగం సీట్లు కలిగి ఉంటుంది. ఇలా జరిగితే ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది రాష్ట్రాల పాత్ర, పార్లమెంటులో గొంతు వినిపించే అవకాశం సన్నగిల్లిపోతుందనేది నిర్వివాదాంశం. ఇది సమాఖ్య స్ఫూర్తికి కచ్చితంగా విఘాతం కలిగించే చర్యే. ఇప్పటికే ఆర్థిక క్రమశిక్షణతో తమ వంతు నిధులను వెనుకబడిన ఉత్తరాది రాష్ట్రాలకు కోల్పోతున్న దక్షిణాది రాష్ట్రాలకు రాజకీయ ప్రాతినిధ్యం కూడా సన్నగిల్లే ప్రమాదఘంటిక లు మోగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినట్లుగా బిజెపి, మోదీ తనను ఆదరించిన దక్షిణాది రాష్ట్రాలను లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో దండిస్తారా? విజ్ఞతతో సమాఖ్యస్ఫూర్తితో వ్యవహరిస్తారా? అనేది కొద్ది మాసాల్లోనే స్పష్టం కానుంది.

## రక్తదానంతో ప్రాణదాతలు కండి

### రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన సిపి



**ప్రజాపక్షం/ ఖమ్మంఅర్బన్ :** రక్తదానంతో ఆపదలో ఉన్న వారికి ప్రాణ దాతలవుదామని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల (ఫ్లాగ్ డే) సందర్భంగా సిటీ ఆర్మ్డ్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శనివారం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ సకాలంలో రక్తం అందించలేక ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని, రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చునన్నారు. అమరవీర జవాన్లను స్మరించుకుంటూ అక్టోబరు 21 నుండి అక్టోబరు 31 వరకు పోలీస్ ఫ్లాగ్ డే నిర్వహిస్తున్నామని సిపి తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు, ఆన్‌లైన్ ఓపెన్ హౌజ్ ర్యాలీలు, అమరవీరుల కుటుంబాల సభ్యుల సమస్యలు, సందేహాలు తెలుసుకోవడం మొదలగున్నవి నిర్వహిస్తున్నామన్నారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో అడిష నల్ డిసిపిలు నరేష్‌కుమార్, ప్రసాదరావు, కుమారస్వామి, ఏసిపిలు రమణమూర్తి, శ్రీనివాసులు, మల్లయ్య, నర్సయ్య, సిఐలు రమేష్, ఉదయ్‌కుమార్, బాలకృష్ణ, మోహన్ బాబు, ఆర్‌ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్, సాంబశివరావు, డా॥ జితేందర్, సంకల్ప స్వచ్ఛంద సంస్థ, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

### ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి




**ప్రజాపక్షం/తల్లాడ :** 2025 మార్చి నెలలో జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేం దుకు అర్హత గల ఉపాధ్యాయులందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. శుక్రవారం మండల పరిధిలోని అన్నారుగూడెం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిఎస్ యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం తరుపున నన్ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నుకోవటం జరిగిందని, విద్యారంగ సమస్యలపై పూర్తి అవగాహన కలిగి సమస్యల పరిష్కారానికి పోరాడే నన్ను మరోసారి తిరిగి శాసనమండలికి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యూటీఎఫ్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, తల్లాడ మండల అధ్యక్ష, కార్యదర్శులు షేక్.లాల్‌సయ్యద్, తాళ్లూరు శ్రీనివాసరావు, శారదాదేవి, రామకృష్ణ, స్వామి, శ్రీదేవి, సనత్‌కుమార్, వింధ్యాధర, సైదులు, మురళీకృష్ణ, ఇందు, ప్రియ, స్వరాజ్యలక్ష్మి, సుధాకర్, రామారావు, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

## సివిపి మినహాయింపు వద్దు

### ట్రెజరీ డిడికి ఎస్‌జిపిఎటి వినతి



**ప్రజాపక్షం/ఖమ్మం :** కమ్యూటేషన్ వ్యాల్యూ పెన్షన్ మినహాయింపును రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు నిలుపుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ దారుల సంఘం డిడికి లిఖిత పూర్వక విజ్ఞప్తి చేసింది. కమ్యూటేషన్ వ్యాల్యూ పెన్షన్ (సివిపి) మినహాయింపును 15 ఏళ్ల నుంచి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం 12 ఏళ్లకు తగ్గించింది. సివిపి మినహాయింపును కుదించాలని కోరుతూ జిల్లాకు చెందిన పెన్షనర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా ఈఉత్తర్వులను న్యాయస్థానం జారీ చేసింది. ఈ ఉత్తర్వుల కాపీని శనివారం జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌విఎస్ నర్సింహంకు ఎస్‌జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య, ఆర్థిక కార్యదర్శి కనపర్తి వెంకటేశ్వర్లు అందజేశారు. పింఛన్‌దారుల పక్షాన సివిపి మినహాయింపులు నిలుపుదల చేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు సానుకూ లంగా స్పందించి మినహాయింపును 15 ఏళ్ల నుండి 12 ఏళ్లకు కుదిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని పరిశ పుల్లయ్య, కనపర్తి వెంకటేశ్వర్లు కోరారు.

## ఇంటర్నెట్ సేవలు అందించాలి

### సిసిఎ తారా చంద్




**ప్రజాపక్షం/భద్రాచలం :** మారుమూల ప్రాంతాలకు కూడా ఇంటర్నెట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీకం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అన్‌చార్జ్ తారాచంద్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ భవన సముదాయంలో కలెక్టర్ జితేష్ పాటిల్ తో కలిసి జిల్లాలో బిఎస్‌ఎన్‌ఎల్ టి ఫైబర్ వారు చేపడుతున్న ఇంటర్నెట్ 4జి మొబైల్స్ టవర్స్ అభివృద్ధి పనుల గురించి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిసిఎ మాట్లాడుతూ నేటి రోజుల్లో సె, అంతర్జాల సేవలు చాలా అవసరమని, ప్రభుత్వ సేవలు పొందేందుకు ప్రాధాన్యతా క్రమంలో టవర్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో కూడా 4జి సేవలు అందించేందుకు ప్రభుత్వ సహకారంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 4జి ఇంటర్నెట్ సేవలు అందించేందుకు తమ సహాయం ఎప్పటికీ ఉంటుందన్నారు. సేవలు విస్తరించడం ద్వారా మారుమూల ప్రాంతాలు కూడా అభివృద్ధి పథంలోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.సిసిఎ సంజీవరావు, జిల్లా పంచాయితీ అధికారి చంద్రమౌళి, ఎస్‌ఐసిడిఐజి సుశీల్ కుమార్, బిఎస్‌ఎన్‌ఎల్ జిడిఎం శ్రీనివాస్, ఏజిఎం సుధీర్, ఎస్‌డిఇ సక్రునాయక్, షకీల్, బాలాజీ, ఏఏఓ ఉదయ్, ఓఎస్ శివరాంజీ, టి ఫైబర్ ఆఫీసర్ సాయికుమార్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని కాపాడండి

**ప్రజాపక్షం/మధిర :** మధిర మున్సిపాలిటీ పరిధిలో మడుపల్లి గ్రామంలో హైస్కూల్ పక్కన్న ఉన్న ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైందని, అక్కడ కొంతమంది వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని, అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని అధికారులు కాపాడాలని సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు, నాయకులు అన్నవరపు సత్యనారాయణ కోరారు. శనివారం అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని మధిర మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి సందర్శించారు. ఆయనను కలిసిన వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకుని షెడ్ నిర్మాణం చేశారని, అక్రమ నిర్మాణాలను తొలగించాలని,కొత్తచెర్వు నుండి బాడవచేళ్లకు వెళ్లే వాగును కూడా ఆక్రమించుకన్నారని, దీని వలన సాగునీరు అం దక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకుం టామని అధికారులు తెలిపారు.

# నష్టపోయిన వరి రైతులను ఆదుకోవాలి

* ఎకరానికి 40 బస్తాల చొప్పున నష్టపరిహారం అందించాలి
* ఎఐకెఎస్ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం డిమాండ్





**ప్రజాపక్షం/సుజాతనగర్:** సుజాతనగర్ మండలంలోని పలు గ్రామాలలో వరి పంట రైతులు 1262 వరి రకం విత్తనాలను ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో పంట వేశారని, రైతులు తెలియక ఎకరానికి 40 వేల రూపాయలు పెట్టుబడి పెట్టి వరి పంటలను సాగు చేస్తే నాణ్యతలేని విత్తనాలను తెలియక వాడటం వలన రైతులు నష్టపోయారని ఎఐకెఎస్ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం తెలిపారు. ఈ సందర్భంగా శనివారం వరిపంటలను పలువురు రైతుసంఘం నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ 160 రోజులకు రావలసిన వరి పంట 100 రోజులకి కంకి ఈనింది. కొంత పొట్ట దశకు, మరి కొంత కంకి దశకు వచ్చింది. ఏపుగా పెరిగిన వరి మాత్రం నాలుగు రకాలలో రూపాంతరం చెం దడంతో పంటను గమనించిన రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం డీలర్స్ తో మాట్లాడారు. ఈ సందర్భ ంగా వారు మా ట్లాడుతూ ఎకరానికి 40 వేల రూ పాయలు పెట్టుబడి పెట్టి వరి పంటలను సాగు చేస్తే నాణ్యతలేని విత్తనాలను తెలియక వాడనపి దాని రైతులు నష్టపోయారన్నారు. నష్టపోయిన ప్ర తి ఎకరానికి 40 బస్తాలు చొప్పున నష్టపరిహారం రైతులకు అందించాలని దీని బాధ్యతను డీలర్స్ కంపెనీ యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని, రైతులకు కంపెనీ తక్షణమే స్పందించి నష్టపరిహారం అందించాలని లేని పక్షంలో ఆందోళనలో ఉధృతం చేస్తామని, రైతులకు న్యాయం జరిగేదాకా రైతులకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎస్ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు, సలిగంటి శ్రీను, రైతు సంఘం ఉపాధ్యక్షులు తాళ్లూరి పాపారావు, సిపిఐ మండల కార్యదర్శి భూక్య దస్రు, సంయుక్త కార్యదర్శి కుమారి హనుమంతరావు, జిల్లా సమితి సభ్యులు జక్కుల రాములు, రైతు సంఘం నాయకులు తాళ్లూరి ధర్మారావు, సిపిఐ నాయకులు వీర్ల మల్లేష్, బొడ్డు కేశవరావు, వీర్ల దుర్గాప్రసాద్, మేకల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## మధిర సబ్ కోర్టును ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తులు



**ప్రజాపక్షం/మధిర :** మధిర పట్టణం రిక్రి యేషన్ క్లబ్ కాం ప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్ కోర్టును హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.శ్రీసుధ, జస్టిస్ కాజాశరత్, జస్టిస్‌భీమపాక నగేష్‌లు శని వారం ప్రారంభించారు. ముందుగా వారిని అధికార లాంఛ నాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం పాత కోర్టు నందు రూ.24కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన భవనాల నిర్మాణ పనులకు, రూ.39లక్షలతో నిర్మించనున్న రికార్డ్స్ భవన నిర్మాణ పనులకు భూమి ఖమ్మం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ న్యాయమూర్తి జి.రాజ గోపాల్‌లతో కలిసి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సం దర్భంగా న్యాయమూర్తులు మా ట్లాడుతూ అగ్రిమెంట్ తేదీలోగా పను లు పూర్తయ్యేలా చర్యలు తీసుకో వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మధిరర సివిల్ న్యాయమూర్తి మీరా ఖాసీంసాహెబ్, మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.పుల్లారావు, ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ హేమలత, మధిర మున్సిపల్ కమీషనర్ సంపత్‌కుమార్, తహాశీల్దార్ రాంబాబు, న్యాయవాదులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి అధికారులపై చర్యలు తీసుకోండి

### ఏఐటియుసి డిమాండ్




**ప్రజాపక్షం/ఖమ్మం:** నగర పాలక సం స్థలో అవినీతికి పాల్పడిన అధికారులపై కఠినచర్యలు తీసుకోవాలని ఎఐటియుసి డిమాండ్ చేసింది. గత కలెక్టర్ పలుమార్లు టౌన్ ప్లానింగ్ అధికారులను హెచ్చరించినా తమ తీరు మార్చుకోలేదని ఎఐటియుసి నేతలు తెలిపారు. శనివారం ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ, తోట రా మాంజనేయులు, జిల్లా కార్యనిర్వహక అధ్యక్షు లు రావిశివరామ కృష్ణ తదితరులు ఎఐటియుసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2018 నుంచి 2023 సంవత్సరం వరకు జరిగిన అవినీతి పనుల్లో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లపైన విజి లెన్స్ విచారణ జరిపించాలని ఎఐటియుసి నేతలు డిమాండ్ చేశారు. క్రింది స్థాయి అధికారులను తమ అధికారంతో చెప్పు చేతల్లో ఉంచుకుని ఒక అవినీతి వలయాన్ని ఖమ్మం కార్పొరేషన్‌లో ఏ ర్పాటు చేశారని, కాంట్రాక్టర్లకు సహకరి స్తూ కార్మికులకు వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్న అధికారులపై విచారణ జరిపించాలని విజిలెన్స్ విచారణ తర్వాత నివేదికను ప్రజల ముందు ఉంచాలని ఎఐటియు సి డిమాండ్ చేసింది నగర పాలక సంస్థలో బిల్ కలెక్టర్ నుండి ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ వరకు అవినీతిలో ము నిగారన్న వార్తలు వినిపిస్తున్న ఉన్నతా ధికారులు ఎం దుకు మౌనం పాటిస్తున్నారని, నాలుగైదేళ్లుగా కార్పోరేషన్ పాలన ను పక్కదారి పట్టిస్తున్న అధికా రులపై ఎందుకు చర్యలు తీసు కోవడం లేదని వారు ప్రశ్ని ంచారు. విచారణ జరిపి తక్షణం చర్య లు తీసు కోకపోతే ఎఐటియుసి ఆధ్వర్యంలో ఆం దోళనలు చేపడ తామని హెచ్చరించారు.

## 31న ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం

* ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. లక్ష్మీ నారాయణ




**ప్రజాపక్షం/మణుగూరు :** ఈ నెల 31న జరుగు ఎఐటియుసి 105వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వ హించాలని, కార్మిక వాడలలో ఎఐటియుసి జెండాలను ఎగరవేయాలని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. లక్ష్మీ నారాయణ పిలుపునిచ్చారు. శనివారం సిపిఐ కార్యాలయంలో ఏఐటియుసి ఆధ్వర్యంలో జరిగిన సమావేశ ంలో వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ దేశం లో స్వాతంత్రం రాకముందే ఆల్ ఇండియా ట్రేడ్ యూ నియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి)గా ఆవిర్భవించి 105 సంవత్సరాలు కావస్తుందని, కార్మిక, కర్షక వర్గాల కోసం అనేక హక్కులు సాధించిన చరిత్ర ఎఐటియుసిని, పోరాట ఫలితంగా అనేక హ క్కులుసాధించుకున్నామన్నారు. రవా ణా, రైల్వే, బ్యాంకింగ్, టెలిఫోన్, ఆర్టీసీ, సింగరేణి, కర్మాగారాలు ఇలా అనేక ఫ్యాక్టరీలలో పోరాట ఫలి తంగా అనేక హక్కులు సాధించినట్లు తెలిపారు. ఎఐటియుసి మణుగూరు మండల అధ్యక్ష కార్యదర్శులు రాయల భిక్షం, గద్దం వెంకటేశ్వర్లు (జీ వి.), గౌరవ అధ్యక్షులు తోట రమేష్ , జక్కుల రాజబాబు, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, ఎస్వీ నాయుడు, ఒగ్గు ముతా అధ్యక్షులు శ్రీకా కుళం, వీరమల్లు పాల్గొన్నారు.

# రైతు భరోసా విడుదల చేయాలి

### 28న కలెక్టరేట్ వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రుణమాఫీని తక్ష ణం అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సం ఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు డిమాండ్ చేశారు. ఆగస్టు 15 నాటికే పూర్తి చేస్తామన్న రుణమాఫీ ఇప్పటి వరకు సగం కూడా పూర్తి కాలేదని లక్ష లోపు రుణాలు కూడా పూర్తి చేయకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర రైతు సంఘం జిల్లా సమితి సమావేశం శనివారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో దొండపాటి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో గోవిందరావు మాట్లాడుతూ రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దాటవేత ధోరణిని అవలంభిస్తుందన్నారు. రాష్ట్ర వ్యా ప్తంగా 20లక్షలకు పైగా రైతులకు రుణమాఫీ జరగలేదని ఈ విషయంలో రోజుకో ప్రకటన ఇస్తున్నారని ఇది రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తుందన్నారు. రైతుబీమా అమలు చేయడంతో పాటు సన్నవడ్లతో పాటు ఇతర రకాల ధాన్యానికి కూడా రూ.500 బోనస్ ఇవ్వాలని భూహక్కుల చట్టాన్ని త్వరితగతిన అ మలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎకరాకు రూ.15వేల చొప్పున ఖరీఫ్, రబీల్లో ఇస్తానని చెప్పారని కానీ ఖరీఫ్‌లో రైతుల ఖాతాల్లో జమ చేయలేదని ఆ యన తెలిపారు.రైతాంగ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ 28న సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లుతెలిపారు. పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొ ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతు సంఘం నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, పుచ్చకాయల సుధాకర్, యడ్లపల్లి శం కరయ్య, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం బార్ అసోసియేషన్‌ను సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి శ్రీసుధ




**ప్రజాపక్షం/ఖమ్మంలీగల్:** ఖమ్మం బార్ అసోసియేషన్ ఆహ్వానం మేరకు హైకోర్టు న్యాయమూర్తి శ్రీసుధా ఖమ్మంబార్ అసోసియేషన్ ను సందర్శించారు. మధిరలో కోర్టు భవన శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఖమ్మం చేరుకుని బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఖమ్మంజిల్లాతో తనకు అనుబంధం ఉందని గతంలో వరంగల్ ట్రిబ్యూనల్‌లో జడ్జి గా ఉన్నప్పుడు ఖమ్మంజిల్లాకు ఇంచార్జిగా పనిచేశానని గుర్తు చే సుకున్నారు. న్యాయవాదుల సహకారంతోనే కక్షిదారులకు సత్వ రం న్యాయం అందుతుందన్నారు. విట్‌నెస్ డిపోసిషన్ సెంటర్‌ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు రాజగోపాల్, అపర్ణ, అర్చనకుమార్, రాంప్రసాద్, శాంతిలత, కార్తీక్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాపక్షం/కామేపల్లి :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఏపూరి లలితాదేవి, మండల కార్యదర్శి పుచ్చకాయల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల కేంద్రమైన కామేపల్లిలో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ఎన్నికల తరువాత ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారందరికీ రేషన్ కార్డు లు ఇందిరమ్మ ఇండ్లు పెన్షన్లు అందజేసి ఆదుకోవాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. మండల కేంద్రాల్లో సిపిఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి పత్తిని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని అన్నారు. సిపిఐ నాయకులు బండి శ్రీను, దీవెన రామ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరుల త్యాగాల వల్లే స్వేచ్ఛగా ఉన్నాం

### కలెక్టర్ జితేష్ వి.పాటిల్




**ప్రజాపక్షం/భద్రాచలం :** పోలీస్ అమర వీరుల త్యాగాల వల్లే మనమంతా స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవిస్తున్నామని, పోలీసు అమరులత్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్య అని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శనివారం కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీలో ఎస్‌రి రోహిత్ రాజ్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు సేవలందిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడేది పోలీస్‌శాఖ అని, దేశ సరిహద్దుల్లో పహారా కాస్తూ ఉగ్రవాదులు, విద్రోహశక్తుల నుండి మనల్ని కాపాడుతూ ఎంతో మంది పోలీసులు అమరవీరులయ్యారని అన్నారు. వారి త్యాగాలు చిర స్మరణీయం అని చెప్పారు. అనంతరం ఎస్‌పి రోహిత్ రాజ్ మాట్లాడుతూ దేశ అంతర్గత భద్రతలో భాగంగా విధులు నిర్వహిస్తూ ఏటా వందలాది మంది సైనికులు ప్రాణాలు కోల్పోతున్నార ని, వారందరినీ స్మరించుకునేందుకు ఏటా ఈనెల 21 నుండి 31 వరకు సంస్మరణ కార్యక్రమాలు జరుపుకుంటామని చెప్పారు. పోలీస్ అధికారులు, సిబ్బంది తమ దైనందన జీవితంలో వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలని ఎస్‌పి సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం సబ్ డివిజన్‌లోని పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అప్పు ఇచ్చిన బిచ్చగాడికి ఐపి నోటీస్

### భార్య, భర్తలు ఇద్దరూ రూ.2.75 కోట్ల ఐపి దాఖలు



**ప్రజాపక్షం/బోనకల్ :** భార్యతో కలిసి ఎన్నోయేండ్లుగా రూపాయి రూపాయి బిచ్చం అడుక్కొని కూతురి చదువుకోసం దాచుకున్న సొమ్మును బిచ్చగాడు ఓ హోటల్ వ్యాపారి వడ్డీకి ఇవ్వడంతో, సదరు వ్యాపారి ఐపీ దాఖలు చేయడంతో నోటీసులు అందడంతో మండలంలో చర్చనీయాంశంగా మారింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం. మండల కేంద్రంలోని బోనకల్ చెందిన గోళ్ళల ఆశోక్ కొన్నేళ్లు మండల కేంద్రంలోని సాయిబాబా టెంపుల్‌లో బయట భిక్షటన చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మండల కేంద్రంలో సుధా హోటల్ నిర్వహిస్తున్న రమన నరసింహరావు సాయిబాబా టెంపుల్‌కు వస్తూ ఆశోక్‌కు పరిచయమ్యాడు. పలుసార్లు హోటల్ నుంచి టిఫిన్, భోజనం తెచ్చి ఇవ్వడంతో పరిచయం ఏర్పడి ఒకరినొకరు పలుకరించుకోవడం, మంచి చెడులను సంభాషిం చుకోవడం చేశారు. రమన నరిసింహరావు డబ్బులు అవసరం వచ్చినప్పుడల్లా కొంత సొమ్మును ఆశో క్ వద్ద తీసుకొని తిరిగి ఇచ్చేస్తుండేవాడు. ఇదిలా ఉండగా మూడేళ్ల క్రితం పెద్ద మొత్తంలో నరసింహ రావుకు డబ్బులు కావాల్సివచ్చి ఆశోక్ వద్ద రూ.50 వేలు తీసుకున్నాడు. కొద్ది కాలం వడ్డీ ఇస్తూ రెండే ళ్లుగా వడ్డీ డబ్బులు ఇవ్వడం నిలిపివేశాడు. రేపు ఇస్తాను, మాపు ఇస్తానని కాలం వెళ్లతీశాడు. రమన నరసింహారావు అప్పుల తీసుకున్నవారి నుండి ఒత్తిడి రావడంతో 73 మందిని ప్రతివాదులకు చూపి స్తూ రూ.1.95 లక్షలు ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఐపి దాఖలు చేసిన నోటిసులు దాఖలు చేశాడు. రూ.50 వేలు అప్పు ఇచ్చిన ఆశోక్‌కు రమన నరసింహరావు పంపిన ఐపి దాఖలు నోటిసు అందింది. 11 మందికి ప్రతివాదులకు చూపిస్తూ రూ.80 లక్షలు భార్య సుధా కూడా ఐపి దాఖలు చేయడం గమనార్హం. దీంతో భిక్షాటన చేస్తూ రూ.50 వేలు సొమ్మును పోయాయని, దాచుకున్న సొమ్మును ఇలా పొగొట్టుకున్నానని ఆశోక్ విలపిస్తుడడంతో సాయిబాబా టెంపుల్‌కు వచ్చిన పలువురు ఆవేదనకు గురయ్యారు.

## వైద్యం వికటించి గర్భిణీ మృతి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకపల్లి మండల పాత గంగారం గ్రామా నికి చెందిన పోడియం మోతి(18) వైద్యం వికటించి గర్భిణీ స్త్రీ మృతి చెందిన ఘటన ములకపల్లి మండలం పరిధి పాత గంగారం గ్రామంలో చోటు చేసుకుంది. బంధు వులు తెలిపిన వివరాల ప్రకారం 24న డెలవరీ కోసం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి ఆశా వర్కర్ తీసుకువెళ్ళారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు తిరిగి ఇంటికి పంపించారు. మరుసటి రోజు ఉదయం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆడ్మిట్ అయ్యారు. సర్జరీ అనంతరం అప్పుడే జన్మించిన బేబీ మరణించారని వైద్యులు తెలిపారు. మృ తురాలు పోడియం మోతికి సరైన వైద్యం ఇవ్వకపోవడం పోడియం మోతి మృతి చెందిందిని భర్త తెలిపాడు. తన భార్య చావుకు కారకులైన పాల్వంచ ములకలపల్లి ప్రభుత్వ వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతిరాలు భౌతిక కాయాన్ని సందర్శించడానికి వైద్యులు రాకపోవడంతో అనుమానాలు బలంగా వ్యక్తం అవుతున్నాయని కుటుంబ సభ్యు లు ఆరోపించారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ చొరవ చూపించి విచారణ జరిపించిమోతి మరణానికి కారణమైన ప్రభుత్వ వైద్యులపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు తెలిపారు.

## ఎమ్మెల్యే కూనంనేని కృషి అభినందనీయం



**ప్రజాపక్షం/సుజాతనగర్ :** కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ ప్రాంతాల అభివృద్ధి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయడం సంతోషకరమని సిపిఐ మండల కార్యదర్శి భూక్య దస్రు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు కృషితో నియోజవర్గం అభివృద్ధి సాగుతుందన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వల్ల యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు దొరుకుతాయని, పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కుమారి హనుమంతరావు, జక్కుల రాములు, తాళ్ల వెంకటేశ్వర్లు, సిపిఐ నాయకులు బొడ్డు కేశవరావు, మేకల వెంకటేష్, ముక్కెర మురళి, మదన్ సింగ్, దండు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజి ల్లా కలెక్టరేట్‌కు ఆదివారం పలు ప్రారంభోత్సవాలకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్ర మార్క రానున్న నేపథ్యంలో ఏర్పాట్లు పక్కగా జరగాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కలెక్టరేట్‌లో ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న బస్టాప్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, ఫీడింగ్ రూ ము, ఎస్‌బిఐ బ్యాంకు, భోజనశాలను పరిశీలించారు. బస్టాప్ పరిశీలన అనంతరం అక్కడ ఉన్న ప్రజలతో కలెక్టర్ ము చ్చటించారు. కలెక్టరేట్‌కు వచ్చిన పని వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టరేట్‌కు వచ్చే వారి సౌకర్యార్థం కలెక్టరేట్ వద్ద బస్టాప్ ఏర్పాటు చేయడం వల్ల నీడతో పాటు ఆర్టిసి సేవలు సద్వినియో గం చేసుకుని ప్రశాంతంగా ప్రయాణిం చి తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చునని తెలిపారు. వైరా మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన నాగేశ్వరరావు అనే రైతుతో ఏ పంట సాగు చేస్తున్నారు, దిగుబడి ఎంత వస్తుంది మొదలగు వివరాలను కలెక్టర్ అడిగి తెలు సుకున్నారు. ఆయిల్ పామ్ సాగు వల్ల లాభం చేకూరుతుందన్నారు. విద్య, వై ద్యంపై ప్రభు త్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని ప్రభుత్వ పాఠశాలలను బాగు చేశామని పిల్లలను ప్రభుత్వ పా ఠశాలల్లో చదివించాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నందు పర్యటిస్తారని కలెక్టరేట్ వద్ద బస్టాప్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, భోజనశాల, ఫీడింగ్ రూము, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లా కలెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయాన్ని సందర్శించారు. అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ, డిఆర్‌డివో సన్యాసయ్య, సంబ ంధిత అధికారులు పాల్గొన్నారు.

## పార్టీ ఫిరాయింపులతో ఆత్మసైర్థ్యం కోల్పోయా : ఎంఎల్‌సి జీవన్‌రెడ్డి

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** రాష్ట్రంలో ఎంఎల్‌ఎల పార్టీ ఫిరాయింపులతో తమలాంటి ఒరిజినల్ కాంగ్రెస్ నాయకులు ఆత్మసైర్థ్యం కోల్పోయామని, దాంతో ప్రత్యర్థులు రెచ్చిపోయారని మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కరీంనగర్ పట్టభద్రుల ఎంఎల్‌సి తాటిపర్తి జీవన్‌రెడ్డి విమర్శించారు. ఇటీవల జీవన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు గంగారెడ్డి హత్య జరిగిన నేపథ్యంలో జీవన్‌రెడ్డి పార్టీ ఫిరాయింపుల తీరును నిరసిస్తు కాంగ్రెస్ అధిష్ఠానానికి లేఖ రాయడం జీవన్‌రెడ్డి రాహుల్ గాంధీకి అనుచరుడిగా ఉన్న టీపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ శనివారం జగిత్యాల వెళ్లి జీవన్‌రెడ్డితో భేటి కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాంగ్రెస్‌లో గంగారెడ్డి హత్య దరిమిలా కాంగ్రెస్‌కు దండమని, పార్టీలో కొనసాగలేనని, స్వచ్ఛంద సంస్థ పెట్టుకుని ప్రజాసేవ చేస్తానని జీవన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేయడంతో మధుయాష్కీ ఆయనను కలిసి బుజ్జగించారు. జీవన్‌రెడ్డి, మధుయాష్కీ కాంగ్రెస్ ముఖ్య నాయకులు సమావేశమై జాబితాపూర్‌లో జరిగిన గంగారెడ్డి హత్య బాధాకరమని పేర్కొన్నారు. ప్రస్తుత పరిణామాలపై చర్చించారు. 40 ఏండ్లు కాంగ్రెస్‌లో పార్టీలో ఉంటూ పనిచేసిన జీవన్‌రెడ్డికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. జీవన్‌రెడ్డి మాట్లాడుతూ తనకు చెప్పకుండానే, కనీస సమాచారం లేకుండానే జగిత్యాల ఎంఎల్‌ఏ సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాయింపులకు రాహుల్ గాంధీ వ్యతిరేకమని చెబుతూ అధిష్ఠానానికి వ్యతిరేకంగా సీఎం వ్యవహరించారని మండిపడ్డారు.

## గృహ నిర్మాణానికి రూ.5 లక్షలివ్వండి



**ప్రజాపక్షం/వేములవాడ:** ఇండ్ల స్థలాలు ఉండి, ఇంటి నిర్మాణం చేసుకోవాలనుకునే వారికి కాంగ్రెస్ ప్రభుత్వ హామీ ప్రకారం రూ.5 లక్షల రుణం ఇవ్వాలని,అలాగే అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్రూంలు ఇవ్వాలని సిపిఐ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కడారి రాములు అన్నారు. వేములవాడ కూరగాయల మార్కెట్లో మహిళలకు కనీస మౌలిక వసతులు లేక ఇబ్బంది పడుతున్నారని వెంటనే కూరగాయల మార్కెట్లో మౌలిక వసతులు కల్పించాలని, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకొని ఇంటి స్థలం ఉన్నవారికి 5 లక్షలు,నిరుపేదలకు డబుల్ బెడ్రూం లు ఇప్పించాలని, కూరగాయల మార్కెట్లో మౌలిక వసతులు కల్పించాలని కొరారు. సిపిఐ వేములవాడ పట్టణ కార్యదర్శి గాజుల పోశెట్టి, వేములవాడ రూరల్ మండల కార్యదర్శి శ్రీరాముల నర్సయ్య, కోరేపు శ్రీను, కోరేపు క్రాంతి, పెంట మల్లయ్య, రాజు, నాగిని శ్రీను తదితర సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## సాఫ్ట్‌బాల్ పోటీల్లో గాయత్రి విద్యానికేతన్ ప్రతిభ



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** తెలంగాణ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్ షిప్ (బాలికలు) లో పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ కి చెందిన అల్లెంకి మహాలక్ష్మి , పడాల హాసిని, ఎ. లాస్య ప్రియ తమ ప్రతిభ చూపి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. అభినందన కార్యక్రమంలో గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడారు. కేవలం చదువు ఒక్కటే కాకుండా ఇలాగే ఆటల్లో కూడా ప్రతిభ చూపిస్తూ ముందు ముందు మరెన్నో పతకాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు,జిల్లాకు పేరు తీసుకొని రావాలని ఆకాంక్షించారు. విద్యార్థులను, పి.ఇ.టి. స్రవంతిలను అభినందించారు.కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్ పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు



**ప్రజాపక్షం/ రామగిరి :** పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామపంచాయతీ లోని పారిశుద్ధ కార్మికులకు శనివారం మండల పంచాయతీ అధికారి కాటం భాస్కర్ దుస్తులను అందజేశారు. అలాగే దుస్తులతో పాటు బూట్లు, సబ్బులు, ఇతర సామాన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంబటి శంకర్ కారోబార్ బర్ల భూమయ్య మరియు పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

## పవర్ లిఫ్టింగ్ పోటీలకు నేహ



**ప్రజాపక్షం/సిద్దిపేటఅర్బన్:** మెహందీ ఆర్టిస్టుగా పనిచేసిన మహిళ ఏకంగా అంతర్జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్‌కు ఎంపికైంది. సిరిసిల్లా పట్టణానికి చెందిన నేహ సిద్దిపేట పట్టణ కేంద్రంలోని ఎక్స్ట్రీమ్ జిమ్‌లో శిక్షణ పొందిన నేహ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో 60కెజీల విభాగంలో 122.5 కేజీల బరువును లిఫ్ట్ చేసి మొదటిస్థానంతో గోల్డ్‌మెడల్ సాధించినది. అంతే కాకుండా అంతర్జాతీయ పోటీలకు సైతం ఎంపికైంది. ఆమె మాట్లాడుతూ గతంలో మెహందీ ఆర్టిస్టుగా పనిచేసిన తనకు ఎక్స్‌ట్రీమ్ జిమ్ వారి సహాయంతో అంతర్జాతీయ స్థాయి వరకు ఎదిగానని,తనకు సహాయం చేసిన ఎక్స్‌ట్రీమ్ జిమ్ యాజమాన్యానికి,కోచ్ శేఖర్,నిఖిల్‌లకు నేహ కృతజ్ఞతలు తెలిపింది.

## ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. పోలీస్ అధికారులు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ సహకారంతో శనివారంజిల్లా పోలీస్ కార్యాలయంలో వైద్య శిభిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్.. పోలీస్ సిబ్బందితో పాటు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ శారీరకంగా మానసికంగా ధృడం గా ఉండడం అవసరమని, పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న అధికారులకు, సిబ్బందికి చాలా ముఖ్యమన్నారు. పోలీసులు ప్రతిరోజు ఎన్నో ఆటంకాలు ఎదుర్కొంటూ అధిక ఒత్తిడికి లోనవుతున్నారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్యమే గొప్ప సంపద అని, వైద్యుల సలహాలను పాటించాలన్నారు. మెడికల్ హాస్పిటల్ డాక్టర్స్‌కి ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. 300మంది పోలీస్ సిబ్బం ది, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ భీంరావ్, డిఎస్పీలు రవీంద్రకుమార్, రఘు చందర్, ఉమా మహేశ్వరరావు, వైద్యులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ దిలీప్‌రెడ్డి, డాక్టర్ ప్రతిష్ఠారావు, డాక్టర్ అనీష్, డాక్టర్ తాహా, డాక్టర్ హర్షిత్ ఆర్ఐలు, కిరణ్‌కుమార్, రామక్రిష్ణ, వేణు పాల్గొన్నారు.

# విద్యార్థులు లక్ష్య సాధన దిశగా సాగితేనే ఉన్నతస్థితి

### రాష్ట్ర రవాణ, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** విద్యార్థులు లక్ష్యసాధన దిశగా వెనక్కి తగ్గకుండా ఉన్నత శిఖరాలకు ఎదగాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. చిగురుమామిడి మండలం చిన్నముల్కనూరు మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలో విధ్యార్థులకు మంత్రి షూస్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ చొరవతో సిఎస్‌ఆర్ ఫండ్స్ కింద విద్యార్థులకు షూస్ పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. కరీంనగర్ జిల్లావ్యాప్తంగా 23 వేల మంది విద్యార్థులకు షూస్ పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద అన్ని పాఠశాలలో మౌలిక వసతులు కల్పించామన్నారు. రాష్ట్రంలోని సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 25వేల పాఠశాలలో రూ. 1100 కోట్లతో మౌలిక వసతులు కల్పించామన్నారు. మోడల్ స్కూల్‌లో 11 సంవత్సరాల తర్వాత బదిలీలు, 19వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు, 35 వేల మందికి బదిలీలు చేపట్టామన్నారు. శానిటేషన్ సిబ్బంది కోసం నిధులు కేటాయిస్తున్నామని, ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, డ్రింకింగ్ వాటర్ అందిస్తున్నామని తెలిపారు. అన్ని గురుకులాలకు అద్దె చెల్లించామని, ఫీజు రీయంబర్స్‌మెంట్ సైతం చెల్లిస్తున్నామని తెలిపారు. దేశానికి పరిపక్వతకలిగిన యువతను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రతతో అన్ని రకాల సమస్యలు పరిష్కారం జరుగుతాయన్నారు. కరీంనగర్ పార్లమెంటులో 30 మండలాలుంటే 29 మోడల్ స్కూలు తెచ్చామని గుర్తు చేశారు. కలెక్టర్ పమేలా సత్పతి, అడిషినల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేష్, డీఈవో జనార్ధన్, ఎంఈవో పావని, విద్యాశాఖ అధికారులున్నారు.



### మత్స్యకారుల అభ్యున్నతికి పెద్దపీట

**కోహెడ:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గంగపుత్ర, మత్స్యకారుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.శనివారం సిద్దిపేట కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరితో కలిసి చేప పిల్లలను వదిలారు. ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలోని శనిగరం ప్రాజెక్టు వద్ద ప్రభుత్వ స్థలంలో ఫిష్ మార్కెట్ ఏర్పాటు చేసేందుకు స్థలం సేకరించాలని ఆర్డీవోకు సూచించారు.

## వ్యాపారాల్లోనూ మహిళాశక్తిని చాటండి

### కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ప్రతినిధి:** పురుషులకు ధీటుగా మహిళలు వ్యాపార రంగంలో అత్యుత్తమంగా రాణిస్తూ మహిళా శక్తిని చాటి చెప్పాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. శనివారం చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సంపద వనాలు, ముదిమాణిక్యం గ్రామంలో డ్రాగన్ ఫ్రూట్ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. అదే విధంగా ఇందుర్తి గ్రామంలో ఇందిరా మహిళా శక్తి యూనిట్లు బ్యూటీపార్లర్, మ్యాచింగ్ సెంటర్, పిండి గిర్నీని పరిశీలించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్ ఉన్నారు. ఇందిరా మహిళా శక్తి లబ్దిదారులు బ్యాంకు లింకేజీ రుణం ద్వారా యూనిట్ ఏర్పాటు చేసిన అంబటి శైలజ, కోదూరి రాజమణి, పున్నం మౌనికతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. సమర్ధవంతంగా యూనిట్లను నడుపుతున్న సభ్యులను అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూకోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే ఉద్దేశ్యంతో ఇందిరా మహిళా శక్తి పథకాన్ని అమలు చేస్తున్నదని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకంపై అత్యంత ప్రత్యేక దృష్టి పెట్టారని, మహిళల అభ్యున్నతి కోసం చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పల్లె దవఖానను తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా దవాఖానల్లో వసతులు, సేవలు, రోగులు ఎంత మంది వస్తారు? తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆర్డీవో మహేశ్వర్, డిఆర్డీవో వుప్పల శ్రీధర్, తహసీల్దార్ రమేష్, ఎంపిడివో ఎండి ఖాజా మొయినొద్దీన్, డిపిఎం సిహెచ్ ప్రవీణ్ కుమార్, ఎంపివో బండ రాజశేఖర్‌రెడ్డి, ఆర్ఐ అరుణ్ కుమార్, ఏపిఎం మట్టెల సంపత్, సిసి దుబ్బాక వెంకటేశ్వర్లు, వివో అధ్యక్షురాలు బందెల మల్లవ్వ ఉన్నారు.

## తీరు మారని ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం!

### 300మందికి ఒకే వైద్యుడు



**ప్రజాపక్షం/హుస్నాబాద్:** హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో ఉన్న 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం నేటికీ మారక పోవడపై సిపిఐమండలకార్యదర్శి,మాజీ ఎంపిపి గడిపె మల్లేశ్ మండిపడ్డారు. శనివారం పట్టణానికి చెందిన దుండుగుల రాజు అనారోగ్యంతో ప్రభుత్వ అసుపత్రికి వచ్చాడు. మల్లేశ్ రాజు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇదిలా ఉండగా అసుపత్రిలో వైద్యుల వివరాలు తెలుసుకోగా కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారని, ఒకరు పిల్లల వైద్యురాలు నాగమణి, మరొకరు డాక్టర్ శివకుమార్ డ్యూటిలో ఉన్నారు. వారు హుస్నాబాద్ అసుపత్రి వైద్యులు కానప్పటికిని విధులు నిర్వర్తిస్తున్నారు. మల్లేశ్ మాట్లాడుతూ హుస్నాబాద్ ప్రభుత్వ అసుపత్రికిరోజు దాదాపు 200వందల నుండి3 00వందలమంది ఒపి పేషెంట్లు వస్తుంటారు. గతంలో విధుల నిర్వహణలో పలుమార్లు వైద్యుల నిర్లక్ష్యంపై అరోపణలు ఉన్న విషయం తెలిసిందే. శనివారం అసుపత్రిలో డ్యూటికి 11 గంటలు అయినప్పటికిని ప్రధాన వైద్యధికారి రమేశ్‌రెడ్డి గైర్హాజరయ్యారు. డాక్టర్లు సమయానికి రాకపోవడంతో పేషెంట్లు ఇబ్బంది పడుతున్నారని అరోపించారు. మరి ఇక్కడ పనిచేసే వైద్యులు ఎక్కడకు వెళ్లారని ఆరా తీయగా.. ఎవరి నుండి కూడా సమాధానం రాలేదు. దవాఖానలో ఏమి జరుగుతుందని ప్రశ్నించారు. హుస్నాబాద్ అసుపత్రిపై స్థానిక ఎమ్మెల్యే మంత్రి పొన్నం ప్రభకర్, కలెక్టర్, అధికారులతో మాట్లాడి పూర్తి స్థాయి లో సిబ్బందిని నియమించాలని కోరారు. హుస్నాబాద్ వైద్యశాలలో బయోమెట్రిక్ విధానం వెంటనే ఏర్పాటు చేయాలని అయన అధికారులను కోరారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రవిచంద్రన్



**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** గత బిఆర్ఎస్ ప్రభుత్వం పెంచిన మున్సిపల్ కార్మికులకు 1000 రూపాయిలు ఏడు నెలల బకాయిలు చెల్లించాలని (ఈ ఎస్ఐ) తక్షణమే అమలు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు కె.రవిచంద్రన్, కార్యదర్శి విజైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలో మున్సిపల్ కార్యలయంలో కార్మికులతో శనివారం రాష్ట్ర అధ్యక్షులు రవి చంద్రన్, కార్యదర్శి జైపాల్ రెడ్డి, సమావేశమై రావల్సిన బకాయిల గురించి అడిగి తెలుసుకోని వారితో కలిసి మున్సిపల్ కమిషనర్ మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు పారాలు,చీపుర్లు, సబ్బులు, బూట్లు, బ్లౌజులు ఇవ్వా లన్నారు.ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఉస్మాన్, మున్సిపల్ కార్మిక అధ్యక్షులు లక్ష్మ ణ్, నాయకురాలు మధురమ్మ, శ్రీకాంత్, సుమన్, వాజిద్, తోటి కార్మికులు తదితరులు పాల్గోన్నారు.

## సకాలంలో పరిశ్రమలకు అనుమతి

### సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజాపక్షం/సిరిసిల్ల :** పరిశ్రమల ఏర్పాటుకు అనుమతుల విషయంలో జాప్యం లేకుండా సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పరిశ్రమల, ఆయా శాఖల ఉన్నతాధికారులతో శనివారం డిపిసి టిఎస్ ఐ పాస్, టి ప్రైడ్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. పరిశ్రమల ఏర్పాటుకు ఇప్పటిదాకా ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి, ఏఏ కారణాలతో నిలిచిపోయాయి తదితర విషయాలను ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. టి ప్రైడ్ కింద ఎస్సీలకు 21, ఎస్టీలకు 19, దివ్యాంగులకు ఒకటి, పావలా వడ్డీ కింద 2 యూనిట్లు మంజూరయ్యాయని జిఎం ఇండస్ట్రీస్ గణేష్ రాం తెలిపారు.

## గడువులోగా పనులు పూర్తి చేయాలి



**ప్రజాపక్షం / ధర్మపురి :** అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పనులు చేయని వారికి నోటీసులు జారీ చేయాలని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్,జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌లు అధికారులను ఆదేశించారు. ధర్మపురిక క్షేత్రానికివచ్చే భక్తుల సౌకర్యార్థం కోట్లాది రూపాయలతో చేపడుతున్న వివిధ రకాలైన పనులపై శనివారం దేవస్థానం కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో పనుల ప్రగతిపై రివ్యూ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పనుల ప్రగతిని పరిశీలించారు. వాటిలో బస్టాండ్ వద్ద నున్న 60 గదుల ధర్మశాల గదుల నిర్మాణం, ఎస్‌కెఎస్ ఆర్‌షాపింగ్ కాంప్లెక్స్‌ను పుట్ట బంగారం నిర్మాణం, నాగమయ్య దేవాలయం తదితర నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం దేవస్థానం కార్యాలయంలో కలెక్టర్‌తోకలిసివిప్ అధికారులతో రివ్యూ సమావేశాన్నిఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ దేవస్థానానికి వచ్చే భక్తులకు రుచికరమైన భోజనం అందించాలని అందుకు మహ అన్నదానం భవనం నిర్మించుటకు దాతలు ముందుకు వస్తున్నారని కనీసం ప్రతి రోజు 500 మందికి భోజన వసతులు కల్పించాలని సూచించారు. ముఖ్యంగా గోదావరితీరంలోఅత్యవసరంగా భక్తులు సేద తీర్చుకునేందుకు శాశ్వత డార్మిటరి హాల్స్ బట్టలు మార్చుకొనుటకు గదులు, మరుగుదొడ్లు, షవర్స్ ఏర్పాటు చేయుటకు చర్యలు గైకొనాలని ఆదేశించారు.

**దేవాలయాల్లో పూజలు**

ధర్మపురి శ్రీ లక్ష్మి నృసింహ స్వామి దేవస్థానంలో విప్ అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్ వేరు వేరుగా స్వామి వారిని దర్శించుకున్నారు. మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహశీల్దార్ కృష్ణ చైతన్య, దేవస్థానం ఈవో శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రతాప్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## పోస్టాఫీసులో రూ.30లక్షల నిధులు స్వాహా!

### డిపాజిట్ దారుల చేతికి నకిలీ పాస్ పుస్తకాలు, రశీదులు





**ప్రజాపక్షం/ రామగిరి :** రామగిరి మండలం బేగంపేట పోస్ట్ ఆఫీస్‌లో డిపాజిట్ దారులకు నకిలీ పాస్ పుస్తకాలు, రశీదులు ఇచ్చి దాదాపు 30 లక్షల రూపాయలు నిధులు స్వాహా అయినట్టు పోస్ట్ ఆఫీస్ అధికారులు గుర్తించడం జరిగింది. నగదు గల్లంతు కావడంపై డిపాజిట్‌దారులు ఆందోళన చెంది పోస్ట్ ఆఫీస్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. శనివారం బేగంపేట పోస్టాఫీస్‌లో నిధుల గల్లంతుపై జమ్మికుంట పోస్ట్‌ఆఫీస్‌లో విధులు నిర్వహించే ఇన్‌స్పెక్టర్ మోహన్ , గోదావరిఖని పోస్ట్ ఆఫీస్‌లో ఎంవోగా విధులు నిర్వహించే ప్రసాద్,పెద్దపల్లిపోస్ట్‌ఆఫీస్‌లో విధులు నిర్వహించే సంపత్, కుమార్ స్వామిలపై పోస్ట్ ఆఫీస్ అధికారులు విచారణ చేపట్టారు. దాదాపు 206మంది డిపాజిట్ దారుల ఖాతాలను, రశీదులను పరిశీలించా రు. దాదాపు 30లక్షల రూపాయల వరకు నిధులు స్వాహా అయినట్లు వారు గుర్తించారు. బేగంపేట పోస్ట్ ఆఫీస్ లో పోస్ట్‌మాస్టర్ గా విధులు నిర్వహించేహేమ నకిలీ పాస్ పుస్తకాలు, రశీదులు డిపాజిట్ దారులకు అంటగట్టి వారి ఖాతాలో జమ చేసిన నగదును సొంత అవసరాలకు వాడుకోవడం జరిగింది. ఇంకా డిపాజిట్ దారుల బాధితుల నుండి పూర్తి వివరాలు సేకరించి నివేదికను పై అధికారులకు పంపనున్నట్టు విచారణ చేపట్టిన పోస్ట్ ఆఫీస్ ఇన్‌స్పెక్టర్ మోహన్ తెలిపారు.

## రైతుల అభివృద్ధికి తోడ్పాటు

### సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/ సిద్దిపేటప్రతినిధి :** రైతుకు అయిల్‌ఫామ్‌కు సాగుపై అవగాహనతో పాటు సాగు సమస్యలను పరిష్కరంచటంతో పాటు అభివృద్ధి దిశగా కృషిచేయాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి సూచించారు. ఇకపై ప్రతినెల మండలంలో వ్యవసాయ, ఉద్యాన, అయిల్‌ఫెడ్ సిబ్బంది సమిష్టిగా షెడ్యూల్‌ను రూపొందించుకొని దాని ప్రకారం రైతుల వద్దకు వెళ్లటం, అయిల్‌ఫామ్ సాగుకు ప్రోత్సహించటం, రైతు వేదికల్లో అవగాహన సదస్సులు నిర్వహించటం వంటి కార్యక్రమాలను రూపొందించుకోవాలని తెలిపారు. శనివారం సిద్దిపేట సమీకృత కలెక్టరేట్‌లో అయిల్‌ఫామ్ సాగు విస్తరణపై వ్యవసాయ ,ఉద్యానవన, అయిల్‌ఫెడ్ మండల స్థాయి అధికారుల శిక్షణ సాగు అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ మనుచౌదరి ముఖ్య అతిథిగా దిశ నిర్దేశం చేశారు.కలెక్టర్ మాట్లాడుతూఇతర జిల్లాల నుండి అయిల్‌ఫామ్ సాగు గురించి తెలుసుకోవటానికి మన జిల్లాకు వచ్చేలా సాగు అభివృద్ధి ఆచరణలో సాధించి చూపించాలని ఆకాంక్షించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ జయదేవ్ ఆర్య, జిల్లా వ్యవసాయఇఅధికారి రాధిక, ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, వ్యవసాయ శాస్త్రవేత్త సుబ్బారావు, వ్యవసాయ, ఉద్యాన, అయిల్‌ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.

## విద్యావేత్త నరేందర్‌రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ నజర్

### గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముందు వరుసలో నరేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కోడ్ కూయకముందే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై వాడి వేడి పెరిగిపోతుంది. నోటిఫికేషన్ రాకముందే అధికార కాంగ్రెస్‌లో ఆసక్తికర చర్చ మొదలయ్యింది. అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో ఇప్పటికే ప్రచారంలో ముందు వరుసలో ఉన్న ప్రముఖ విద్యావేత్త డాక్టర్ వి.నరేందర్‌రెడ్డిని సరైన వ్యక్తిగా భావించి ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దల నుంచి పిలుపు వచ్చినట్లు తెలిసింది. నరేందర్‌రెడ్డి గత కొన్ని నెలలుగా ప్రచారంలోకి దిగి తమదైన శైలిలో ప్రచారం చేపడుతూ ముందుకు దూసుకు పోతున్నారు. దీంతో పట్టభద్రుల మండలి పోరులో కాంగ్రెస్ పార్టీ తరపున ఆశావహులలో ముందు వరుసలో నిలిచారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై నజర్ వేసిన అధికార కాంగ్రెస్ పార్టీ పెద్దలు, సీఎం రేవంత్‌రెడ్డి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను కేటాయించే క్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డిపై దృష్టి పడింది. అంతేగాకుండా నరేందర్‌రెడ్డికి ఆయా జిల్లాల్లో పట్టభద్రుల నుంచి సైతం పూర్తిగా మద్దతు పెరుగుతుండడం, పట్టభద్రులను నమోదు చేయడంలోనూ నరేందర్‌రెడ్డి ముందు వరుసలో నిలవడం ఆయనకు కలిసి వచ్చిన అంశంగా భావిస్తున్నారు. పలువురు ఆశావహులు పోటీ పడుతుండడంతో ఈసారి డాక్టర్లు, విద్యావేత్తలు, న్యాయవాదులు, మేధావులు బరిలో ఉం టున్నట్లు ప్రకటించడంతోపట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను కాంగ్రెస్ అధిష్ఠానం ఎంతో చాలెంజ్‌గా తీసుకుని గెలుపు గుర్రాన్ని బరిలో నిలపాలని భావిస్తుంది. కరీంనగర్ పట్టభద్రులనియోజకవర్గం ఎమ్మెల్సీగా విద్యావేత్త నరేందర్‌రెడ్డి అయితే సరైన వ్యక్తి అని భావిస్తున్నట్లుగా తెలిసింది. ఇప్పటివరకు ఎమ్మెల్సీగా కొనసాగుతున్న కాంగ్రెస్ నేత తాటిపర్తి జీవన్‌రెడ్డి పదవీకాలం 2025 మార్చి 29న ముగియనుండడంతో అధిష్ఠానం ఈసారి కొత్త వ్యక్తికిఅవకాశంఇచ్చేఅవకాశాలు మెండుగా ఉన్నట్లుగా ప్రచారం జరుగుతుంది. ఇంకా ఆరు మాసాల సమయం ఉన్నప్పటికీ ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటి నుంచే ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటూ గెలుపు గుర్రాలపై దృష్టి సారించడంతో అక్టోబరులో గ్రాడ్యుయేట్ల నమోదు ప్రక్రియ ప్రారంభం కానుండడంతో ఇప్పటి నుంచే ఆశావహులు సైతం ఎన్‌రోల్‌మెంట్‌పై ఫోకస్ పెట్టడంతో పాటు టికెట్ కోసం పోటీ పడుతున్నారు. ఈ క్రమంలో శనివారం కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపు రావడంతో ఆయన హుటాహుటిన హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లడం చర్చనీయాంశమైంది. నరేందర్‌రెడ్డికి రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలుండడం, తన స్టూడెంట్లు పట్టభద్రులు సుమారు 40 వేలకు పైగా ఉండి ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు సిద్ధంగా ఉండడం ఆయనకు కలిసి వచ్చే అంశం, అందరికంటే ముందుగా నరేందర్‌రెడ్డి ఎమ్మెల్సీ ప్రచార కార్యాలయాన్ని కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్‌లో ప్రారంభించడంతో పాటు ప్రచారంలో దూసుకుపోవడం, పార్టీ టికెట్ ఇచ్చినా ఇవ్వకపోయినా ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించడంతో అధిష్ఠానం నరేందర్‌రెడ్డి వైపు మొగ్గుచూపుతున్నట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు అధిష్ఠానం నుంచి పిలుపు రావడంతో హుటాహుటిన వెళ్లడం ఆయన వర్గీయుల్లో టికెట్ నరేందర్‌రెడ్డికే వస్తుందని చెబుతూనే గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆయన గెలుపు నల్లేరు మీద నడకేనని, భారీ మెజార్టీతో గెలుపొందే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆయన అభిమానులు, పూర్వ విద్యార్థులు, పట్టభద్రులు, పలు విద్యాసంస్థల నిర్వాహకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## నగదు రహిత వైద్య సేవలకు కృషి



**ప్రజాపక్షం/జమ్మికుంట:** ప్రైవేటు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అన్ని ఆసుపత్రులలో నగదు రహిత వైద్య సేవలు అందించే విధంగా శాయశక్తుల కృషి చేస్తానని, రాజ్యాంగంలో కల్పించబడ్డ హక్కులను దరిచేర్చడమే లక్ష్యంగా పనిచేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం జమ్మికుంట పట్టణ కేంద్రంలో పట్టభద్రుల ఓటరు నమోదు అవగాహన కార్యక్రమంలో భాగంగా పలు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. నరేందర్‌రెడ్డికి స్థానిక యువత బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. మహాత్మాగాంధీ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు అనుమతులు ఇచ్చే సమయంలో కఠినతరమైన నిబంధనలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఫైర్ సేఫ్టీ, క్రీడా మైదానాలు, నీటి వసతుల తదితర అంశాలనుఅందించేందుకు కృషి చేస్తానన్నారు. యూత్ నాయకులు అర్జున్, చిరంజీవి, రత్నాకర్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.



## బ్రాహ్మణ వెల్లంలలో కృష్ణమ్మ పరవళ్లు

**ప్రజాపక్షం /నార్కట్ పల్లి :** నకిరేకల్ నియోజకవర్గ రైతుల సాగునీటికి ఆధారమైన నార్కెట్‌పల్లి మండలంలోని బ్రహ్మణ వెల్లంల ఉదయ సముద్ర ప్రాజెక్టుకు గత రెండు రోజుల నుండి పంపుల ద్వారా నీటిని విడుదల చేస్తున్న సందర్భగా శనివారం ప్రాజెక్టును సందర్శించి జలహారతిని నకిరేకల్ ఎంఎల్ఏ వేముల వీరేశం ఇచ్చారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మణ వెల్లంల ప్రాజెక్టు ద్వారా ఒక లక్ష ఎకరాలకు సాగునీరు అందించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు మా నకిరేకల్ నియోజకవర్గ రైతాంగం తరుపున ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలం అధ్యక్షులు బత్తుల ఊషయ్య, మాజీ ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు పాశం శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి దూదిమెట్ల సత్తయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకుల సట్టు సత్తయ్య,ప్రజ్ఞాపురం సత్యనారాయణ, ఎస్‌కె సమ్మద్, ఇడుకుల్లా సంపత్ పాల్గొన్నారు.

## 27న సాయిబాబా సంస్మరణ సభ



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** ఈనెల 27న జిల్లా కేంద్రంలోని సాయి త్రివేణి డిగ్రీ కళాశాలలో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభను విజయవంతం చేయాలని సూర్యాపేట సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ ఎల్ భద్రయ్య, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు తల్లమల్ల హస్సేన్‌లు కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని రైతుబజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల నాయకులతో కలిసి మాట్లాడారు. దేశంలో మతోన్మాద ఫాసిస్ట్ శక్తుల రాజ్యాధికారం చేపట్టిన తరువాత పౌర ప్రజాస్వామ్య హక్కులు అణచివేతకు గురవుతున్నాయన్నారు. ప్రొపెసర్ సాయిబాబా మరణం ప్రజా ఉద్యమాలకు, పీడిత ప్రజలకు తీరని లోటన్నారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు షేక్ అబ్దుల్ కరీం, చామకూరి నరసయ్య, ఎర్ర అఖిల్ కుమార్, రాహుల్ రావు, నారబోయిన వెంకట్ యాదవ్, మాధవరెడ్డి, సురేష్, కళ్యాణి పాల్గొన్నారు.

## జాతీయ తైక్వాండో పోటీలకు ఎన్‌జి కళాశాల విద్యార్థి ఎంపిక



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** నాగార్జున ప్రభుత్వ కళాశాలలో బిఎస్‌సి తృతీయ సంవత్సరం చదువుతున్న వినయ్ పాటిల్ జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డా. సముద్రాల ఉపేందర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల మీద ప్రత్యేక దృష్టి కనబరుస్తున్న నేపథ్యంలో నాగార్జున ప్రభుత్వ కళాశాలలో కూడా విద్యార్థులను క్రీడల్లో ఇతోధికంగా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. త్వరలో అమృత్‌సర్‌లో జరుగనున్న అఖిలభారత తైక్వాండో పోటీల్లో వినయ్ తెలంగాణ రాష్ట్రం తరపున పోటీల్లో పాల్గొంటాడని వ్యాయామ అధ్యాపకులు ఎ. మల్లేశం తెలిపారు. ఈ మేరకు వినయ్‌ని ప్రత్యేకంగా అభినదించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. పిల్లి సురేష్ బాబు, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. పరంగి రవి కుమార్, పరీక్షల నియంత్రణాధికారి బి. నాగరాజు, తెలుగుశాఖ అధ్యక్షులు డా. వెల్దండి శ్రీధర్, ఆంగ్ల విభాగం అధ్యక్షులు డా. ప్రసన్న కుమార్, అర్థశాస్త్ర విభాగం అధ్యక్షులు డా. ముని స్వామి, వాణిజ్యశాస్త్రం అధ్యక్షులు డా. నాగరాజు, ఎన్‌సిసి ఆఫీసర్ సిహెచ్ సుధాకర్, తైక్వాండో శిక్షకులు ప్రణీత్ ఇతర అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన వెంకన్న యాదవ్

**ప్రజాపక్షం/సూర్యాపేట:** రైతుల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్ అన్నారు. శనివారం హైద్రాబాద్‌లోని



బూర్గుల రామకృష్ణ భవన్‌లో రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తం రెడ్డిల సమక్షంలో రైతు కమిషన్ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రముఖులు ఆయనకు పుష్ప గుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## పరిశ్రమపై వచ్చిన వ్యతిరేకతపై వాస్తవ నివేదిక సమర్పించాలి

**ప్రజాపక్షం/ రామన్నపేట:** అంబుజా అదాని సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని 23న నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన పూర్తి స్తాయి నివేదికను యదావిధిగా పంపించి పరిశ్రమ ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం జిల్లా కలెక్టర్ హనుమంత్ కెజండగిని కోరారు. శనివారం రామన్నపేట పర్యావరణ వేదిక, అఖిలపక్షం నాయకులతో కలిసి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి పరిశ్రమ ఏర్పడితే కాలుస్యంతో ప్రజలు ఇబ్బంది పడే ప్రమాదం ఉందని అన్ని గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించారని వచ్చిన ప్రజాభిప్రాయ సేకరణను వాస్తవికంగా పంపిస్తే పరిశ్రమ ఏర్పడదన్నారు. రామన్నపేట మండల ప్రజల పక్షాన నిలబడ్తానని హామి ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేక అశోక్‌రెడ్డి, పర్యావరణ పరిరక్షణ వేదిక మండల కన్వీనర్ జల్లెల పెంటయ్య, కోకన్వీనర్ ఎండి.రేహాన్, నాయకులు జినుకల ప్రభాకర్, నాయకులు పల్లపు దుర్గయ్య, ఉట్కూరి నరసిహా, ఫజల్‌బేగ్, బోయిని ఆనంద్, ఎండి.అక్రమ్, కందుల హనుమంతు, జమీరొద్దిన్, గురుకు శివ, సుక్క శ్రవణ్, గుండాల భిక్షం పాల్గొన్నారు.



## మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటే చరిత్ర హీనులుగా మిగిలిపోతారు

### కాళేశ్వరానికి ఒక న్యాయం మూసీకి ఒక న్యాయమా

### మూసీనది పునరుజ్జీవ ప్రజా చైతన్య యాత్రలో ఎంపి కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి తలపెట్టిన మూసీ ప్రక్షాళన పునర్జీవం బృహత్ర ప్రణాళిక ప్రాజెక్టును అడ్డుకుంటే ఎవరైనా చరిత్ర హీనులుగా మిగిలిపోతారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిలు హెచ్చరించారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మూసీ నది ప్రక్షాళన కోసం ప్రజాభిప్రాయం సేకరణ పేరిట తలపెట్టిన ప్రజా చైతన్య పాదయాత్రలో భాగంగా జరిగిన కార్యక్రమంలో వారు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, డిసిసి అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి కార్యకర్తలతో పాదయాత్రను ప్రారంభించి పిల్లాయిపల్లి గ్రా మంలో పరివాహక ప్రాంతంలో ప్రవహిస్తున్న మూసీని సందర్శించారు. పార్టీలకతీతంగా వేలాదిగా ఇరు మండలాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దక్షిణ కోరియా రాజధాని సియోల్ నగరంలో ఉన్న కొన్ని నదులను పునరుజ్జీవం చేసిన విధానాన్ని రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారులతో పాటు అయిదు రోజుల పర్యటనలో అధ్యయనం చేసిన తర్వాత మూసీ నది ప్రక్షాళన పెద్ద విషయమేమీ కాదని అవగాహన కల్పించారు. పిల్లాయిపల్లి నుంచి మక్తా అనంతరం వరకు మూసి ప్రక్షాళన చేయాలని రైతులు, కులవృత్తి దారులు మహిళలు, పార్టీలకు అతీతంగా కార్యకర్తలు నాయకులతో కలిసి మూసి బ్రిడ్జి మీద అవగాహన యాత్రలో ప్రజలు వివిధ పార్టీ నాయకులు బ్రహ్మరథం పట్టారు.

కాళేశ్వశ్వరం ప్రాజెక్టుకు ఒక న్యాయం మూసీ నది ప్రక్షాళనకు ఒక న్యాయమా: ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కమిషన్లతో వెనకేసుకోవాలని లక్షల కోట్లు ఖర్చుపెట్టి కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక న్యాయం ప్రజల రైతుల కష్టాలు తీర్చేందుకు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు చేసే ఈ కార్యక్రమానికి నాంది పలుకుతుంటే అడ్డుపడడం ఇదెక్కడి న్యాయమని అని ప్రశ్నించారు. కెసిఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు డీపీర్ లు లేకుండా కట్టి ఆగం చేశారని రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారనీ తీవ్రంగా ఆయన దుమ్మెత్తి పోశారు.మూసి నదిని పీపీపీ ప్రైవేట్ పబ్లిక్ ప్రాపర్టీ ద్వారా ప్రక్షాళన చేసి నదికి ఇరువైపులా శాపింగ్ మాల్స్ కట్టాలనే ఉదేశ్యం లో సీఎం రేవంత్ రెడ్డి ప్రజల కోసం పనిచేస్తున్నారని పునరుద్ఘాటించారు.ప్రతిపక్షాలు మాత్రం ప్రజల కడుపు గొట్టే విధంగా సోషల్ మీడియాలో ప్రభుత్వం పై విష ప్రచారం చేస్తున్నాయనీ తీవ్రంగా ధ్వజమెత్తారు. హైదరాబాద్,రంగారెడ్డి, ఉమ్మ డి నల్గొండ జిల్లాల ప్రజల యొక్క మురికి నీళ్ల కష్టాల్ని తీర్చాలని మూసి నది పరివాహక ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలు, చేతి వృత్తుల వాళ్ళు మురికి కూపంలో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దక్షిణ కొరియా రాజధాని సీయోల్ నగరంలో ఉన్న నదులు వాటి ప్రక్షాళన చేసిన విధానం, వేస్ట్ చెత్త నుండి విద్యుత్ ఉత్పత్తి తదితర వనరుల పునర్వినియోగంపై అక్కడి రివర్ ఫ్రంట్ అధికారులతో చర్చలు సమావేశాలు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మూసీ నది ప్రక్షాళన ఎవరైనా అడ్డుకున్న రైతులకు ప్రజలకు కుల వృత్తులకు కష్టాలు ఇబ్బందులు కలిగించిన కన్నీళ్లు తెప్పించిన ఊరుకునేది లేదని ఖబర్దార్ అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్ మేడ్చల్ ఇన్చార్జి వజ్రేష్ యాదవ్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి డిసిసి ఉపాధ్యక్షులు సామ మధుసూదన్ రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షులు పకీరు నర్సిరెడ్డి కాసుల అంజయ్య, భారత లవ కుమార్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, సూరెపల్లి రమేష్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లాలోని ముఖ్య నాయకులు, భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు,మాజీ ప్రజా ప్రతినిధులు, రైతులు, మహిళ రైతులు, మూసీ నదిపై ఆధారపడి జీవనం సాగించే చేతువృత్తుల వాళ్ళు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## పకడ్బందీగా పశుగణన

### కలెక్టర్ కె.హన్మంత్ జెండగే

**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లాలో 21వ అఖిల భారత పశుగణను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హన్మంత్ జెండగే అన్నారు. శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా పశువైద్య, పశు సంవర్ధక అధికాని డాక్టర్ వి.కృష్ణ, మండలాల పశు వైద్యాధికారులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ బి.శివరామకృష్ణ, ఔ సంతోష్, డాక్టర్ అనిల్ కుమార్‌లతో కలిసి పశుగణన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పశుగణన సర్వే నాలుగు నెలల పాటు ఉంటుందని వచ్చే ఏడాది ఫిబ్రవరి, 25 వరకూ కొనసాగుతుందనీ, శిక్షణ పొందిన 130 మంది ఎన్యూ మరేటర్లు జిల్లాలోని ఆరు మునిసిపాలతలు, (17) మండలాలలోని (421) గ్రామ పంచాయితాలు మరియు వాటి శివారు గ్రామాలు అన్నింటిలోనూ, ఇల్లు ఇల్లు తిరిగి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, ఎందులు కుక్కలు, బాతులు, కోళ్ళు, గాడిదలు, గుర్రాలు మొదలైన వాటి సంఖ్య వివరాలు సేకరించి, మొబైల్ యాప్ ద్వారా అనేక్‌లో పొందు పరుస్తారనీ చెప్పారు. కాబట్టి పశుపోషకులు వారి వద్దకు వచ్చిన ఎన్యూమరేటర్లకు సవహకరించి, ఎశువుల వివరాలను తెలుపవలసిందిగా జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులకు భోజనం, బట్టలు పుస్తకాలు



### విద్యాశాఖ అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ

### పాఠశాల పనులను పర్యవేక్షించే బాధ్యతను సిసికి అప్పగించిన కలెక్టర్ నారాయణ రెడ్డి

**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్:** నిత్యం పరిపాలన వ్యవహారాలలో బిజీగా ఉండే జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి జిల్లాకు వచ్చిన వెంటనే విద్య, వైద్యం పై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే తను ఎక్కడ పర్యటనకు వెళ్లినా తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రులను, పాఠశాలలను తనిఖీ చేయడం ఆయన అలవాటు చేసుకున్నారు. ఈ క్రమంలో గత నెల 24 న నల్లగొండ జిల్లా కేంద్రంలోని బోయవాడలో ఉన్న ప్రభుత్వ పట్టణ రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ చదువుకుంటున్న విద్యార్థులతో మాట్లాడారు. ఆయన పాఠశాలను సందర్శించినప్పుడు పాఠశాలలో పెచ్చులూడిపోయి ,రంగులు వెలిసిపోయి, వైర్లు వేలాడుతూ, కిటికీల పక్కనే ఉన్న ముళ్ల పొదలు ,టాయిలెట్ నీరు బయట పారుతు, కిచెన్ సరిగా లేక, క్లాస్ రూమ్ లలో సరైన బెంచీలు, వసతులు లేక, అలాగే విద్యార్థులకు యూనిఫామ్, చదువుకునేందుకు పుస్తకాలు ,దుప్పట్లు లేని సమస్యలు దర్శనమిచ్చాయి. అంతేకాక భోజనం సైతం నాణ్యతగా లేక, మెనూ ప్రకారం భోజనం లేక విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా ఆ రోజు విద్యార్థులే జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకురావడం జరిగింది. ఇవన్నీ చూసి చలించిపోయిన జిల్లా కలెక్టర్ తక్షణమే పాఠశాల పరిస్థితులలో మార్పులు రావాలని, పాఠశాలకు మరమ్మతులు చేపట్టాలని, టాయిలెట్లు మరమ్మతులు చేయించడమే కాకుండా, వేలాడుతున్న వైర్లను సరిచేసి ట్యూబ్ లైట్లు,ఫ్యాన్లు ఏర్పాటు చేయించి, కలర్లు వేయించి విద్యార్థులకు సరిపడా భోజనం ఏర్పాటు చేయాలని, బట్టలు, పుస్తకాలు వెంటనే ఇవ్వాలని విద్యాశాఖ అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. వీటిని అమలు చేయకపోతే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. విద్యార్థులకు ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు, పాఠశాల పనులను పర్యవేక్షించే బాధ్యతను తన సీసీకి అప్పగించారు. తాను ఇచ్చిన హామీ ఎంతవరకు అమలు అయ్యిందో తెలుసుకునేందుకు తిరిగి జిల్లా కలెక్టర్ శనివారం బోయవాడ పట్టణ రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేశారు. అయితే గత నెలకి, ఈ నెలకు పాఠశాల రూపు రేఖలు మారిపోయాయి. పాఠశాలలో అడుగుపెట్టినప్పటి నుండి అన్ని వైపులా మార్పు స్పష్టంగా కనిపించింది. మధ్యాహ్న భోజనం సమయంలో తనిఖీకి వెళ్లిన జిల్లా కలెక్టర్ విద్యార్థులతో భోజనం గురించి ఆరా తీయగా, గతంలో కంటే ఇప్పుడు భోజనం బాగా పెడుతున్నారు అన్న సమాధానం విద్యార్థుల నుంచి వచ్చింది. అంతే,కాక పాఠశాలలోని అన్ని తరగతి గదులు ,పై అంతస్తులోని హాలు మరమ్మతులు చేయించడమే కాకుండా, వైర్లు సరి చేయించి అన్ని గదులలో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు వేయించడం, రంగులు వేయించడం, అలాగే టాయిలెట్స్ మరమ్మతులు చేయించి వంటగది అన్ని శుభ్రంగా ఉండడం గమనించిన జిల్లా కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. తాము అడిగిన వెంటనే అన్ని సౌకర్యాలు కల్పించి బాగా చదువుకునేందుకు అవకాశాలు కల్పించిన జిల్లా కలెక్టర్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇంకా పాఠశాలలో ఏవైనా మరమ్మతులు చేపట్టాల్సి ఉంటే చేయాలని, విద్యార్థులు చదువుకునేందుకు అన్ని రకాల సౌకర్యాలు ఉండాలని ,అప్పుడే వారు బాగా చదువుకొంటారని కలెక్టర్ అన్నారు.



## శాంతి భద్రతల పరిరక్షణలో నిరంతరం కృషి

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రజా సంక్షేమం కొరకు శాంతి భద్రతల పరిరక్షణలో నిరంతరం కృషి చేస్తుందని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ అన్నారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలాలో భాగంగా శనివారం నల్లగొండ పట్టణ కేంద్రంలో నిర్వహించిన బైక్ ర్యాలీని జిల్లా ఎస్పి ప్రారంభించారు. ఈ ర్యాలీ జిల్లా పోలీస్ కార్యలయంలోని అమరవీరుల స్థూపం వద్ద నుండి ప్రారంభమై క్లాక్ టవర్, గుండగోని మైసయ్య గౌడ్ విగ్రహం,ప్రకాశం బజార్, వయా డిఈఓ కార్యాలయం నుంచి క్లాక్ టవర్ వరకు పోలీసు సిబ్బంది పట్టణ యువకులతో ఉత్సాహంగా కొనసాగింది. అనంతరం ఎస్పి మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న ఫ్లాగ్ డే నిర్వహిస్తున్నామని తెలిపారు. వారి త్యాగాల గుర్తుగా అమరవీరుల వారోత్సవాలు జరుపుకుంటున్నామని,దీనిలో భాగంగా పట్టణ కేంద్రంలో ఎందరో అమరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి రాములు నాయక్, ఎస్‌బి డిఎస్పి రమేష్, నల్లగొండ డిఎస్పి శివరాంరెడ్డి, ఏఆర్ డిఎస్పి శ్రీనివాసులు, సిఐలు రాఘవరావు, రాజశేఖర్ రెడ్డి, డానియల్, సైదులు, నాగరాజు, కొండల్ రెడ్డి, ఆర్ఐలు సంతోష్, శ్రీను, సూరప్ప నాయుడు, ఎస్ఐలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేట మున్సిపాలిటీ కృషి అభినందనీయం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** సాలిడ్ వెస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణలో సూర్యాపేట మున్సిపాలిటి కృషి అభినందనీయమని మహబూబ్‌బాద్, నాగర్ కర్నూల్ జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు అన్నారు. శనివారం రాష్ట్ర పురపాలక పరిపాలన సంచాలకులు ఆదేశాలతో నూతన పారిశుధ్య విధానంపై మహబూబ్‌బాద్, నాగర్ కర్నూల్ జిల్లాలోని కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్, నాగర్ కర్నూల్, డోర్నకల్, తొర్రూర్, మరిపెడ మున్సిపల్ కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్లు సందర్శించారు. పుల్లారెడ్డి చెరువు సమీపంలోని మురికి నీటిని శుద్ధి చేసే ప్లాంట్‌ను పరిశీలించి అక్కడ ఉన్న ఇంజనీర్లను పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనతరం బాలెంల డంపింగ్ యార్డును సందర్శించి యార్డులో నిర్వహిస్తున్న సెమి ఆటో మీటర్ సాలిడ్ వెస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్, మిక్సుడ్ వెస్ట్ చెత్తను సెగ్రిగ్రేషన్, వేరు చేసిన చెత్తను స్టోరేజ్ విధానాన్ని పరిశీలించారు. అనంతరం జమున నగర్ డంపింగ్ యార్డులో తడి, పొడి చేత్తను వేరు చేసి సేంద్రియ ఎరువుల తయారీ, వానపాములు ఉత్పత్తి అయ్యే విధానంను అధ్యాయనం చేశారు. ప్లాస్టిక్ వెస్ట్ క్యారీ బ్యాగులను శుద్ధి చేసి గ్రైడింగ్ చేసి ప్లాస్టిక్ షడ్డర్ మిషన్ ద్వారా ముడి పదార్ధంగా చేసి తయారు చేసిన టైల్స్, ఇటుకల తయారీని చూశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, కమిషనర్ బి శ్రీనివాస్, సందర్శనకు వచ్చిన మున్సిపల్ కమిష ర్లు శ్యాంసుందర్, శ్రీనివాస్, నరేష్ బాబు, రవీంద్ర యాదవ్, నరేష్ రెడ్డి, శాంతికుమార్, వెంకటస్వామి, డిఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, బూర సతీష్, ఏఈ శివప్రసాద్, జూనియర్ అసిస్టెంట్లు ఎండి గౌసుద్దీన్, ఎస్ఎస్ఆర్ ప్రసాద్, యాదగిరి, ఇండ్ల మనోజ్, శివ శంకర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలందించాలి

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట:** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా వైద్య సేవలు అందించాలన్నారు. మాత శిశు సంక్షరణ కేంద్రం పరిశీలించి ప్రసవాలు రోజువారీగా, నెల వారీగా ఎన్ని అవుతున్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మాత శిశు సంరక్షణ కేంద్రం పరిశీలించి ప్రసవాలు రోజు వారీగా, నెల వారీగా ఎన్ని అవుతున్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మాత శిశు సంరక్షణ కేంద్రానికి వచ్చే పెషేంట్స్ వివరాలను అన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రసూతి కోరకు తీసుకొచ్చిన ఆశ కార్యకర్తలతో కలెక్టర్ మాట్లాడి వారికి అందుతున్న సేవల గురించి అడిగి తెసుకున్నారు. అనంతరం చైల్డ్ కేర్ సెంటర్‌ను పరిశీలించి తక్కువ బరువుతో పుడుతున్న బేబిలకు, పచ్చకామెర్లు వచ్చిన బేబిలకు, నెలలు రాకముందు పుట్టిన బేబిలకు అందిస్తున్న చికిత్సను అడిగి తెలుసుకున్నారు. ఊపిరితిత్తులలో నిమ్ముతో ఇబ్బంది పడుతున్న మరియమ్మతో కలెక్టర్ మాట్లాడి అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. ఓపి, ఐపి, రిజిస్టర్లు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. జనరల్ ఆసుపత్రి ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న భవన పనులను పరిశీలించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట రెసిడెన్సీ మెడికల్ అధికారి డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ సంధ్య, డాక్టర్ ప్రశాంతి, సిబ్బంది ఉన్నారు.



## రక్తదానం... ప్రాణదానంతో సమానం : ఎస్పి

**ప్రజాపక్షం/సూర్యాపేట:** అత్యవసర సమయంలో క్షతగాత్రులకు రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని జిల్లా ఎస్పి సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. శనివారం పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల అమరవీరుల త్యాగాల అపస్మారకంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసుల త్యాగాలు, బలిదానాలను ప్రజలు గుర్తించి శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలన్నారు. రక్తదాన శిబిరానికి పెద్ద ఎత్తున తరలి వచ్చిన యువతకు అభినందనలు తెలిపారు. తలసేమియా పిల్లలకు ఉపయోగపడే విధంగా తలసేమియా పరిరక్షణ స్వచ్ఛంద సంస్థ వారు దాతల నుండి రక్తాన్ని సేకరించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో యువత, పోలీస్ సిబ్బంది సుమారు 200 మందిరక్తదానం చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పిలు నాగేశ్వర్ రావు, జనార్ధన్ రెడ్డి, ఎఆర్ డిఎస్పి నరసింహ చారి, సూర్యాపేట డిఎస్పి రవి, ఆర్ఐ నారాయణ రాజు, సిఐలు రాజశేఖర్, సురేందర్ రెడ్డి, శ్రీనివాస్, రఘువీర్ రెడ్డి, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



**పోలీసు కుటుంబాలకు బాసటగా భద్రత స్కీం**

సూర్యాపేట జిల్లా ఎస్పి సన్‌ప్రీత్ సింగ్

పోలీసుల కుటుంబాలకు పోలీస్ భద్రత స్కీం బాసటగా నిలుస్తుందని జిల్లా ఎస్పి సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో పని చేస్తున్న కానిస్టేబుల్ కోటేశ్వర్ రావు అకాల మరణంతో పోలీస్ భద్రత స్కీం ద్వారా ఆయన కుటుంబ సభ్యులకు రూ. 8లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమం కోసం పోలీస్ శాఖ ఎప్పుడు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి నాగేశ్వర్ రావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు, పోలీసు సంఘం సభ్యులు వెంకన్న, సెక్షన్ సూపరింటెండెంట్ విజయ్, సిబ్బంది ఉన్నారు.



## అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

### 8తులాల బంగారం, 15తులాల వెండి పట్టివేత

### నాలుగు ద్విచక్రవాహనాలు, నాలుగు ట్రాక్టర్ టక్కులు స్వాధీనం

**ప్రజాపక్షం/కోదాడ:** తాళం వేసి ఉన్న ఇల్లే టార్గెట్‌గా చేసుకుని వివిధ ప్రాంతా ల్లో దొంగతనాలు చేస్తున్న అంతరాష్ట్ర దొంగలను కోదాడ పోలీసులు పట్టకున్నారు. శనివారం



కోదాడ డిఎస్పీ కార్యాలయంలో డిఎస్పీ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మేళ్లచెరువు మండలం రామాపురం బొమ్మల సెంటర్ వద్ద మేళ్లచెరువు ఎస్ఐ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న అనుమానస్పద స్థితిలో ఉన్న ఇద్దరు నేరస్తులు చిక్కారు. పట్టుపడ్డ వారు గరిడేపల్లి మండలం సర్వారం గ్రామానికిచెందినతమ్మడపల్లి సైదులు, పల్నాడు జిల్లా గురజాలకు చెందిన పిన్నబోయిన నాగేశ్వరరావులను విచారించగామాతో కలిసి దొంగతనాలకు పాల్పడ్డ ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన మట్టపోతుల దుర్గ, కంచికచర్లకు చెందిన నల్లూరి నర్సింహరావులని తెలిపారు. కాగా ఈ ఇద్దరిని వివిధ చోట్ల దొంగలించిన బంగారంను అమ్మటానికి జగ్గంపేట వెళ్తుండగా పోలీసులు టార్గెట్ చేసి పట్టుకున్నారు. నేరస్తుల నుండి దొంగలించిన బంగారు ఆభరణాలు సుమారు 8 తులాలు, వెండి 15 తులాలు, 4 ద్విచక్ర వాహనాలు, నాలుగు ట్రాక్టర్ ట్రక్కులు స్వాదీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అంతరాష్ట్ర దొంగల కేసును చాకచాక్యంగా చేదించిన కోదాడ సిఐ రజితారెడ్డి, మేళ్లచెరువు ఎస్ఐ పరమేష్, హెడ్ కానిస్టేబుల్ జూకురి నరహరి, కత్తుల రాంబాబు, నాగేశ్వరరావు, మేళ్లచెరువు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుళ్లను డిఎస్పీ అభినందించారు.

# 21వ అఖిల భారత పశుగణన ప్రారంభం

ప్రతి గ్రామములోని 16 రకాల జంతు జాతుల గణన

కలెక్టర్ క్రాంతి వల్లూరు

**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి:** 21వ అఖిల భారత పశుగణనను శనివారం నాడు సంగారెడ్డి కలెక్టరు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1919 సంవత్సరంలో ప్రారంభమైన అఖిల భారత పశు గణన కార్యక్రమము ప్రతి ఐదు సంవత్సరాలకు ఒక్క సారి ప్రతి గ్రామములోని 16 రకాల జంతు జాతులను, కోళ్లను లెక్కిస్తారని, పశువుల గణన ద్వారా పాల ఉత్పత్తి, మాంసోత్పత్తి, గ్రుడ్ల ఉత్పత్తి, ఉన్ని ఉత్పత్తి, కూడ తెలుస్తుందన్నారు. తద్వారా సగటు వినియోగము ఎగుమతులు, దిగుమతులు తదితర వివరాలు ,పశువులకు కావాల్సిన టీకాల, మందుల సరపరా ఈ పశుగణన ద్వారా నిర్ధారించవచ్చునన్నారు. మందుల ఉత్పత్తి పరిశోధన బడ్జెట్ అంచనా ప్రభుత్వం తయారు చేస్తుదని తెలిపారు. సంగారెడ్డిలోని ఇట్టి పశు గణన కోసం 131 ఎనుమేరటర్లు, 33 సూపర్‌వైజర్లు నియమించారని తెలిపారు. ప్రతి మండలం, ప్రతి గ్రామములో పశుగణన కార్యక్రమాన్ని ఇంటి ఇంటికి వచ్చి పశుగణన సమాచారాన్ని మన పశువైద్య బృందం సేకరిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరు కూడ మా పశువైద్య బృందంనకు సహకరించి మీ దగ్గర ఉన్న సమాచారాన్ని ఇవ్వగలరని కలెక్టర్ కోరారు. ఎన్యూమెరేటర్లు, సూపర్వైజర్లు పశు వైద్య సిబ్బంది అన్ని గ్రామాలలో ఇంటింటికి తిరిగి సరైన



సమాచారము సేకరించి ఎప్పటి కప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని నిర్ణీత కాలములో పశుగణన కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డా. వసంతకుమారి, సహాయ సంచాలకులు, డాక్టర రవీంద్ర ప్రసాద్, డా.రాజేశ్వర్, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ పవన్ కుమార్, విఏఎస్ డాక్టర్ శ్రీరాం, చరణ్ దాస్, డాక్టర్ అనుష, సిబ్బంది పాల్గొన్నారు.

## చెకుముకి సైన్స్ సంబరాలు 2024 పోస్టర్ల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాల 2024 పోస్టర్లను జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు చేతుల మీదుగా ఆవిష్కరించారు. బాలబాలికల విద్యా, విజ్ఞానం, వికాసం కోసం నవంబర్ 7న పాఠశాల స్థాయి, నవంబర్ 21న మండల స్థాయి నవంబర్ 28న జిల్లాస్థాయిల్లో సైన్స్‌టెస్ట్ (సంబురాలు) నిర్వహించటం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు రాష్ట్రస్థాయి పోటీలు డిసెంబర్ 14,15, 16 తేదీల్లో ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించటం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పులి జైపాల్, గౌరవ అధ్యక్షులు బాస రాజేశ్వర్, ఉపాధ్యక్షులు శ్రీహరి ఆచార్య, తుక్కడి నారాయణ, కోశాధికారిపండరి, న్యాయవాదులు శంకర్, కృష్ణ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నుండి బిజెపిలో చేరిక



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు గరుగుల సుధాకర్, కోమ్మట అమర్, కొమ్మట ఎల్లం పంజా కుమార్ శనివారం రోజున చల్మేటి నరేందర్ ఆధ్వర్యంలో మెదక్ ఎంపి రఘునందన్ రావు చేతుల మీదుగా పార్టీ కండువా కప్పి పార్టీ లోకి సాధారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బిజెపి పార్టీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశానికి చేస్తున్న సేవల కు ఆకర్షితులై పార్టీలోకి రావడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పంజా విజయ్ కుమార్, బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు సిద్దరాంరెడ్డి, బూత్ అధ్యక్షులు జాల పోచయ్య, బాబు, అబ్దుల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అమరులైన పోలీసు కుటుంబాలకు జ్ఞాపికలు అందజేత



**ప్రజాపక్షం/పటాన్‌చెరు :** పోలీసు ఫ్లాగ్ డే వారోత్సవాలలో భాగంగా తెలంగాణ రాష్ట్ర డిజిపి డా. జితేందర్ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లాలో అమరులైన పోలీసు అమరుల కుటుంబ సభ్యులను పరామర్శించి జ్ఞాపికను డి.పి.జి జితేందర్ అందజేసారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు ఇన్స్‌పెక్టర ప్రవీణ్ రెడ్డి వారి కుటుంబ సభ్యులకు పోలీసు తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామిచ్చారు.

## అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు పట్టివేత



**ప్రజాపక్షం/మనోహరాబాద్:** కొండాపూర్ గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లు,హిటాచీలు,పలు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు సిఐ రంగా కృష్ణ,ఎస్ఐ సుభాష్ గౌడ్ లు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొండాపూర్ గ్రామ శివారులో గల టీఎస్ఐఐసి కి సంబంధించిన భూమిలో కొండాపూర్, ఇతర గ్రామాలకు సంబంధించిన వ్యక్తులు 10 టిప్పర్లు, 5 హిటాచీలు, మరికొన్ని ట్రాక్టర్ల పెట్టి అధిక లాభానికి మట్టిని తరలిస్తూ అమ్ముకుంటున్నారని టీఎస్ఐఐసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం అర్ధరాత్రి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని వాహనాలను సీజ్ చేసి పలువురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ కృష్ణ మాట్లాడుతూ, చట్టా వ్యతిరేకంగా అనుమతులు లేకుండా అక్రమ మట్టి వ్యాపారం చేస్తే ఎంతటి వారికైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/నిజాంపేట్:** నిజాంపేట మండల పరిధిలోని తిప్పనగుల్ల గ్రామంలో చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. తిప్పనగుల్ల గ్రామానికి చెందిన శ్రీమతి బొమ్మ ఐలవ్వ భర్త శివమల్లు వయసు 45 సం॥ గ్రామంలో వ్యవసాయం చేసుకుంటే జీవిస్తాడు. శివమల్లు అప్పుడప్పుడు చేపల వేటకు వెళుతూ ఉంటాడు. అదే మాదిరిగా శుక్రవారం రోజు సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఇంటి నుండి తన గ్రామ శివారులోని హైదర్ చెరువు వద్దకు చేపల వేట వెళుతున్నానని వెళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో తన భార్య అతని బంధువులు చెరువులో వెతుకుతుండగా శనివారం ఉదయం 7:30 బొమ్మ శివమల్లు చనిపోయి కనిపించినాడని తన భర్త చెరువులో చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి చనిపోయినాడు.

అని భార్య అయిలవ్వ ఇచ్చిన దరఖాస్తు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ రెడ్డి తెలిపారు

## ఎడ్యుకేషనల్ హబ్‌గా జుక్కల్

ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** జుక్కల్ నియోజకవర్గం ఎడ్యుకేషనల్ హబ్‌గా రూపుదిద్దుకుంటోందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. ఆయన ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చేందుకు కృషిచేస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఐటీఐ కళాశాలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 ఐటీఐ కళాశాలలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, కామారెడ్డి జిల్లాలో కేవలం బిచ్కుంద ఐటీఐ కళాశాలకు మాత్రమే ఈ అవకాశం రావడం పట్ల ఎమ్మెల్యే పట్టుదల కృషి ఎంతో ఉంది. ఈ కళాశాలలో కోర్సులు పూర్తి చేసిన వారికి ఉద్యోగం, ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయి. అందువలన 10వ తరగతి ఉత్తీర్ణులైన ప్రతీ ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కోరారు. పూర్తి వివరాల కొరకు సెల్ 9866757695 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

## ఎకో టూరిజం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ డ్యాం వద్ద ఎకో టూరిజం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. నిజాంసాగర్ మండలంలోని నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద ఎకో టూరిజం పనులకు సంబందించిన వాటిపై టూరిజం అసిస్టెంట్ మేనేజర్ రాజు, కన్సల్టెంట్ హరిలతో కలెక్టర్ మాట్లాడారు. ప్రతిపాదించిన పనులను సంబందించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. టూరిజం డిపార్టుమెంట్‌కు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించడం జరిగిందన్నారు. ఈ భూమికి సంబందించిన పనులను వెంటనే ప్రారంభించాలని తహసీల్దార్ బిక్షపతిని కలెక్టర్ ఆదేశించారు.

## నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

అధికారులకు ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి:** మెదక్ నియోజకవర్గ అభివృద్ధికి శాఖల వారీగా మౌలిక వసతుల కల్పన పై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మెదక్ నియోజకవర్గ అభివృద్ధి పరిచేందుకు శాఖల వారీగా ప్రతిపాదనలు తయారు చేయడంపై ఇరిగేషన్, ఆర్ అండ్ బి, దేవాదాయ, వైద్య, మున్సిపాలిటీ, టూరిజం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ప్రథమ స్థానంలో నిలపాలని మెదక్ జిల్లా శాసనసభ్యులు అహర్నిశలు కృషి చేస్తున్నారని జిల్లా అభివృద్ధిపై శాఖల వారీగా ప్రతిపాదనలు తయారుచేసి అందించిన పక్షంలో రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని సూచించారని చెప్పారు. ఈ సందర్భంగా అధికారులతో సమావేశమై నియోజకవర్గ అభివృద్ధిపై ప్రతిపాదన సిద్ధం చేసే దిశగా చర్చిస్తున్నట్లు చెప్పారు. మెదక్ ఎంట్రన్స్ వెల్కమ్ బోర్డు సరికొత్త ఆలోచనలతో



మెదక్ అంటే మెతుకు సీమ బియ్యం గింజ బ్యాక్ గ్రౌండ్ వచ్చే విధంగా చూపరులను ఆకట్టుకునే విధంగా తయారు చేయించాలన్నారు. యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్స్ ఏర్పాటు చేయడంతో పాటు ఈ సెంటర్లో కుక్కల, కోతులజంతు జనన నియంత్రణ చర్యలు చేపట్టడం, వైద్య కళాశాల ప్రాంగణంలో హాస్పటల్, స్టాఫ్ క్వార్టర్స్ సిబ్బంది వసతి గృహాలు, ఎస్టిమేట్స్ సిద్ధం చేయడం, టూరిజం అభివృద్ధి ఏడుపాయల వనదుర్గ దేవాలయానికి సంబంధించి రోడ్డు వైడింగ్, హోటల్ కం టూరిజం గెస్ట్ హౌస్, మెయిన్ రోడ్ నుంచి టెంపుల్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, పార్కింగ్ స్థలాలు,మెదక్ చర్చి, సంబంధించి వచ్చే డిసెంబర్ నాటికి చర్చి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుని సెలబ్రేషన్స్ నిర్వహించడం జరుగుతుందని చర్చి పరిసర ప్రాంతాలలో ప్రభుత్వ పరంగా మెదక్ చర్చి ప్రాంగణం లో సభ్యులతో సమన్వయంతో అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. మెదక్ బస్టాండ్ మోడ్రనైజేషన్, సరికొత్త ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్, మున్సిపాలిటీ పరిధిలో చిల్డ్రన్స్ పార్క్, ఇరిగేషన్ చెరువులు మినీ ట్యాంక్ బండ్స్, మెదక్ పోర్ట్ అభివృద్ధి, పంచాయతీరాజ్ ఆర్ అండ్ బి బ్రిడ్జెస్, యువజన క్రీడల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసే దిశగా నివేదిక తయారు చేయాలన్నారు. మౌలిక సదుపాయాలు కల్పనతో జిల్లా అభివృద్ధి ఇతర జిల్లాలతో పోటీ తత్వంలో ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి పంచాయతీరాజ్, ఇరిగేషన్, దేవాదాయ వైద్య, తదితర శాఖల అధికారులు ఉన్నారు.

## బిసి కమిషన్ పర్యటనలో పకడ్బంధీ ఏర్పాట్లు



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** రాష్ట్రంలో స్థానిక సంస్థల వారిగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమీషన్ ప్రతినిధులు బృందం ఈనెల 29న నిజామాబాద్‌కు విచ్చేయనున్న నేపథ్యంలో పకడ్బంధీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్‌కుమార్ అధికారులకు సూచించారు. బీసీ కమీషన్ పర్యటనను పురస్కరించుకుని శనివారం ఐడీఓసీలో సంబంధిత అధికారులతో సన్నాహాక సమావేశం నిర్వహించి అదనపు కలెక్టర్ కిరణ్కుమార్ ఆయా శాఖల అధికారులకు వారు నిర్వర్తించాల్సిన విధులపై వివరిస్తూ బాధ్యతలను పురమాయించారు. నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఈనెల 29న నిజామాబాద్‌లోని సమీకృత జిల్లా కార్యాలయల సముదాయం (కలెక్టరేట్)లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కమీషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలోని బీసీ కమీషన్ స్థానిక సంస్థలలో రిజర్వేషన్ల దామాషాపై అభిప్రాయాలు సేకరిస్తుందన్నారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు జిల్లాకు సంబంధించిన వారు భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కామారెడ్డి జిల్లాకు చెందిన వారు వ్రాతపూర్వకంగా తమ అభిప్రాయాలను కమీషన్‌కు నివేదించవచ్చన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం వినతిపత్రాలతో కూడిన పూర్తి వివరాలు, వీడియోలు, పాటో గ్రాప్స్ తదితర వాటిని కమీషన్‌కు సమర్పించాల్సి ఉన్నందున అన్నింటిని జాగ్రత్తగా సిద్ధం చేసుకోవాలని సూచించారు. కాగా ఎలాంటి ఒడిదుడుకలకు తావు లేకుండా అవసరమైన బందోబస్తును ఏర్పాటు చేస్తామని అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావు తెలిపారు. సమావేశంలో డీఆర్డీఓ సాయగౌడ్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి స్రవంతి, ఆర్డీఓ రాజేంద్రకుమార్, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ రమేష్ పాల్గొన్నారు.

## గజ్వేల్‌లో సైకిల్ ర్యాలీ నిర్వహించిన ఎసిపి



**ప్రజాపక్షం/గజ్వేల్:** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా శనివారం గజ్వేల్ పోలీస్ స్టేషన్ వద్ద గజ్వేల్ ఎసిపి పురుషోత్తం రెడ్డి జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ వారి సేవలను స్మరించుకుంటున్నట్లు పేర్కొన్నారు. అలాగే అమర వీరుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి త్యాగాలు, సేవలను గుర్తుకు చేయాలనే లక్ష్యంతో సైకిల్ ర్యాలీని ప్రారంభించినట్లు స్పష్టం చేశారు. పోలీసులు నిర్వహించే కఠినతరమైన విధులను ప్రజలకు తెలపాలనేది ప్రధాన ఉద్దేశమని చెప్పారు. పోలీసు అమరవీరులను అనునిత్యం స్మరించుకుంటూ, నిరంతరం ప్రజలలో చిరస్మరణీయంగా ఉండటానికి సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలలో పోలీసులతో సత్సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి ఉపయోగపడతాయని అన్నారు. ప్రజల పోలీసులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యం కాగా, కష్టసుఖాలలో పోలీసులు నిరంతరం భాగస్వాములు అవుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ సిఐ సైదా, అడిషనల్ సీఐ ముత్యంరాజు, ట్రాఫిక్ సిఐ మురళి, తొగుట సిఐ లతీఫ్, గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, మర్కుక్ ఎస్ఐ దామోదర్, కుకునూరు పల్లి ఎస్ఐ శ్రీనివాస్, గౌరారం ఎస్ఐ కరుణాకర్ రెడ్డి, జగదేవపూర్ ఎస్ఐ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు. కాగా మొదటగా పోలీసులు, విద్యార్థులు నిర్వహించిన సైకిల్ ర్యాలీలో పోలీసు అమరవీరుల త్యాగాలు స్మరించుకుంటూ నినాదాలు చేశారు.

## అమరుల త్యాగాలను స్మరిస్తూ పోలీసుశాఖ రక్తదాన శిబిరం



**ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధిః** తెలంగాణ రాష్ట్ర పోలీసు ఉన్నతాదికారి డిజిపి డా. జితేందర్ ఆదేశానుసారంగా పోలీసు అమర వీరుల ప్రాణత్యాగాలను స్మరిస్తూ అక్టోబర్ 21 నుండి 31 వరకు ఫ్లాగ్ డే వారోత్సవాలు నిర్వహించుచున్నారు ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం నాడు 26 అక్టోబర్ నాడు సంగారెడ్డి పోలీసు శాఖ ఆద్వర్యంలో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో రక్తదాన శిభిరం ఓపెన్ హౌస్ కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రక్తదాన శిభిరం రక్తదాన శిబిరంలో జిల్లా ఎస్‌పి స్వయంగా రక్తదానం చేసి అందరికి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగాఎస్‌పి మాట్లాడుతూ పోలీసు అదికారులు, పోలీస్ సిబ్బంది, సంగారెడ్డి జిల్లా పట్టణ యువకులు స్వచ్చందంగా అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ రక్తదాన శిభిరంలో సుమారు 61 యూనిట్ల రక్తాని సేకరించడం జరిగిందన్నారు. ఆరోగ్యంగా ఉండే ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని మీరు చేసే రక్తదానం ఆపదలో ఉన్న ఎంతో మంది ప్రాణాలను రక్షించడానికి ఉపయోగపడుతుందన్నారు. రక్త దానం చేసిన వారిలో సైబర్ సెల్ డిఎస్‌పి వేణుగోపారెడ్డి, ఎఆర్ డిఎస్‌పి నరేందర్, ఆర్‌ఐ రాజశేఖర్ రెడ్డి సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమానికి సుమారు 360 మంది విద్యార్థులు హాజరయ్యారు. పోలీసు శాఖ వినియోగస్తున్న ఆయుదాలు వాటి పనితీరును గురించి వివరిస్తూ నక్సల్ టెర్రరిస్టులతో పోరేడటప్పుడు ఏ విధంగా ఆయుదాలను వినియోగిస్తారని ధర్నాలు, రస్తారోకోలు చేస్తున్న సమయంలో గుంపును చెదరగొట్టడానికి వినియోగించే టీయర్ గ్యాస్ గన్స్ ,రబ్బర్ బుల్లెట్లు, వినియోగంపై ,బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ ద్వారా బాంబులను ఏ విధంగా నివృత్తి చేస్తామో అనే అంశాలను విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి, ఎ.సంజీవరావ్, సంగారెడ్డి డిఎస్పీ సత్తయ్య గౌడ్, జహీరాబాద్ డిఎస్‌పి రామ్‌మోహన్‌రెడ్డి, సైబర్ సెల్ డిఎస్‌పి వేణుగోపాల్ రెడ్డి ఏ.ఆర్ డిఎస్‌పి నరేందర్, డా.జ్యోతి ఎస్‌పి సైబర్ ఇన్స్పెక్టర్, రవి, యస్ బి ఎస్ఐ యాదవరెడ్డి, ఆర్ ఐలు రామరావు , రాజశేఖర్ రెడ్డి, డానియల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని బ్లడ్ బ్యాంకు కు చెందిన రాజు సిబ్బంది పాల్గొన్నారు.

## రైతన్నకు బాసటగా...

ఒకే రోజు ఏడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/బైంసా:** రైతాంగ సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, గత నాలుగు ఐదు రోజులుగా బిజెపి పార్టీ కార్యక్రమాల్లో భాగంగా హైదరాబాదులో ఉన్న ఎమ్మెల్యే మహాధర్నాను ముగించుకొని హుటా హుటిన నిన్న రాత్రి బైంసాకు చేరుకున్నారు. ఈ రోజు ఉదయం 9 గంటల నుండి ఆయన కుంటాల, మండలంలో పర్యటించారు. వరి రైతాంగానికి ఇబ్బందులు తలెత్తకుండా, కేంద్ర ప్రభుత్వ ద్వారా మద్దతు ధర ఇచ్చేందుకు కుంటాల మండలతో పాటు నర్సాపూర్ మండలంలో ఒకే రోజు ఏడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రారంభించాడు.

## పంచాయతీ కార్యదర్శుల పరేషాన్

అప్పుల ఊబిలో కార్యదర్శులు



**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ గ్రామ పంచాయతీ ల పదవి కాలం ఫిబ్రవరి నెలలో ముగిసిన విషయం తెలిసిందే అప్పటినుండి రాష్ట్రంలో ఉన్న అన్ని పంచాయతీలా ప్రత్యేక అధికారుల పాలన గత తొమ్మిది నెలలుగా కొనసాగుతుంది. పంచాయతీలలో కనీస అవసరాలు అయినా పారిశుద్ధం వీధి దీపాలు త్రాగునీరు ఇతర పనులకు సంబంధించిన సమస్యలు పరిష్కారానికి తమ చేతులమీదుగా పంచాయతీ కార్యదర్శులు జీతాలు చెల్లించడమే కాకుండా అప్పులు తెచ్చి అప్పుల ఊబిలో కురుకుపోయారు. దీంతో గ్రామ పంచాయతీ నిధులు లేక అష్ట కష్టాలు పడుతున్నారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీలు కావడంతో, పెండింగ్ బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడుగా ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమంలో నిధులు వేచించి అప్పటికి ఆ నిధులు రాకపోవడంతో పాటు సెప్టెంబర్ నుండి అక్టోబర్ వరకు స్వచ్ఛత ఈ సేవ ద్వారా పరిపాలన కొనసాగించినప్పటికి ఇంకాస్త అప్పుల ఊబిలో కురుక్కుపోయారు మార్చి ఏప్రిల్ మే నెలలో గ్రామాలలో తీవ్ర నీటి ఎద్దడి ఉండడంతో అప్పుడు నీటి ఎద్దడిని ఎదుర్కోవడానికి జిల్లా కలెక్టర్ సూచనల మేరకు గ్రామ పంచాయతీలలో నిధులు లేకపోయినా అప్పులు చేసి పనులు చేపట్టారు. మండల వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులు సమస్యల వలయంలో చిక్కుపోయారు మొత్తం పంచాయితీలు 34 ఉన్నప్పటికీ కొత్తగా ఒక పంచాయతీ ఏర్పడింది మొత్తం కలిపి 35 పంచాయతీలు ఉన్నాయి.

## పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివి



**ప్రజాపక్షం/ఇచ్చోడ:** విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివని ఇచ్చోడ సీఐ భీమేశ్, ఎస్ఐ తిరు పతి అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగం గా శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరంను నిర్వహిం చారు. రక్తదాన శిబిరానికి పోలీసులతో పాటు యువకులు, మహి ళలు వచ్చి స్వచ్ఛందంగా రక్తంను దానం చేశారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐ మాట్లాడారు. బాధితులకు సత్వర న్యాయం అందించడం, ధర్మం పక్షాన నిలిచి మెరుగైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తున్నదని వారు స్పష్టం చేశారు. రక్తదాన శిబిరంలో 90 యూనిట్ల రక్తంను సేకరించినట్లు వారు పేర్కొన్నారు. రక్తదానం మహాదానమని, రక్త దానంపై ఎలాంటి అపోహాలు పెట్టుకోవద్దని తెలిపారు. రక్తం దానం చేయడం సామాజిక సేవ అని, ఆపదలో ఉన్న వారిని కాపాడడానికి రక్తం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రక్తం ను దానం చేసిన యువకులు, మహిళలు, పోలీస్ సిబ్బందికి వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ, గుడిహత్నూర్, సిరికొండ ఎస్ఐలు నవీన్, ఇమ్రాన్, శ్రీకాంత్, ఏఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టిజిజెఎసి నిర్మల్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక...



**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్:** నిర్మల్ జిల్లా తెలంగాణ ఉద్యోగ గెజిటెడ్ అధికారుల ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి(టిజిజెఎసి) కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా జెఎసి కన్వీనర్ గా వెలుమల ప్రభాకర్‌ను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు వెలుమల ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే నిర్మల్ జిల్లాకు ఒక ప్రత్యేక స్థానము, క్రమశిక్షణగా అన్ని సంఘాల ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ రాష్ట్ర జెఎసి ఆదేశాల ప్రకారం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సంఘ బాధ్యులుగా ఎన్నుకోబడిందిన్నారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్న కార్యవర్గానికి, నాకు జెఎసి చైర్మన్‌గా అన్ని సంఘాల నాయకులు ఏకగ్రీవంగా అవకాశం ఇచ్చినందుకు వివిధ సంఘాల నాయకులకు ప్రైమరీ మెంబర్స్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. కొత్తగా ఏర్పడిన జెఎసి ఉద్యోగుల సంక్షేమంకొరకై కష్టపడాలని ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందే విధంగా కృషి చేస్తామన్నారు.

క్రీడ

# చరిత్ర సృష్టించిన న్యూజిలాండ్!



**న్యూ**జిలాండ్ టెస్ట్ టీమ్ చరిత్ర సృష్టించింది. 147 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే భారత్ గడ్డపై తొలిసారి టెస్ట్ సిరీస్ కైవసం చేసుకుంది. పుణె వేదికగా శనివారం ముగిసిన రెండో టెస్ట్‌లో న్యూజిలాండ్ 113 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. 359 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా 60.2 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌటైంది. యశస్వి జైస్వాల్(65 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 77) హాఫ్ సెంచరీతో రాణించగా.. రవీంద్ర జడేజా(84 బంతుల్లో 2 ఫోర్లతో 42) పర్వాలేదనిపించాడు. న్యూజిలాండ్ బౌలర్లలో మిచెల్ సాంట్నర్(6/104) ఆరు వికెట్లతో మరోసారి భారత్ పతనాన్ని శాసించాడు. ఆజామ్ పటేల్‌కు రెండు వికెట్లు దక్కగా.. గ్లేన్ ఫిలిప్స్‌కు ఓ వికెట్ దక్కింది. ఈ గెలుపుతో న్యూజిలాండ్ 20తో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ కైవసం చేసుకుంది. మరోవైపు భారత్ 12 ఏళ్ల తర్వాత సొంత గడ్డపై టెస్ట్ సిరీస్ కోల్పోయింది. 2012లో చివరిసారిగా ధోనీ సారథ్యంలోని టీమిండియా.. సొంత గడ్డపై ఇంగ్లండ్ చేతిలో టెస్ట్ సిరీస్ కోల్పోయింది. ఆ తర్వాత వరుసగా 18 టెస్ట్ సిరీస్‌లు గెలిచిన టీమిండియా.. తాజా సిరీస్‌లో మాత్రం ఖంగుతిన్నది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 259 పరుగులు చేసింది. డెవాన్ కాన్వే(141 బంతుల్లో 11 ఫోర్లతో 76), రచిన్ రవీంద్ర(105 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 65) హాఫ్ సెంచరీలతో రాణించారు.

### టీమిండియా ఓటమి..

భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్(7/59), రవిచంద్రన్ అశ్విన్(3/64) కివీస్ పతనాన్ని శాసించారు. అనంతరం భారత్.. తొలి ఇన్నింగ్స్‌లో 156 పరుగులకు కుప్పకూలింది. న్యూజిలాండ్ బౌలర్లలో మిచెల్ సాంట్నర్(7/53) స్టన్నింగ్ బౌలింగ్‌తో టీమిండియా పతనాన్ని శాసించాడు. గ్లేన్ ఫిలిప్స్ 2 వికెట్లు తీయగా.. టీమ్ సౌథీ ఓ వికెట్ పడగొట్టాడు. భారత బ్యాటర్లలో రవీంద్ర జడేజా(38), యశస్వి జైస్వాల్(30), శుభ్‌మన్ గిల్(30) టాప్ స్కోరర్లుగా నిలిచారు. 103 పరుగుల భారీ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా.. రెండో ఇన్నింగ్స్‌లో 255 పరుగులు చేసింది. టీమిండియా బ్యాటర్ల వైఫల్యం ఓటమికి కారణమైంది. ముఖ్యంగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ పేలవ బ్యాటింగ్ జట్టు విజయవకాశాలను దెబ్బతీసింది.

## ఆ తప్పిదమే మా ఓటమిని శాసించింది: రోహిత్ శర్మ



**పే**లవ బ్యాటింగే తమ ఓటమిని శాసించిందని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ అన్నాడు. న్యూజిలాండ్‌తో పుణె వేదికగా జరిగిన రెండో టెస్ట్‌లో టీమిండియా 113 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. రెండో టెస్ట్ అనంతరం తమ పరాజయంపై స్పందించిన రోహిత్ శర్మ.. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ తమకంటే మెరుగైన ప్రదర్శన చేసిందని ప్రశంసించాడు. 'ఈ ఓటమి తీవ్ర నిరాశకు గురిచేసింది. ఇది మేం ఏ మాత్రం ఊహించని ఫలితం. న్యూజిలాండ్ మా కంటే మెరుగైన ప్రదర్శన చేసింది. ఈ మ్యాచ్‌లో ఎదురైన సవాళ్లను అధిగమించడంలో మేం విఫలమయ్యాం. దాంతోనే ఓటమిపాలయ్యాం. బ్యాటింగ్‌లో మేం మెరుగైన ప్రదర్శన చేయలేదు. స్కోర్ బోర్డుపై కావాల్సిన పరుగులు ఉంచలేదు. బౌలర్లు 20 వికెట్లు తీయాలంటే... బ్యాటర్లు కూడా బోర్డుపై కావాల్సిన పరుగులు పెట్టాలి. ఈ విషయంలో మేం విఫలమయ్యాం. తొలి ఇన్నింగ్స్‌లో 100 పరుగుల ఆధిక్యాన్ని సమర్పించుకున్నాం. ఇలాంటి పరిస్థితుల నుంచి పుంజుకునేందుకు మేం పోరాడాం. కానీ ఇది ఛాలెంజింగ్‌గా ఉంటుంది. ఈ లక్ష్యాన్ని మేం ఛేధించాలనుకున్నాం. కానీ ఈ క్రమంలో ఎదురైన సవాళ్లను ఎదుర్కోలేకపోయాం. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్‌ను 200/3 నుంచి 259 పరుగులకే పరిమితం చేయడం గొప్ప విషయం. ఈ మ్యాచ్‌లో ఉన్నట్లుగా ఉండే పిచ్ ఏ మాత్రం కాదు ఇది. కానీ మేం సరిగ్గా బ్యాటింగ్ చేయలేదు. న్యూజిలాండ్ మా కంటే మెరుగ్గా ఆడింది. డబ్ల్యుటిసి పాయింట్స్ టేబుల్ గురించి ఆలోచించడం లేదు. వాంఖడే టెస్ట్ గెలవాలనుకుంటున్నాం. ఈ సిరీస్ ఓటమి సమష్టి వైఫల్యం. ప్రత్యర్థి విసిరిన సవాళ్లను స్వీకరించడంలో మా జట్టు విఫలమైంది.'అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు.

## ఓపెనర్‌గా సంజూ శాంసన్..

### సౌతాఫ్రికాతో టీ20 సిరీస్ ఆడే భారత తుది జట్టు

**నా**లుగు టీ20ల సిరీస్ కోసం టీమిండియా సౌతాఫ్రికా పర్యటనకు వెళ్లనుంది. నవంబ ర్ 8 నుంచి ఈ సిరీస్ ప్రారంభం కానుంది. ఇప్పటికే ఈ పర్యటనకు వెళ్లనే భారత జ ట్టును బిసిసిఐ ప్రకటించింది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని 16 మంది సభ్యులతో కూ డిన జట్టు వివరాలను శుక్రవారం వెల్లడించింది. భారత్ –ఎ తరఫున ఎమర్జింగ్ ఆసియా కప్ 2024 టోర్నీలో సత్తా చాటిన రమణ్‌దీప్ సింగ్ సౌతాఫ్రికా పర్యటనకు ఎం పిక య్యాడు. అతనితో పాటు కర్ణాటక బౌలర్ విజయ్‌కుమార్ వైశాఖ్ కూడా తొలిసారి టీమిండియా పిలుపును అందుకున్నాడు. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, రింకూ సింగ్, తిలక్ వర్మ, జితేష్ శర్మ, హార్దిక్ పాండ్యా, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, అక్షర్ పటేల్ తమ స్థానాలను నిలబెట్టుకున్నాడు. ఆవేశ్ ఖాన్, యశ్ దయాల్ రీఎంట్రీ ఇచ్చారు.

**మయాంక్ యాదవ్ దూరం..**

బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్ ఆడిన రియాన్ పరాగ్, మయాంక్ యాదవ్‌లతో పాటు పేస్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే గాయాలతో ఈ పర్యటనకు దూరమయ్యారు. ఇటీవలే అంతర్జాతీయ టీ20ల్లోకి అడుగుపెట్టిన మయాంక్ యాదవ్ మూడు మ్యాచ్‌ల వ్యవధిలోనే గాయపడ్డాడు. ఈ జట్టులోని కుర్రాళ్లు సౌతాఫ్రికా పర్యటనలో ఏ మేరకు రాణిస్తారో చూడాలి. సూర్యకుమార్ యాదవ్ మినహా పెద్దగా ఎవరికీ సౌతాఫ్రికా గడ్డపై ఆడిన అనుభవం లేదు. దాంతో తుది జట్టు ఎంపికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్‌లో ఓపెనర్‌గా సత్తా చాటిన సంజూ శాంసన్‌తో పాటు అభిషేక్ శర్మలు.. సఫారీ గడ్డపై టీమిండియా ఇన్నింగ్స్‌ను ప్రారంభించనున్నారు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫస్ట్ డౌన్‌లో ఆడనుండగా.. తిలక్ వర్మ, రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా నాలుగు, ఐదు, ఆరు స్థానాల్లో బ్యాటింగ్ చేయనున్నారు. స్పిన్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్, స్పెషలిస్ట్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి బరిలోకి దిగనున్నారు. ప్రధాన పేసర్లుగా.. అర్ష్‌దీప్ సింగ్, ఆవేశ్ ఖాన్ బరిలోకి దిగనుండగా.. మూడో పేసర్‌గా యశ్ దయాల్, విజయ్ కుమార్ వైశాఖ్‌ల మధ్య పోటీ నెలకొంది.

**సౌతాఫ్రికాతో టీ20 సిరీస్..**
**భారత తుది జట్టు(అంచనా):**

సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, రింకూ సింగ్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి/రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్, ఆవేశ్ ఖాన్, యశ్ దయాల్/విజయ్ కుమార్ వైశాఖ్.

**సౌతాఫ్రికాతో టీ20 సిరీస్‌కు భారత జట్టు:**సూర్యకుమార్ యాదవ్, అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, రింకూ సింగ్, తిలక్ వర్మ, జితేష్ శర్మ, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రమణదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్, విజయ్ కుమార్ వైశాఖ్, ఆవేశ్ ఖాన్, యశ్ దయాల్

రీల్



## ఉస్తాద్ భగత్ సింగ్ రీమేక్ కాదు

**ప**వర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా చేస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో రెండు భారీ పాన్ ఇండియా సినిమాలతో పాటుగా ఓ రీజనల్ పక్కా మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ కూడా ఉన్న సంగతి తెలిసిందే. మరి ఆ సినిమానే దర్శకుడు హరీష్ శంకర్ తో చేస్తున్న చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. చాలా ఏళ్ళ తర్వాత చేస్తున్న సినిమా ఇది కావడంతో దీనిపై సాలిడ్ హైప్ నెలకొంది. అలాగే దీనితో పాటుగా సినిమా నుంచి వచ్చిన పోస్టర్స్, గ్లింప్స్ కి కూడా సాలిడ్ రెస్పాన్స్ వచ్చింది. అయితే ఈ సినిమా విషయంలో మొదటి నుంచి తమిళ చిత్రం తేరి కి రీమేక్ అంటూ పెద్ద రచ్చ నడిచిన సంగతి తెలిసిందే. అయితే అసలు ఇది ఆ సినిమాకి రీమేక్ కాదు అని ఈ సినిమాకి రచయితగా వర్క్ చేస్తున్న దశరద్ చెప్పిన మాటలు వైరల్ గా మారాయి. ఆ సినిమా దానికి రీమేక్ కాదు కానీ ఏవో పోలికలు కనిపించి ఉండొచ్చు కానీ రీమేక్ అయితే కాదు అని అంటున్నారు. మరి ఈ సినిమా రీమేక్ కాదు స్ట్రెయిట్ సినిమా అని హరీష్ శంకర్ అయితే ఇప్పుడు వరకు ఎక్కడా చెప్పలేదు. మరి దీనిపై ఫ్యాన్స్ ఏమంటారో చూడాలి.



## ఢిల్లీ మళ్ళీ తిరిగొస్తాడు.. ఖైదీ 2 పై లోకేష్

**కో**లీవుడ్ టాలెంటెడ్ హీరో కార్తీ నటించిన పలు ఐకానిక్ హిట్ చిత్రాల్లో థియేటర్స్ లో అదిరే ఎక్స్ పీరియన్స్ ఇచ్చిన చిత్రం ఖైదీ కూడా ఒకటి. దర్శకుడు లోకేష్ కనగరాజ్ కి కూడా మంచి గుర్తింపుని తీసుకొచ్చిన సినిమా కూడా ఇదే. అయితే ఈ సినిమా తర్వాత వచ్చిన విక్రమ్ చూసాక లోకేష్ కనగరాజ్ క్రియేట్ చేసిన యూనివర్స్ తో ఓ రేంజ్ లో మూవీ లవర్స్ ఎగ్జైట్ అయ్యిపోయారు. అయితే లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ అంతటికీ ఆరంభమే కార్తీ నటించిన ఖైదీ అందులో తన ఢిల్లీ పాత్ర. మరి విక్రమ్ తర్వాత ఖైదీ 2 పై భారీ అంచనాలు నెలకొన్నాయి. దీనితో ఖైదీ 2 కోసం చాలా ఏళ్ళ నుంచి అభిమానులు ఎదురు చూస్తూ నేటితో ఖైదీ వచ్చి ఏకంగా ఆరేళ్ళు అయ్యిపోయింది. దీనితో లోకేష్ కనగరాజ్ ఇంట్రెస్టింగ్ పోస్ట్ చేసాడు. మొత్తం మొదలైంది ఇక్కడే.. కార్తీ గారికి నా నిర్మాత ప్రభు గారికి ఈ యూనివర్స్ మొదలు కావడానికి కారణం అయ్యినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అంటూ లాస్ట్ లో త్వరలోనే ఢిల్లీ మళ్ళీ తిరిగి వస్తాడు అంటూ చేసిన ట్యాగ్ హైలైట్ అయ్యింది. మరి ఈ సినిమా కోసం అయితే తమిళ్ తో పాటుగా తెలుగులో కూడా ఆడియెన్స్ చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



## ఇండియాలో బిగ్గెస్ట్ రిలీజ్‌తో 'పుష్ప 2'

**ప్ర**స్తుతం పాన్ ఇండియా సినిమా దగ్గర భారీ అంచనాలు ఉన్న లేటెస్ట్ చిత్రాల్లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ దర్శకుడు సుకుమార్ కాంబినేషన్ లో చేస్తున్న భారీ సీక్వెల్ సినిమా పుష్ప 2 ది రూల్ కూడా ఒకటి. ఇక ఇండియాలో అయితే ఆల్రెడీ కన్నడ, మళయాళ హిందీ భాషల్లో పుష్ప 2 బిగ్గెస్ట్ రిలీజ్ ఉంటుంది అని మేకర్స్ కన్ఫామ్ చేశారు. అయితే లేటెస్ట్ గా వరల్డ్ వైడ గా కూడా పుష్ప 2 కి ఆల్ టైం హైయెస్ట్ రిలీజ్ ఉండబోతుంది అని తెలుస్తుంది. ఇలా పుష్ప 2 ప్రపంచ వ్యాప్తంగా ఏకంగా 11 వేల 500 స్క్రీన్స్ కి పైగా విడుదల కాబోతుంది అని తెలుస్తుంది. దీనితో ఇదే ఇండియన్ సినిమా నుంచి హైయెస్ట్ రిలీజ్ అన్నట్టుగా తెలుస్తుంది. మొత్తానికి పుష్ప 2 తో మాత్రం సరికొత్త రికార్డులే నమోదు అయ్యేలా ఉన్నాయని చెప్పాలి.

# అభివృద్ధిపై విష ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల మూలంగా భూ రిజిస్ట్రేషన్లలో స్తబ్దత ఏర్పడిందని, ప్రస్తుతం రిజిస్ట్రేషన్లు ఊపందుకున్నాయని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. రియల్టర్లకు బ్యాంకర్లతో ఉన్న సమస్యలపై తాము మాట్లాడడం జరిగిందని, త్వరలోనే ఎస్ఎల్ బిసి సమావేశం ఏర్పాటు చేయిస్తామన్నారు. రియల్టర్ల సమస్యలు వినడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గత ప్రభుత్వం లాగా వారికి అనుకూలంగా ఉన్న వాళ్లను దగ్గరగా తీయడం.. లేని వాళ్లను దూరం పెట్టడం వంటి ఆలోచన తమ కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు. హైటెక్స్‌లో శనివారం నారెడ్కో ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షోలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ భారతదేశంలో భవిష్యత్తు హైదరాబాద్ నగరానిదేనన్నారు. మూసీ పునరుజ్జీవనం , రీజినల్ రింగ్ రోడ్, 30 వేల ఎకరాలలో అద్భుతమైన హైదరాబాద్ ఫ్యూచర్ సిటినీ నిర్మిస్తున్నామన్నారు. ఎయిర్ పోర్ట్ నుంచి 30 నిమిషాల్లో ఫ్యూచర్ సిటీకి చేరుకోవచ్చునని, అక్కడ ప్రపంచ స్థాయి యూనివర్సిటీ, క్రికెట్ స్టేడియం, ఐటి పరంగా ఎఐ ప్రాజెక్టులు చేపడుతున్నామని, అంతే కాకుండా 30 వేల ఎకరాల్లో 15 వేల ఎకరాలు గ్రీన్ బెల్ట్ గా ఉంటుందని ఆయన వెల్లడించారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి రూ. 10 వేల కోట్లు కేటాయించామని, ఇది క్యాపిటల్ ఎక్స్‌పెండేచర్ మాత్రమేనన్నారు. రాజధాని నగరానికి మంచినీటి ఎద్దడి లేకుండా గోదావరి, కృష్ణా , మంజీరా నదుల నుంచి తాగునీరు అందిస్తున్నామన్నారు. కాలుష్య డ్రైనేజీలను శుద్ధి చేసేందుకు 39 ఎస్‌టిపిలు మంజూరు చేశామన్నారు. మూసీ నిర్వాసితులకు అద్భుతమైన జీవితాన్ని ఇవ్వాలని ఆలోచనలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. మూసీ నిర్వాసితులకు అక్కడే అద్భుతమైన టవర్స్ నిర్మిస్తామని, వారు సకల సౌకర్యాలతో ఉండేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. మూసీ నిర్వాసితుల పిల్లలకు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తామని, నిర్వాసితులైన డ్వాక్రా మహిళలకు రూ. 1000 కోట్ల వడ్డీ లేని రుణాలు ఇస్తామన్నారు. అంతే కాకుండా చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధిని కల్పిస్తామన్నారు. హైడ్రాపై కుట్రపూరితంగా కొందరు విష ప్రచారం చేస్తున్నారని అన్నారు. హైడ్రాకు జిహెచ్‌ఎంసి, హెచ్ఎండిఏ వంటి ప్రభుత్వ సంస్థలు అనుమతులు ఇస్తాయన్నారు.


















Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com